ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

Published From Nizamabad

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275



ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
&
Public Notice
Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526



గురువారం | 14-05- 2026 | సంపుటి: 17, సంచిక: 41, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆


## వరంగల్, కరీంనగర్, ఖమ్మం కార్పొరేషన్లపై

# ప్రత్యేక దృష్టి

## మూడు నగరాలకు ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదన : సీఎం రేవంత్

**25 ఏళ్ల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా డిజైన్ చేయాలని ఆదేశం**

**టెంపుల్, టూరిజం కారిడార్ల అభివృద్ధిపై కీలక నిర్ణయాలు**

**ఈవీ వాహనాలు, సోలార్ విద్యుత్ వినియోగంపై ప్రత్యేక ప్రాధాన్యం**

**ట్రాఫిక్ నియంత్రణకు ఏఐ సాంకేతికత వినియోగంపై దిశానిర్దేశం చేసిన సీఎం**



హైదరాబాద్, మే 13 (ప్రజాకలం) : రాష్ట్రంలోని పట్టణాభివృద్ధి రంగాన్ని దీర్ఘకాలిక దృష్టితో సమగ్రంగా రూపుదిద్దాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ కార్పొరేషన్లు మాత్రమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపాదిత మెగా గ్రోత్ కారిడార్లన్నింటికీ ఒకే విధమైన అభివృద్ధి నమూనాను అమలు చేయాలని ఆయన సూచించారు. ముఖ్యంగా వరంగల్, కరీంనగర్, ఖమ్మం కార్పొరేషన్లను కేంద్ర బిందువులుగా చేసుకుని రూపొందిస్తున్న అభివృద్ధి ప్రణాళికలు తెలంగాణ భవిష్యత్ ఆర్థిక, పట్టణ వృద్ధికి కీలకం గా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీలో మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో సీఎం పలు వ్యూహాత్మక సూచనలు చేశారు. ఈ మూడు ప్రధాన నగరాల అభివృద్ధిని వేగవంతం చేయడానికి ప్రత్యేకంగా ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని, అదే విధంగా రవాణా సౌకర్యాలు, మౌలిక వసతులు, నగర విస్తరణ ప్రణాళికలను సమన్వయంతో అమలు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గ్రోత్ కారిడార్ల అభివృద్ధికి కూడా ఆయన స్పష్టమైన మార్గనిర్దేశం చేశారు. మహబూబ్‌నగర్, భూత్పూర్, జడ్చర్లను కలుపుతూ సమగ్ర అభివృద్ధి కారిడార్ రూపొందించాలని సూచించగా, కొత్తగూడెం–పాల్వంచ–సుజాత నగర్ ప్రాంతాలను ఒకే అభివృద్ధి జోన్‌గా తీర్చిదిద్దాలని ఆదేశించారు. అదేవిధంగా నల్గొండ–యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని, ఆదిలాబాద్, నాగోబా, బాసర, కడెం ప్రాజెక్టులను అనుసంధానిస్తూ టూరిజం కారిడార్ అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు.

తరువాయి 2వ పేజీలో...



### ప్రతి దరఖాస్తు జవాబుదారీతనంతో మూడు నెలల్లో

# పరిష్కారానికి చర్యలు

**రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**జూన్ 2 నుంచి రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రారంభం**

**పారదర్శకంగా పరీక్షలు నిర్వహించి ఎలాంటి లీకులు లేకుండా 70 వేల ఉద్యోగాలు భర్తీ**

**ధరణి, సాదా బైనామా సమస్యలను భూ భారతి ద్వారా పరిష్కరిస్తాం**

**కూసుమంచి మండలం జీళ్లచెరువులో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి**

పాలేరు మే13( ప్రజా కలం న్యూస్ ) ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ కార్యక్రమం సమర్థవంతమైన వేదికగా నిలుస్తోందని, ప్రతి దరఖాస్తు జవాబుదారీ తనంతో మూడు నెలల్లోగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం కూసుమంచి మండలం జీళ్లచెరువులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజుల్లోనే అధికారులను ప్రజల వద్దకు పంపించి సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కార చర్యలు చేపట్టామని తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...



## వ్యక్తిగత కారణాలతో నేడు విచారణకు హాజరు కాలేను

**పేట్‌బషీరాబాద్ పోలీసులకు మెయిల్ పంపిన భగీరథ్**

**పోక్సో కేసు దర్యాప్తులో భాగంగా విచారణకు రావాల్సిన పరిస్థితి**

**దర్యాప్తుకు పూర్తిగా సహకరిస్తానని లేఖలో భరోసా**

**మరో తేదీ ఇవ్వాలని పోలీసులను కోరిన భగీరథ్**

హైదరాబాద్, మే 13 (ప్రజాకలం) : పోక్సో కేసు నేపథ్యంలో పేట్‌బషీరాబాద్ పోలీసులు నిర్వహిస్తున్న దర్యాప్తులో భాగంగా విచారణకు హాజరు కావాల్సిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ నేడు హాజరు కాలేకపోయారు. ఈ మేరకు ఆయన పోలీసులకు అధికారికంగా మెయిల్ ద్వారా వివరణ ఇచ్చారు.

తరువాయి 2వ పేజీలో...

### కేంద్రం వివక్షపై రాజీలేని

# పోరాటం చేస్తా

### – పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ



పెద్దపల్లి,మే 13:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని, రాష్ట్రానికి రావాల్సిన నిధుల్లో కోత విధిస్తూ అన్యాయం చేస్తోందని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు వంశీ కృష్ణ మండిపడ్డారు. బుధవారం పెద్దపల్లి గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వంశీకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ నుంచి కేంద్రానికి అత్యధికంగా పన్నులు వెళ్తున్నప్పటికీ, తిరిగి నిధుల కేటాయింపుల్లో మాత్రం అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. బీహార్, యూపీ వంటి రాష్ట్రాలకు పెద్దపీట వేస్తూ, తెలంగాణకు రావాల్సిన సెమీ కండక్టర్

తరువాయి 2వ పేజీలో...

### బంగారం దిగుమతి సుంకం 6% నుంచి

# 15%కి భారీ పెంపు

**కిలో బంగారంపై పన్ను రూ.22.5 లక్షలకు చేరిక**

**గతంతో పోలిస్తే రూ.13.5 లక్షల అదనపు భారం**

**పెరిగిన ధరలతో వినియోగంపై తీవ్ర ప్రభావం అంచనా**

**స్మగ్లింగ్ పెరుగుతుందన్న నిపుణుల హెచ్చరికలు**

**వాణిజ్య లోటు, రూపాయి బలహీనతపై ఆందోళన**



న్యూఢిల్లీ, మే 13: అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు, పెరుగుతున్న దిగుమతుల ఒత్తిడి, రూపాయి విలువలో కొనసాగుతున్న పతనం వంటి కారణాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం బంగారం దిగుమతులపై కీలక నిర్ణయంతీసుకుంది. దేశ విదేశీ మారక నిల్వలను కాపాడుకోవడం, వాణిజ్య లోటును నియంత్రించడం లక్ష్యంగా బంగారం దిగుమతి సుంకాన్ని 6 శాతం నుంచి 15 శాతానికి భారీగా పెంచింది. ఈ నిర్ణయం భారత ఆర్థిక వ్యవస్థలో బంగారం పాత్రపై మళ్లీ తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ కొత్త సుంక విధానం అమలులోకి వచ్చిన తరువాత, ఒక్క కిలో బంగారం దిగుమతిపై చెల్లించాల్సిన పన్ను భారం సుమారు రూ. 22.5 లక్షలకు చేరింది. గతంలో 6 శాతం సుంకం ఉన్న సమయంలో ఇదే కిలోపై దాదాపు రూ. 9 లక్షల వరకు మాత్రమే పన్ను ఉండేది. అంటే ఇప్పుడు ఒక్క కిలో బంగారం దిగుమతిపై అదనంగా సుమారు రూ. 13.5 లక్షల భారాన్ని వ్యాపారులు భరించాల్సి వస్తోంది. ఈ భారీ పెరుగుదల నేరుగా మార్కెట్ ధరలపై ప్రభావం చూపే అవకాశముందని ఆర్థిక వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రభుత్వం ఈ చర్య ద్వారా బంగారం దిగుమతులను తగ్గించి, విదేశాలకు వెళ్తున్న డాలర్ల ప్రవాహాన్ని నియంత్రించాలని భావిస్తోంది. భారతదేశంలో బంగారం డిమాండ్ చాలా అధికంగా ఉండటంతో, ప్రతి సంవత్సరం భారీ మొత్తంలో దిగుమతులు జరుగుతున్నాయి.

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్




### ఓదెల మల్లన్న క్షేత్ర అభివృద్ధికి

# నిరంతర కృషి

### - ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు



పెద్దపల్లి,మే13:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఓదెల శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయాన్ని అన్ని హంగులతో అభివృద్ధి చేస్తామని, గ్రామాల ప్రగతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. బుధవారం ఓదెల మండలం మరియు గుండ్లపల్లి గ్రామాల్లో ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు

తరువాయి 2వ పేజీలో...

# బీజేపీ, టీడీపీ, జనసేన కలిసొచ్చినా ఇబ్బందేమీ లేదు

### - ఇక్కడ బీజేపీ బలహీనంగా ఉందనే మోదీ పర్యటించారు : టీపీసీసీ చీఫ్ మహేశ్



హైదరాబాద్, మే 13 (ప్రజాకలం) : తెలంగాణలో బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి పోటీచేసినా తమకు ఇబ్బందేమీ లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ అన్నారు. ఆ మూడు పార్టీలకు కలిపి పడే ఓట్లు 30 శాతం కూడా దాటబోదన్నారు. రాష్ట్రంలో బీజేపీ బలహీనంగా ఉందన్న సంగతి అర్థమయ్యే ప్రధాని మోదీ పర్యటించారని తెలిపారు. గాంధీభవన్‌లో బుధవారం మహేశ్‌గౌడ్ మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ తెలంగాణలోనూ బెంగాల్ తరహాలో సెక్యులర్ ఓట్లను తొలగించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రధాని తెలంగాణకు వస్తున్నప్పుడు రాష్ట్రానికి కావాల్సింది అడగాలన్న సోయి బీజేపీ ఎంపీలకు లేకుండా పోయిందని విమర్శించారు. గడిచిన 12 ఏళ్లలో పొదుపు గురించి ప్రధాని మోదీ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధర తగ్గినప్పుడు.. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాల్సింది పోయి.. పెంచేశారని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తనతో కలిసి రావాలంటూ ప్రధాని మోదీ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. రేవంత్‌రెడ్డి నిఖార్సయిన కాంగ్రెస్ నాయకుడని స్పష్టం చేశారు. ప్రజలు కేసీఆర్‌కు ప్రతిపక్ష నేత బాధ్యతలు అప్పగిస్తే.. ఆ పాత్ర పోషించకుండా ఆయన ఫామ్ హౌస్‌కు పరిమితమయ్యారని దుయ్యబట్టారు. మంత్రి పదవి కంటే.. టీపీసీసీ చీఫ్‌గానే తాను సంతోషంగా, గర్వంగా ఉంటానని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కాగా.. గాంధీభవన్‌లో బుధవారం నాయీబ్రాహ్మణ సంఘాల నేతలతో మహేశ్‌గౌడ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలను సదరు నేతలు మహేశ్‌గౌడ్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులు సహా అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు.

### వరంగల్, కరీంనగర్, ఖమ్మం కార్పొరేషన్లపై

# ప్రత్యేక దృష్టి

మొదటి పేజీ తరువాయి...

ఈ కారిడార్లు రాష్ట్రంలో పర్యాటక, ఆధ్యాత్మిక, ఆర్థిక వృద్ధికి కొత్త దిశను ఇస్తాయని ఆయన పేర్కొన్నారు. కృష్ణా పుష్కరాల దృష్ట్యా అలంపూర్ జోగులాంబ ఆలయ అభివృద్ధి ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేయాలని, భవిష్యత్‌లో పెద్ద సంఖ్యలో భక్తులు రాకను దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. అలాగే సింగరేణి పరిధిలో ఉన్న అన్ని మున్సిపాలిటీలను ఒకే యూనిట్‌గా అభివృద్ధి చేయాలని, అక్కడి అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన సింగరేణి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) నిధులను స్థానిక అవసరాలకు మాత్రమే వినియోగించాలన్న ఆదేశాలు జారీ చేశారు. గ్రోత్ కారిడార్‌ల రూపకల్పనలో మౌలిక వసతుల అంశాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. ఘన వ్యర్థాల నిర్వహణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు (ఎస్టిపిలు), భూగర్భ డ్రైనేజీ వ్యవస్థలు, రింగ్ రోడ్లు వంటి ఆధునిక సదుపాయాలను సమగ్రంగా ప్లాన్ చేయాలని సూచించారు. రాబోయే 25 సంవత్సరాల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ప్రాజెక్టును దీర్ఘకాలికంగా రూపొందించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రతిపాదిత విమానాశ్రయాల అభివృద్ధి దృష్ట్యా వరంగల్, ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో పట్టణ ప్రణాళికలను వేగవంతం చేయాలని సీఎం సూచించారు.

వరంగల్ విమానాశ్రయం ఏర్పాటుతో ఆ ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని ఆయన అన్నారు. అలాగే విమానాశ్రయాల అవసరాలకు అనుగుణంగా నీటి వనరులు, మౌలిక సదుపాయాల ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆదిలాబాద్ విమానాశ్రయం రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు కానుందని కూడా సమావేశంలో ప్రస్తావించారు. పట్టణాల్లో వ్యయ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో ఈవీ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలని సీఎం సూచించారు. మున్సిపాలిటీల్లో ఉపయోగించే లీజు వాహనాలు కూడా తప్పనిసరిగా ఈవీ వాహనాలే ఉండాలని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా ప్రతి పట్టణంలో సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసి పునరుత్పాదక శక్తి ఉత్పత్తిని పెంచాలని, నగరాల్లో విద్యుత్ అవసరాలను స్థానికంగానే తీర్చుకునే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, నగర నిర్వహణను మరింత సమర్థవంతంగా చేయడానికి కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను వినియోగించాలని, ఇందుకోసం నిపుణుల సలహాలు తీసుకుని ఆధునిక స్మార్ట్ సిటీ మోడళ్లను అమలు చేయాలని సీఎం ఆదేశించారు.

మొత్తం మీద, రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాలు, గ్రోత్ కారిడార్‌లు ఒకే విధమైన ప్రణాళికా వ్యవస్థలోకి తీసుకువచ్చి, భవిష్యత్ 25 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర అభివృద్ధి జరగాలని ముఖ్యమంత్రి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

# కేంద్రం వివక్షపై రాజీలేని పోరాటం చేస్తా

మొదటి పేజీ తరువాయి...

పరిశ్రమను ఆంధ్రకు తరలించారని విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కేంద్రం వెడలు వంచి వ్యతిరేకించామని గుర్తు చేశారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో యూరియా ఉత్పత్తిపై నిర్లక్ష్యం వహిస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని, మోదీ ప్రభుత్వం అమెరికా ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తోందని ఎద్దేవా చేశారు. మంచిర్యాల జిల్లా ధాన్యం కొనుగోలు విషయంలో పెద్దపల్లి కలెక్టర్ వివక్ష చూపుతున్నారని వంశీ కృష్ణ ఆరోపించారు. పెద్దపల్లి జిల్లాలో 6 లక్షల మెట్రిక్ టన్నుల గోదాం సామర్థ్యం ఉన్నప్పటికీ, కేవలం 2.50 లక్షల టన్నులు మాత్రమే ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు. దళిత రైతులు ఎక్కువగా ఉన్నందునే ఈ నిర్లక్ష్యమా అని నిలదీశారు. అధికారులు రాజకీయం మానుకోవాలని, ప్రజా సమస్యలు పరిష్కరించని పక్షంలో వారికి సరైన రీతిలో బుద్ధి చెప్పుతామని హెచ్చరించారు. రైతుల గోస పట్టని పక్షంలో ఎంతటి పోరాటానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. కరీంనగర్ బీజేపీ ఎంపీ, కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ విషయంలో కేటీఆర్ అనవసర రాజకీయాలు చేస్తున్నారని ఎంపీ విమర్శించారు. గత పదేళ్ల పాలనలో కేటీఆర్ విలాసవంతమైన జీవితం గడిపారని ఆరోపిస్తూ, వ్యక్తిగత విమర్శలు చేశారు. భగీరథ్ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని, దీనిని రాజకీయాలకు వాడుకోవడం సరికాదని హితవు పలికారు. అధికారంలో ఉన్నా లేకున్నా పెద్దపల్లి పార్లమెంటు ప్రజల కోసం బరాబర్ ప్రశ్నిస్తా అని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓదెల మల్లన్న క్షేత్ర అభివృద్ధికి నిరంతర కృషి

మొదటి పేజీ తరువాయి...

శంకుస్థాపనలు మరియు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ముందుగా ఓదెల ఆలయ పరిసరాల్లో కోటి రూపాయల డి.ఎం.ఎఫ్.టి నిధులతో నిర్మించనున్న ప్రధాన రహదారి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. భక్తుల సౌకర్యార్థం రూ.15 లక్షలతో నూతనంగా టాయిలెట్ల నిర్మాణం చేపడుతున్నామని, ఈ పనులను 30 నుండి 45 రోజుల్లోగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నూతన సాంకేతికతతో నిర్మిస్తున్న ఈ రోడ్లు కనీసం 40 ఏళ్ల పాటు మన్నికగా ఉంటాయని, ఇప్పటికే సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. అలాగే గతంలో ఎన్నడూ లేని విధంగా ఒగ్గు పూజారులకు తమ ప్రభుత్వం సముచిత గుర్తింపునిచ్చిందని గుర్తు చేశారు. అనంతరం గుండ్లపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే, ఆ తర్వాత కనగర్తి, గుండ్లపల్లి గ్రామాల్లో పది ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ మహోత్సవాల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదల సొంతింటి కల నెరవేరుతుందని, అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించి ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఓదెల ఆలయ చైర్మన్, డైరెక్టర్లు, ఆలయ అధికారులు, మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రతి దరఖాస్తు జవాబుదారీతనంతో మూడు నెలల్లో

# పరిష్కారానికి చర్యలు

మొదటి పేజీ తరువాయి...

ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టి ప్రతి మండలాన్ని మూడు క్లస్టర్లుగా విభజించి ప్రజాదర్బార్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మని చెప్పారు. ఇప్పటివరకు 10 క్లస్టర్ల కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయని పేర్కొన్నారు.

ప్రతి దరఖాస్తుపై అధికారులకు పూర్తి జవాబుదారీతనంతో పనిచేయాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తామని, మరికొన్ని సమస్యలకు కొంత సమయం పట్టవచ్చని తెలిపారు. అయితే ప్రతి అర్హత గల దరఖాస్తును నిబంధనల ప్రకారం మూడు నెలల్లోగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటా మని అన్నారు.

ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ, పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డుల జారీ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

రైతులను ఆదుకునేందుకు 25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల రుణమాఫీ చేశామని, రైతు భరోసాను ఎకరాకు 12 వేల వరకు పెంచామని తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తూ, సన్న వడ్లకు ఎంఎస్‌పీతో పాటు క్వింటాల్‌కు 500 బోనస్ కూడా అందిస్తున్నామని చెప్పారు.

గత పదేళ్లలో పేదలకు ఇళ్లు ఇవ్వలేదని, అయితే తమ ప్రభుత్వం తొలి దశలోనే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేస్తున్నామని చెప్పారు. జూన్ 2 నుంచి రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రారంభమవుతుందని, అనంతరం మూడవ, నాల్గవ విడతల ఇళ్లను కూడా మంజూరు చేస్తామని వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందిస్తామని స్పష్టం చేశారు. ప్రజాదర్బార్ కార్యక్రమాల్లో ఎక్కువగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు వస్తున్నాయని, గత ప్రభుత్వం ఇళ్లు నిర్మించకపోవడమే దీనికి కారణమని పేర్కొన్నారు. ప్రభుత్వం నిధులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తుండటంతో ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు.

ధరణి సమస్యలన్నింటినీ భూ భారతి ద్వారా పరిష్కరిస్తామని, సాదా బైనామా దరఖాస్తులను కూడా ప్రభుత్వం అర్హత ప్రకారం పరిష్కరిస్తుందని మంత్రి తెలిపారు. రాబోయే నెల రోజులలో పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడతామని వెల్లడించారు.

నిరుద్యోగ యువతకు 70 వేల ఉద్యోగాలు కల్పించామని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పారదర్శకంగా పరీక్షలు నిర్వహించి, ఎలాంటి లీకులు లేకుండా ప్రతిభావంతులైన అభ్యర్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కారు రాష్ట్రాల్లో జరిగిన నీట్ పరీక్ష పేపర్ లీక్ కారణంగా దేశ వ్యాప్తంగా 23 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, తెలంగాణలో సుమారు 70 వేల మంది విద్యార్థులు ప్రభావితమయ్యారని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీక్‌కు కారణమైన వారిపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గత ప్రభుత్వ హయాంలో గ్రూప్ పరీక్షల పేపర్ లీకులు, ఇంటర్ మూల్యాంకన లోపాల కారణంగా అనేక మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పారదర్శకంగా పరీక్షలు నిర్వహించి, ఎలాంటి లీకులు లేకుండా ప్రతిభావంతులైన అభ్యర్థులకు న్యాయం జరిగేలా చేసి 70 వేల ఉద్యోగాలు కల్పించామని మంత్రి పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రతి దరఖాస్తు సమస్యల పరిష్కారానికి నిరంతర ఫాలోఅప్ నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు కూడా సహకరించి తమ సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని కోరారు.

ఈ సందర్భంగా గ్రామానికి చెందిన లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ఆనందం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరై తమ కుటుంబానికి సొంతింటి కల నెరవేరిందని లబ్ధిదారులు తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీ రహిత రుణాలు అందడంతో ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతోందని మహిళలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత కారణాలతో నేడు విచారణకు హాజరు కాలేను

మొదటి పేజీ తరువాయి...

తన సందేశంలో భగీరథ్ పేర్కొంటూ, ప్రస్తుతం వ్యక్తిగత కారణాల వల్ల నేడు విచారణకు హాజరు కావడం సాధ్యం కాలేదని తెలిపారు. అయితే దర్యాప్తు ప్రక్రియకు పూర్తి సహకారం అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. కేసు విచారణలో అవసరమైన ఆధారాలు సేకరించేందుకు కొంత సమయం అవసరమని, అందుకోసం రెండు రోజుల గడువు ఇవ్వాలని ఆయన అభ్యర్థించారు. అలాగే, విచారణకు మళ్లీ హాజరు కావడానికి అనుకూలమైన మరో తేదీని సూచించాల్సిందిగా పోలీసులను కోరినట్లు సమాచారం. భగీరథ్ తన మెయిల్‌లో దర్యాప్తు అధికారుల ముందు హాజరై అన్ని అంశాలకు సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నట్లు తెలుస్తోంది. పోక్సో కేసు దర్యాప్తులో భాగంగా నేడు ఆయన పోలీసుల ఎదుట హాజరు కావాల్సి ఉండగా గైర్హాజరు కావడం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో ఆయన పంపిన మెయిల్‌కు సంబంధించి పోలీసులు పరిశీలన జరుపుతున్నారు. తదుపరి విచారణ తేదీపై త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

### బంగారం దిగుమతి సుంకం 6% నుంచి

# 15%కి భారీ పెంపు

మొదటి పేజీ తరువాయి...

దీని ఫలితంగా వాణిజ్య లోటు పెరుగుతూ, రూపాయి విలువపై ఒత్తిడి ఏర్పడుతోంది. తాజా గణాంకాల ప్రకారం 2025–26 ఆర్థిక సంవత్సరంలోనే దేశం దాదాపు 71.98 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని దిగుమతి చేసుకుంది. ఇది గత ఏడాదితో పోలిస్తే సుమారు 24 శాతం అధికం కావడం గమనార్హం. ఈ పరిస్థితుల్లో బంగారం దిగుమతులపై నియంత్రణ తీసుకురావడం ద్వారా దేశ ఆర్థిక సమతుల్యతను మెరుగుపరచవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. అయితే, బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం ఉండటంతో సాధారణ వినియోగదారులపై భారం పడుతుందని మార్కెట్ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వివాహాలు, పండుగల సమయంలో బంగారం కొనుగోళ్లు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. ఇక మరోవైపు ఈ నిర్ణయం వల్ల అక్రమ బంగారం రవాణా (స్మగ్లింగ్) పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధిక దిగుమతి సుంకం కారణంగా స్మగ్లర్లకు భారీ లాభాలు దక్కే అవకాశం ఉండటంతో, సరిహద్దులు, విమానాశ్రయాల ద్వారా అక్రమ రవాణా కార్యకలాపాలు పెరిగే అవకాశాన్ని వారు గుర్తు చేస్తున్నారు. గతంలో కూడా ఇలాంటి పరిస్థితుల్లో స్మగ్లింగ్ కేసులు పెరిగిన ఉదాహరణలను ఆర్థిక నిపుణులు ప్రస్తావిస్తున్నారు.

భారతదేశంలో బంగారం వినియోగం సంప్రదాయంగా బలంగా ఉండటం వల్ల, దీనిని పూర్తిగా తగ్గించడం సులభం కాదని విశ్లేషకులు అంటున్నారు. మరోవైపు చమురు దిగుమతులతో పాటు బంగారం దిగుమతులు కూడా దేశ విదేశీ మారక నిల్వలపై భారీ ఒత్తిడిని కలిగిస్తున్నాయి. దీంతో వాణిజ్య లోటు 333 బిలియన్ డాలర్ల స్థాయికి చేరినట్లు అంచనాలు చెబుతున్నాయి.

మొత్తంగా చూస్తే, ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తాత్కాలికంగా దిగుమతులను తగ్గించడంలో సహాయపడవచ్చని భావించినా, దీర్ఘకాలంలో ధరల పెరుగుదల, వినియోగ తగ్గుదల, అలాగే అక్రమ రవాణా పెరుగుదల వంటి ప్రభావాలు ఎలా ఉంటాయన్నది రాబోయే రోజుల్లో స్పష్టమవుతుందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# బీసీల టైమ్ స్టార్ట్!

- జూన్ 2 నుంచి తీన్మార్ మల్లన్న రాష్ట్రవ్యాప్తంగా చరిత్రాత్మక పాదయాత్ర
- "ఓట్లు మావి... అధికారాలు మీవా?" అంటూ అధికార పార్టీలపై మల్లన్న ధ్వజం
- బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకున్న రాజకీయ పార్టీలపై తీవ్ర విమర్శలు
- గ్రామ గ్రామాన తిరిగి బీసీలకు జరిగిన అన్యాయాలపై చైతన్య యాత్ర
- ఎన్నికల వరకు ఆగని ఉద్యమంగా పాదయాత్రకు రూపకల్పన
- తెలంగాణ రాజకీయాలను కుదిపే బీసీ రాజ్యాధికార పోరాటానికి నాంది

హైదరాబాద్, మే 13 (ప్రజాకలం) : తెలంగాణ రాజకీయాల్లో భారీ ప్రకంపనలు సృష్టించేలా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న జూన్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మహా పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. బీసీల ఆత్మగౌరవం, రాజకీయ హక్కులు, సామాజిక న్యాయం, రాజ్యాధికార సాధనే లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ యాత్ర రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారుతోంది. ఇప్పటికే ఈ యాత్రపై బీసీ సంఘాలు, యువత, సామాజిక వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. "ఓట్లు మావి... సీట్లు మీవా? జనాభా మాది... అధికారాలు మీవా?" అనే నినాదాలతో మల్లన్న బీసీలలో రాజకీయ చైతన్యాన్ని రగిలించే ప్రయత్నం చేస్తున్నారు. దశాబ్దాలుగా అన్ని రాజకీయ పార్టీలు బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చి, అధికార కుర్చీలు మాత్రం కొద్దిమంది చేతుల్లోనే పెట్టాయని ఆయన తీవ్రస్థాయిలో ఆరోపిస్తున్నారు. బీసీలను ఎన్నికల సమయంలో మాత్రమే గుర్తు చేసుకుని, అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా పక్కన పెట్టేశారని మండిపడుతున్నారు. తెలంగాణ వచ్చాక కూడా పరిస్థితి మారలేదని, బీసీలకు తగిన ప్రాధాన్యం, అవకాశాలు, రాజ్యాధికారం దక్కలేదని మల్లన్న వర్గం విమర్శిస్తోంది. రాష్ట్రంలో సంఖ్యాబలం ఉన్న బీసీలు రాజకీయంగా బలహీనంగా ఉండేలా కుట్రపూరితంగా వ్యవస్థ నడుస్తోందని ఆరోపిస్తున్నారు. ముఖ్యమంత్రి పదవి నుంచి కీలక నిర్ణయాధికార స్థానాల వరకు బీసీలకు సరైన అవకాశాలు ఇవ్వకుండా అణగదొక్కుతున్నారని మల్లన్న స్పష్టం చేస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో జూన్ 2 నుంచి ప్రారంభమయ్యే మహా పాదయాత్ర సాధారణ రాజకీయ యాత్ర కాదని, ఇది బీసీల అస్తిత్వ పోరాటమని పార్టీ నేతలు చెబుతున్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి వెళ్లి బీసీలకు జరిగిన అన్యాయాలను ప్రజల ముందుంచడం, రాజకీయంగా వారిని చైతన్యవంతులను చేయడం, హక్కుల కోసం ఐక్యం చేయడం ఈ యాత్ర ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. "ఇక మోసపోవద్దు... మన ఓటు విలువ తెలుసుకోవాలి... మనల్ని మనమే పాలించుకోవాలి..." అనే సందేశంతో మల్లన్న ప్రజల్లోకి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వెనుకబడిన వర్గాల పరిస్థితిని నేరుగా అధ్యయనం చేసి, వారి సమస్యలను రాష్ట్రవ్యాప్త ఉద్యమాలుగా మలచే ప్రయత్నం చేయనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు తెలంగాణ రాజకీయాల్లో ఎవరూ చేపట్టని స్థాయిలో ఈ యాత్ర సాగబోతుందని పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. భారీ సంఖ్యలో యువత, నిరుద్యోగులు, బీసీ సంఘాల నాయకులు, మహిళలు, కార్మికులు, రైతులు ఈ యాత్రలో పాల్గొనే అవకాశముందని సమాచారం. గ్రామాల్లో రాత్రి బసలు, ప్రజా సభలు, బీసీ చైతన్య సమావేశాలు, యువజన ర్యాలీలు నిర్వహిస్తూ మల్లన్న ప్రజల మధ్యే ఉండనున్నారని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ప్రతి గడపకు వెళ్లి బీసీల సమస్యలను వినడం మాత్రమే కాకుండా, ఇప్పటివరకు బీసీలకు జరిగిన రాజకీయ మోసాలను ప్రజలకు వివరించనున్నట్లు సమాచారం. "ఎన్నికలప్పుడు చేతులు జోడించి ఓట్లు అడిగేవారు... గెలిచాక గేట్ల దగ్గర కూడా నిలబడనివ్వరు" అంటూ అధికార పార్టీల తీరుపై మల్లన్న తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారని పార్టీ కార్యకర్తలు చెబుతున్నారు. బీసీలకు రాజ్యాధికారం ఇవ్వకుండా కేవలం పదవుల మాయ చూపిస్తూ రాజకీయ పార్టీలు మోసం చేస్తున్నాయని, ఇక ఆ పరిస్థితి మారాల్సిన సమయం వచ్చిందని మల్లన్న వర్గం అంటోంది. జనాభాలో అత్యధికం గా ఉన్న బీసీలు



రాజకీయంగా ఐక్యమైతే తెలంగాణ రాజకీయ పటాన్ని మార్చగలరని పార్టీ నాయకులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఈ పాదయాత్ర ఎన్నికల వరకు నిరంతరంగా కొనసాగనున్నట్లు సమాచారం. తెలంగాణ వ్యాప్తంగా బీసీలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, బీసీ ఓటును రాజకీయ అధికారంగా మార్చడమే ప్రధాన లక్ష్యమని పార్టీ స్పష్టం చేస్తోంది. "బీసీల ప్రభుత్వం రావాలి... బీసీలే పాలకులు కావాలి..." అనే నినాదంతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సోషల్ మీడియాలో "మల్లన్నతో కలిసి నడుద్దాం... చరిత్ర సృష్టిద్దాం" అనే ప్రచారం జోరందుకుంది. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ శ్రేణులు యాత్ర విజయవంతం కోసం కార్యాచరణ ప్రారంభించాయి. ఈ మహా పాదయాత్ర తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీస్తుందా? బీసీ అజెండాను కేంద్ర రాజకీయ అంశంగా మారుస్తుందా? అనే చర్చ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# మాజీ సైనిక కార్పొరేషన్ ప్రతిపాదన

హైదరాబాద్, మే 13 : సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ ఎన్.ఆర్. బాబు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో మాజీ సైనికుల సంక్షేమాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణలో మాజీ సైనిక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బ్రిగేడియర్ ఎన్.ఆర్. బాబు ప్రతిపాదించారు. దీనికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ, అవసరమైన విధి విధానాలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులను ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న మాజీ సైనిక కార్పొరేషన్ల నిర్మాణం, విధానాలు,



నిర్వహణ పద్ధతులను సేకరించి సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. అనంతరం త్వరలోనే సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చైర్మన్‌గా ఉన్న రాజ్య సైనిక బోర్డు సమావేశాన్ని త్వరగా నిర్వహించాల్సిన అవసరాన్ని బ్రిగేడియర్ ఎన్.ఆర్. బాబు సమావేశంలో ప్రస్తావించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, ఆ సమావేశాన్ని త్వరలోనే నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. గవర్నర్ చైర్మన్‌గా ఉన్న స్టేట్ మేనేజింగ్ కమిటీ ఏర్పాటు సంబంధిత ఉత్తర్వులను త్వరగా జారీ చేయాలని కూడా బ్రిగేడియర్ ఎన్.ఆర్. బాబు కోరారు. దీనిపై ప్రభుత్వం త్వరలోనే అవసరమైన ఉత్తర్వులు విడుదల చేస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మాజీ సైనికుల సమస్యల పై పూర్తి స్థాయి ప్రతిపాదనలతో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శికి సమర్పించాలని, వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని సమావేశంలో తెలియజేశారు.

## సన్న రకాలు సాగు చేస్తే రైతులకు మేలు

- డాక్టర్. ఏ శ్రీనివాస్



రుద్రంగి, మే13, (ప్రజాకలం ప్రతినిధి) సన్న రకాలను సాగు చేస్తే రైతులకు మేలని, రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ. 500 బోనస్ అదనంగా పొందవచ్చని డా. ఏ శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలకేంద్రంలోని రైతు వైదికలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సిరిసిల్ల వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏ. శ్రీనివాస్ మాట్లాడుతూ.. సన్న రకాలలో ఆర్ఎన్ఆర్ -15048, కేఎన్ఎమ్ -1638 వంటి సన్న రకాలను సాగు చేయాలని, పంటల సాగులో యూరియా వాడకాన్ని తగ్గించాలని, పచ్చిరొట్ట పైర్ల సాగుతో నేల సారాన్ని పెంపొందించవచ్చని అందుకోసం జనుము, జీలుగ, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట పైరు లను సాగు చేయాలని రైతులకు సూచించారు. రసాయన ఎరువులు, పురుగు మందులను విచక్షణ రహితంగా వాడరాదని దీని ద్వారా నేల, నీరు కలుషితమై దుష్పరిణామాలు సంభవిస్తాయన్నారు. ప్రతి పంటలలో ట్రైకోడెర్మా పశువుల ఎరువులో కలిపి నేలలో వేసుకోవాలని, తద్వారా నేల నుండి వచ్చే మొక్కల వ్యాధులను అరికట్టవచ్చని, పర్యావరణాన్ని కాపాడుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గండి లక్ష్మీనారాయణ, ఏఈవో జ్యోతి, ఆదర్శ రైతులు అల్లూరి రాజారెడ్డి మరియు వ్యవసాయ కళాశాల విద్యార్థులు మహేందర్, అభిషేక్ రైతులు పాల్గొన్నారు.

## కోరుట్ల ఎమ్మెల్యే చే ఎల్ ఓ సి ల అందజేత



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 13(ప్రజా కలం) మెట్‌పల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ వైద్య చికిత్సల నిమిత్తం మంజూరైన ఎల్వోసీలు అందించారు. అయిలాపూర్ గ్రామానికి చెందిన వెల్మ విజయ కు రూ. 75,000 విలువైన ఎల్వోసీ, వెల్లుల్ల గ్రామానికి చెందిన జాప అశోక్ కు రూ. 1,00,000 విలువైన ఎల్వోసీ, ముత్యంపేటకు చెందిన సుద్దాల రాజు కు రూ. 75,000, అలాగే మొగిల్‌పేట గ్రామానికి చెందిన ముక్కెర రాకేష్ కు రూ. 1,00,000 విలువైన ఎల్వోసీని ఎమ్మెల్యే సంజయ్ అందజేశారు.

### ఉత్తమ విద్యార్థి ని సన్మానించిన

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిబ్బంది





మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 13 (ప్రజాకలం)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవాల వేడుకల సందర్భంగా మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ వేంకయ్య ఆధ్వర్యంలో బుధవారం బీ.కాం. కంప్యూటర్ అప్లికేషన్ తృతీయ సంవత్సరం చదివిన మంగళపల్లి ప్రతిభ అనే విద్యార్థిని, శాలువాతో సన్మానించి, సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతిభ గతంలో శ్రీ సత్య సాయి సేవా సమితి అధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన పోటీలలో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతిని అందుకుందని గుర్తు చేశారు. అదే విధంగా ప్రతిభకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, మంచి క్రమ శిక్షణతో బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ ప్రశంసించారు. భవిష్యత్తులో టీచర్ కావాలన్న లక్ష్యంతోనే చదువుతున్నానని, బీ.ఎడ్ ప్రవేశ పరీక్ష రాశానని, ఇద్దరు పిల్లలు ఉన్నప్పటికీ భర్త ప్రోత్సాహంతోనే తాను ఇంకా చదువుతున్నాన్నారు. మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పాటు కామర్స్ లెక్చరర్లను మరచిపోనని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కో- ఆర్డినేటర్ బిల్ల రాజేందర్, దోస్త్ కో - ఆర్డినేటర్ మనోజ్ కుమార్, లెక్చరర్ శ్రీకాంత్, బోధనేతర సిబ్బంది లక్ష్మినారాయణ, బాబు, శ్రీనివాస్, లింగం,లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి

ధర్మారం, మే 13 : ( ప్రజా కలం ప్రతినిధి ) ధర్మారం మండలం ఎర్రగుంటపల్లి గ్రామం లో ఒడ్నాల రామక్క ఇందిరమ్మ ఇల్లు నూతన గృహ ప్రవేశ కార్యక్రమం లో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన గృహాన్ని సందర్శించిన మంత్రి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియ జేశారు. అనంతరం గ్రామ ప్రజల తో మాట్లాడిన మంత్రి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పేద కుటుంబాలకు గౌరవ ప్రదమైన జీవనం కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయ మని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు శాశ్వత నివాస సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం లో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# విప్లవం నుంచి విద్య వైపు..

## 42 ఏళ్ల తర్వాత తెలుగు పరీక్ష రాసిన మాజీ మావోయిస్టు నేత దేవ్ జీ



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 13 (ప్రజా కలం) సాధారణంగా పరీక్షా హాల్లో కనిపించేవారు యువ విద్యార్థులే భవిష్యత్తు కోసం కలలు కనే కుర్రాళ్లు ఉద్యోగాల కోసం పోటీ పడే యువత. కానీ జగిత్యాల జిల్లా కోరుట్లలో బుధవారం జరిగిన ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షా కేంద్రంలో కనిపించిన ఒక వ్యక్తి మాత్రం అందరి దృష్టిని ఆకర్షించాడు. ఒకప్పుడు అడవుల్లో తుపాకీతో తిరిగిన మాజీ మావోయిస్టు అగ్రనేత... నేడు పెన్నుతో పరీక్ష రాయడానికి పరీక్షా హాల్లోకి అడుగుపెట్టారు. జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన కామ్రేడ్ తిప్పిరి తిరుపతి అలియాస్ "దేవ్ జీ" సుమారు 42 ఏళ్ల తర్వాత మళ్లీ విద్యార్థిగా మారి పరీక్ష రాయడం విశేషంగా మారింది. 1982లో ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్న సమయంలో ఆయన తెలుగు పరీక్ష తప్పిపోయింది. ఆ ఒక్క పరీక్ష రాయకపోవడంతో ఇంటర్ విద్య అసంపూర్తిగానే మిగిలిపోయింది. అదే సమయంలో సమాజంలో ఉన్న అసమానతలు, పేదల సమస్యలు, అన్యాయాలు ఆయన మనసును కదిలించాయి. విద్యార్థి జీవితాన్నే వదిలి విప్లవ బాట పట్టారు. అడవులు ఆయనకు ఆశ్రయమయ్యాయి. తుపాకీ ఆయనకు ఆయుధమైంది. సిద్ధాంతం ఆయనకు జీవితం అయింది. దశాబ్దాల పాటు ప్రజా పోరాటాల్లో పాల్గొన్న తిరుపతి.. "దేవ్ జీ"గా మావోయిస్టు ఉద్యమంలో కీలక నాయకుడిగా ఎదిగారు. అయితే కాలం మారింది. పరిస్థితులు మారాయి. పోరాటాల పద్ధతులు మారాయి. చివరకు దేవ్ జీ సాధారణ జీవనంలోకి వచ్చారు. కానీ జీవితంలో ఒక అసంపూర్తి మాత్రం ఎప్పటికీ ఆయనను వెంటాడింది. 1982లో రాయకపోయిన తెలుగు పరీక్ష.ఆ అసంపూర్తిని పూర్తి చేయాలనే సంకల్పంతో ఆయన ఇంటర్ బోర్డును సంప్రదించారు. ప్రత్యేక అనుమతి పొందారు. బుధవారం జగిత్యాల జిల్లా కోరుట్లలో నిర్వహించిన ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షకు హాజరయ్యారు. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత పరీక్షా హాల్లోకి అడుగుపెట్టిన దేవ్ జీని చూసి అక్కడి విద్యార్థులు, అధికారులు ఆశ్చర్యపోయారు. కొందరు ఆసక్తిగా గమనించారు. మరికొందరు ఆయనతో మాట్లాడేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా దేవ్ జీ మాట్లాడుతూ, ఇంటర్ పూర్తి చేసిన తర్వాత న్యాయ విద్య అభ్యసించాలని ఉంది. పేదలకు న్యాయ సహాయం అందించాలనేది నా కోరిక అని తెలిపారు. దేవ్ జీ కథను కేవలం ఒక మాజీ మావోయిస్టు పరీక్ష రాశాడనే సంఘటనగా చూడటం సరైంది కాదు. ఇది ఒక తరం చరిత్ర. ఒక భావజాల ప్రయాణం. ఒక మనిషి అంతర్మథనం. 1980ల కాలంలో గ్రామీణ తెలంగాణ లో పేదరికం, భూస్వామ్య దౌర్జన్యాలు, సామాజిక అసమానతలు తీవ్రంగా ఉండేవి. అప్పుడు అనేక మంది యువకులు విద్యను, కుటుంబాలను వదిలి విప్లవ ఉద్యమాల వైపు ఆకర్షితులయ్యారు. వారికి తుపాకీ మార్గమే మార్పుకు సాధనంగా కనిపించింది.దేవ్ జీ కూడా అలాంటి తరానికి ప్రతినిధి. కానీ నేటి ఆయన నిర్ణయం ఒక గొప్ప సందేశాన్ని ఇస్తోంది. సమాజాన్ని మార్చాలంటే కేవలం తుపాకీ కాదు... విద్య కూడా ఒక శక్తి అని ఆయన జీవితం చెబుతోంది. నలభై రెండేళ్ల తర్వాత కూడా ఒక పరీక్ష పూర్తి చేయాలని పట్టుదలతో పరీక్షా హాల్లో కూర్చోవడం చిన్న విషయం కాదు. యువతలో చాలామంది చిన్న అపజయాలతోనే చదువును వదిలేస్తున్న ఈ రోజుల్లో, దేవ్ జీ చూపించిన సంకల్పం ప్రత్యేకంగా నిలుస్తోంది. ఇక్కడ మరో ముఖ్యమైన విషయం కూడా ఉంది. తెలుగు పరీక్ష. అవును... ఆయన జీవితంలో అసంపూర్తిగా మిగిలింది తెలుగు పరీక్షే. ఇది కేవలం ఒక సబ్జెక్టు కాదు. మన భాష... మన సంస్కృతి... మన ఆత్మతో ముడిపడిన అంశం. ఒకప్పుడు విప్లవ నినాదాలు ఇచ్చిన వ్యక్తి... ఇప్పుడు తెలుగు ప్రశ్నాపత్రానికి సమాధానాలు రాయడం కాలం తీసుకొచ్చిన గొప్ప వ్యంగ్యంలా కనిపించినా, అదే సమయంలో అది ఒక లోతైన జీవన సత్యాన్ని కూడా గుర్తు చేస్తోంది. చివరికి మనిషిని నిలబెట్టేది జ్ఞానం, విద్య, భాష మాత్రమే. దేవ్ జీ కథ ఇప్పుడు కేవలం కోరుట్ల చర్చ కాదు. అది ఒక తరం ఆవేదన... ఒక వ్యక్తి ఆత్మపరిశీలన... సమాజానికి ఒక నిశ్శబ్ద సందేశం.

## విద్యా వికాసానికి కృషి చేయాలి

- కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్
- కోరుట్ల నియోజక స్థాయి ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక విద్య వారోత్సవాలు



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 13 (ప్రజా కలం) కోరుట్ల నియోజక స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలను కోరుట్ల పట్టణంలోని ఓ పంక్షన్ హాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడు మండలాల కోరుట్ల, మెట్ పల్లి, ఇబ్రహీంపట్నం మల్లాపూర్, మేడిపల్లి,బీమారం,కథలపూర్ సర్పంచ్ లు, మునిసిపల్ కౌన్సిలర్లులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మునిసిపల్ చైర్మన్ తిరుమల వసంత గంగాధర్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు అగునట్లు,డ్రాప్ అవుట్ లను తగ్గించి విద్యా వికాసానికి కృషి చేయాలని,చదువుతోపాటు విద్యార్థుల్లో విలువలు,క్రమశిక్షణ పెంపొందే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని,ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల మునిసిపల్ వైస్ చైర్మన్ షాహిద్,మెట్ పల్లి మునిసిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ నవీన్,మండల పరిషత్ అభివృద్ధికారులు కోరుట్ల రామకృష్ణ,మెట్ పల్లి సురేశ్,మల్లాపూర్ శ్రీకాంత్, ఇబ్రహీంపట్నం గణేశ్,కథలపూర్ శంకర్ నాయక్,మేడిపల్లి అంజుమా,బీమారం నీరజ లు, మండల విద్యాధికారులు,మెట్ పల్లి మండల విద్యాధికారి కనక తార,మల్లాపూర్ దామోదర్ రెడ్డి,ఇబ్రహీంపట్నం మధు,కథలపూర్ లోకిని శ్రీనివాస్,మేడిపల్లి లక్ష్మినర్సయ్య,భీమారం మధుసూదన్ రెడ్డి, చైర్మన్లు అంజమ్మ,పద్మ,రాధిక,శ్యామల,లావణ్య,లత,సరోజ లు సర్పంచ్ లు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు,ఉపాధ్యాయులు ,సి.ఆర్.పిలు, సిబ్బంది పాల్గొన్నారు

## పీఎం సేతు పథకాన్ని అమలు చేయాలి



- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి,మే13:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

పీఎం సేతు పథకాన్ని పెద్దపల్లి జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.పీఎం సేతు పథకం అమలు పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా వెయ్యి ఐటీఐలను ఆధునీకరించేందుకు పీఎం సేతు పథకం ప్రవేశపెట్టిందని కలెక్టర్ తెలిపారు.ఈ పథకం క్రింద 50 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం 33 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం 17 శాతం నిధులు పరిశ్రమలు భరించి ఐటిఐ క్లస్టర్లను ఆధునికరిస్తూ ప్రస్తుత అవసరాలకు తగిన విధంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. వచ్చే ఐదు సంవత్సరాల్లో పెద్దపల్లి క్లస్టర్ పరిధిలో ఐటీఐల మౌలిక వసతుల అభివృద్ధి,ఆధునీకీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 120 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ. 80 కోట్లు వ్యయం చేయనున్నట్లు తెలిపారు. అదనంగా పారిశ్రామిక భాగస్వాములు కూడా సుమారు రూ. 40 కోట్లు వ్యయం చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రంలో పీఎం సేతు అమలుకు హైదరాబాద్,ఓల్డ్ సిటీ,పటాన్‌చెరు, మేడ్చల్,సంగారెడ్డి, పెద్దపల్లి ప్రాంతాలను క్లస్టర్లుగా గుర్తించారని తెలిపారు.ఆయా ప్రాంతాల్లో పరిశ్రమలతో అనుసంధానం చేసి ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు.పెద్దపల్లి జిల్లాలో ఈ పథకాన్ని అమలు చేసేందుకు సింగరేణి కాల్లిరీస్ కంపెనీ లిమిటెడ్,ఎన్టీపీసీ లిమిటెడ్ సంస్థలతో భాగస్వామ్యం కోసం చర్చలు జరుపుతున్నామని అన్నారు.సింగరేణి ఎన్టీపీసీ అధికారులు వారి సంస్థల హెడ్ ఆఫీసులతో చర్చించి అవసరమైన అనుమతులు,నిధుల మంజూరు పొందాలని కోరారు.ఈ పథకం అమలులో భాగంగా ఏర్పాటు చేసే ప్రత్యేక ప్రయోజన వాహకం ద్వారా నిధుల వినియోగం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.ప్రతి సంవత్సరం సుమారు రూ. 5 కోట్ల చొప్పున సింగరేణి,ఎన్టీపీసీ సంస్థలు,కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాల కింద వ్యయం చేసే అవకాశముందని పేర్కొన్నారు.జిల్లాలో ఉన్న పెద్ద పరిశ్రమల సహకారంతో స్థానిక యువతకు ఆధునిక ప్రపంచ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు,సుస్థిర ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని కలెక్టర్ తెలిపారు.యువత నైపుణ్యాభివృద్ధి కోసం ఐటీఐల ఆధునీకరణ అత్యవసరమని పేర్కొన్నారు.

ఈ ప్రాజెక్టు నిర్వహణలో పరిశ్రమల ప్రతినిధులు కూడా భాగస్వాములుగా ఉండే విధంగా ప్రత్యేక ప్రయోజన వాహకం వ్యవహరిస్తుందని కలెక్టర్ వివరించారు.ఈ సమావేశంలో సిపిఓ రవీందర్,సింగరేణి సంస్థలు,ఆర్జీ 1,ఆర్జీ 2,ఆర్జీ 3,ఎన్టీపీసీ సంస్థల అధికారులు,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న జడ్జిని సన్మానించిన మెట్ పల్లి బార్ సభ్యులు





మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 13 (ప్రజాకలం) బదిలీపై వెళ్తున్న సీనియర్ సివిల్ కోర్టు జడ్జి నాగేశ్వర్ రావు కు బుధవారం మెట్పల్లి బార్ అసోసియేషన్ సభ్యులు సన్మానించి సత్కరించారు. మాజీ అధ్యక్షులు పుప్పాల లింబాద్రి, మగ్గిడి వెంకట నరసయ్య, వడ్డేపల్లి శ్రీనివాస్, కొమరం శ్రీనివాస్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఆనంద్ గౌడ్ ఏజిపి హఫీజ్ సీనియర్ న్యాయవాదులు జిల్లా వెంకటేశ్వర్లు వెంకటస్వామి ఓజ్జల శ్రీనివాస్ స్రవంతి స్వప్న మానస బోడ లక్ష్మణ్ తులా రాజేందర్ తలారి రాజశేఖర్ బిగుల్ల శంకర్ మగ్గిడి నరసయ్య సత్యం పలువురు సీనియర్ జూనియర్ న్యాయవాదులు, సీనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీ నాగేశ్వర్ రావు ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఉమ్మడి వెల్గటూర్, మండల పశువుల యజమానులకు పోలీసుల ముఖ్య సూచనలు

- రాత్రివేళల్లో యజమానులు పశువులను కట్టేసుకోవాలన్న ఎస్సై ఉదయ్ కుమార్

వెల్గటూర్, మే 13 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఉమ్మడి వెల్గటూర్ మండల పరిధిలో ఇటీవలి కాలం లో యజమానులు లేకుండా రాత్రి పూట బయట సంచరిస్తున్న ఆవులు, ఎద్దులు, బర్రెల వంటి పశువుల వల్ల రోడ్ యాక్సిడెంట్స్ సమస్యలు పెరిగిపోవడం వలన ప్రజలకు ఇబ్బంది కలుగుతుంది. దీనివల్ల పశువుల యజమానులు అప్రమత్తంగా ఉండవలసిందిగా వెల్గటూర్ పోలీసులు సూచిస్తున్నారు. పశువుల యజ మానులు తమ ఆవులు, ఎద్దులు, బర్రెలను రాత్రి సమయం లో తప్పని సరిగా తమ ఇళ్ల వద్ద లేదా భద్రమైన ప్రదేశాల్లో పశువులను కట్టివేసుకోవాలని ఎట్టి పరి స్థితుల్లోనూ రాత్రివేళ బయట రోడ్ల పై లేదా ఖాళీ ప్రదేశాల్లో వదిలివేయరాదు. ఒక వేళ రాత్రి సమయం లో యజమానులు లేకుండా సంచరిస్తున్న పశువులను గుర్తించిన పక్షంలో వాటిని స్ట్రే అనిమల్స్ గా గుర్తించి గ్రామ పంచాయతీ అధికారుల సహ కారంతో ప్రభుత్వ అధీనంలోకి తీసుకునే చర్యలు చేపడతామని ఎస్సై పులిచెర్ల ఉదయ్ కుమార్ తెలిపారు. ప్రజలు పశువుల యజమానులు పోలీసు శాఖకు సహకరించి తమ పశువులను సంరక్షించు కోవడం తో పాటు అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించవలసిందిగా వెల్గటూర్ ఎస్సై పులిచెర్ల ఉదయ్ కుమార్ కోరారు.



ప్రజా కలం
గురువారం, మే 14, 2026

# బంగారం కొనొద్దని ప్రధాని మోదీ ఎందుకు...

దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉంది.. మనం దేశభక్తిని నిరూపించుకోవాల్సిన సమయం వచ్చింది.. అయితే అందుకోసం పెద్దపెద్ద త్యాగాలు చేయాల్సిన పని లేదు.. కానీ మన రోజువారీ పనుల్లో కొన్ని మార్పులు చేసుకుంటే సరిపోతుందని సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన బిజెపి బహిరంగ సభలో ప్రధాని మోదీ అన్నారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా మళ్లీ కోవిడ్ కాలం నాటి పని సంస్కృతిని ప్రజలందరూ అలవాటు చేసుకోవాలని సూచించారు. భారతదేశంలో బంగారం కేవలం ఒక లోహం మాత్రమే కాదు.. దీనిని సంప్రదాయానికి, సంపదకు, సామాజిక హోదాకు చిహ్నంగా భావిస్తారు. ముఖ్యంగా వివాహాలు, దీపావళి, అక్షయ తృతీయ వంటి పండుగల సమయాల్లో బంగారం కొనుగోళ్లు గరిష్ట స్థాయికి చేరుకుంటాయి. కొన్ని గణాంకాల ప్రకారం.. భారతీయులు ఏటా సగటున 700 నుండి 800 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేస్తున్నారని తెలుపుతున్నాయి. ప్రపంచంలోనే అత్యధికంగా బంగారాన్ని వినియోగించే దేశాల్లో భారత్ ఒకటిగా నిలవడానికి ఇక్కడి ప్రజలకు ఈ పసిడిపై ఉన్న మక్కువనే ప్రధాన కారణం. అయితే ఇటీవల మోదీ బంగారం ఎక్కువగా కొనుగోలు చేయొద్దని ప్రకటన చేశారు. అలా ఎందుకు చేయాల్సి వచ్చిందిదేశంలో బంగారానికి భారీ డిమాండ్ ఉంది. కానీ ఇందుకు విరుద్ధంగా మన దేశీయ ఉత్పత్తి అత్యంత స్వల్పంగా ఉంది. ఏటా కేవలం 1 నుండి 2 టన్నుల బంగారం మాత్రమే మన గనుల నుండి లభిస్తోంది. దీనివల్ల దాదాపు 90 శాతం కంటే ఎక్కువ డిమాండ్‌ను విదేశీ దిగుమతుల ద్వారానే తీర్చుకోవాల్సి వస్తోంది. ముడిచమురు తర్వాత భారత్ అత్యధికంగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఖర్చు చేస్తున్నది బంగారం దిగుమతుల కోసమే. దీనివల్ల దేశ కరెంట్ అకౌంట్ లోటు పెరిగి, రూపాయి విలువపై, విదేశీ మారక నిల్వలపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బంగారం కొనుగోళ్లను తగ్గించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల తెలంగాణలో పర్యటించినప్పుడు తెలిపారు. కనీసం ఏడాది పాటు కొత్త బంగారం కొనకుండా ఉండటం వల్ల దేశం నుంచి బయటకు వెళ్లే విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయవచ్చని, ఆ నిధులను దేశాభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు ఉపయోగించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. పసిడిపై పెట్టుబడి పెట్టడం వల్ల అది వ్యక్తిగతంగా లాభదాయకంగా అనిపించినప్పటికీ, దేశ ఆర్థిక వ్యవస్థ పరంగా అది 'డెడ్ ఇన్వెస్ట్‌మెంట్' గానే మిగిలిపోతుందనేది నిపుణుల వాదన. బంగారం కొనుగోళ్లను తగ్గించడానికి ప్రభుత్వం 'సావరిన్ గోల్డ్ బాండ్' పథకాన్ని ప్రవేశపెట్టింది. భౌతికంగా బంగారాన్ని కొని లాకర్లలో దాచుకోవడం కంటే, బాండ్ల రూపంలో పెట్టుబడి పెట్టడం వల్ల విదేశీ దిగుమతుల భారం తగ్గుతుంది. దీనివల్ల వినియోగదారులకు భద్రతతో పాటు అదనపు వడ్డీ కూడా లభిస్తుంది. ప్రజలు తమ పెట్టుబడి దృక్పథాన్ని మార్చుకుని, భౌతిక బంగారం నుంచి డిజిటల్ , బాండ్ల వైపు మళ్ళినప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది అని ఆర్థిక నిపుణులు అంటున్నరు. స్టాక్ మార్కెట్‌లో బ్లడ్ బాత్ చూడగానే అర్థమైంది అందరికి. మోదీ ఇచ్చింది స్టేట్‌మెంట్ కాదు అదొక వార్నింగ్ సిగ్నల్ అని. పొలిటికల్‌గా, ఒక పొలిటీషియన్‌గా నరేంద్ర మోదీ ఎంత అగ్రెసివ్‌గానైనా మాట్లాడొచ్చు. కాని, దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన మ్యాటర్ అయితే మాత్రం.. ప్రతి అక్షరాన్ని, ప్రతి పొల్లును కొలతకొలిచినట్టు మరీ మాట్లాడతారు. అంతా సుభిక్షం, అంతా ప్రశాంతం అనాల్సిన మూమెంట్‌లో... 'జాగ్రత్తగా ఉండండి' అని అన్నారంటే, కచ్చితంగా 'దేశం క్లిష్ట పరిస్థితి'లో ఉందనే అర్థం. భయపెట్టాలని కాదు గానీ.. దేశ ప్రజలను ముందస్తుగా ప్రిపేర్ చేస్తున్నట్టు కనిపిస్తోంది ఆ మాటల్లో. సేవింగ్స్ మొత్తం ఖర్చైపోవచ్చు. ఏదైనా జరగొచ్చు. మోదీ మాటలను డీకోడ్ చేస్తే వచ్చే అర్థం ఇదే. భారతదేశం ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బంగారు వినియోగదారు. ఏటా సగటున 700 నుండి 900 టన్నుల బంగారాన్ని మనం దిగుమతి చేసుకుంటున్నాం. ఇక్కడే అసలు సమస్య మొదలవుతోంది. మనం దిగుమతి చేసుకునే ప్రతి గ్రాము బంగారానికి అమెరికన్ డాలర్లలో చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా ఏటా 35-45 బిలియన్ డాలర్లు బంగారం దిగుమతులకే ఖర్చవుతాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర ట్రాయ్ ఔన్సుకు 3,000 డాలర్లు దాటడంతో ఈ బిల్లు తడిసి మోపెడవుతోంది. ఒకవైపు పసిడి ధరలు భగ్గుమంటుంటే, మరోవైపు మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాల వల్ల ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 126 డాలర్లకు చేరుకున్నాయి. దేశం నడవాలంటే చమురు తప్పనిసరి. మనం మన అవసరాల్లో 85శాతం దిగుమతి చేసుకుంటున్నాం. చమురుతో పోలిస్తే బంగారం కొనుగోలు అనేది ఒక ఆప్షన్ మాత్రమే..ముఖ్యంగా పెళ్లిళ్ల కోసం కొనే బంగారాన్ని వాయిదా వేయడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు భారీ ఊరట లభిస్తుంది. దేశం యొక్క ఆర్థిక స్కోర్‌కార్డ్‌నే కరెంట్ ఖాతా అంటారు. మనం ఎగుమతుల ద్వారా సంపాదించే దానికంటే, దిగుమతుల కోసం ఖర్చు చేసేది ఎక్కువైతే లోటు ఏర్పడుతుంది. ఈ లోటు పెరిగితే రూపాయి విలువ పడిపోయి, ఆర్థిక వ్యవస్థ అస్థిరంగా మారుతుంది. భారతదేశంలో ఏటా సుమారు 10-12 మిలియన్ల వివాహాలు జరుగుతాయి. అక్టోబర్ నుండి ఫిబ్రవరి వరకు ఉండే పెళ్లిళ్ల సీజన్‌లోనే దేశంలో అత్యధికంగా బంగారం అమ్ముడవుతుంది. "ఇది నిషేధం కాదు, కేవలం ఒక నైతిక విజ్ఞప్తి మాత్రమే. దేశం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు పౌరులు స్వచ్ఛందంగా తమ కొనుగోళ్లను వాయిదా వేసుకుంటే, అది దేశ విదేశీ మారక నిల్వలను కాపాడుతుంది" అని ఆర్థిక విశ్లేషకుల అభిప్రాయపడుతున్నారు. క్లుప్తంగా చెప్పాలంటే, మళ్లీ లాక్‌డౌన్ పరిస్థితులు రాకుండా ఉండాలన్నా, రాబోయే ప్రపంచ ఆర్థిక సంక్షోభ పరిస్థితుల నుండి సామాన్యులను, దేశ ఆర్థిక వ్యవస్థను రక్షించడానికి, ప్రజల్లో క్రమశిక్షణ, పొదుపు అనే ముందస్తు జాగ్రత్తలను అలవాటు చేసేందుకుకే ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్టు తెలుస్తోంది.

# పడకగదిలోనే మహిళ దారుణ హత్య



పెద్దపల్లి,మే13:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలోని ముక్కునూరు గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన ఓ దారుణ హత్య స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. గ్రామానికి చెందిన బౌతు సుమలత (36)తన నివాసంలోనే గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో దారుణంగా హత్యకు గురయ్యారు. బుధవారం ఉదయం ఈ విషయం వెలుగులోకి రావడంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. హత్య సమాచారం అందిన వెంటనే బసంత్‌నగర్ ఎస్ఐ నూతి శ్రీధర్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక విచారణ చేపట్టారు. అనంతరం పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి,పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్ లు సంఘటనా స్థలాన్ని సందర్శించి విచారణను స్వయంగా పర్యవేక్షించారు. ఇంటి పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు, బాధితురాలు సుమలతను ఎవరో కావాలనే పథకం ప్రకారం హత్య చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. కేసు ఛేదన కోసం పోలీసులు క్లూస్ టీమ్ మరియు డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. ఘటనా స్థలంలో వేలిముద్రలు,ఇతర కీలక ఆధారాలను సేకరించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి సిఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కేసు విచారణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతున్నామని,నేరస్తులకు సంబంధించి కొన్ని కీలక క్లూస్ దొరికే అవకాశం ఉందని తెలిపారు. మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కుటుంబ వివాదాలు లేదా పాత కక్షల నేపథ్యంలోనే ఈ హత్య జరిగిందా..అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. బాధితురాలి బంధువులు, పరిచయస్తులను విచారిస్తున్నామని,నిందితులను అతి త్వరలోనే పట్టుకుంటామని డీసీపీ బి.రామ్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నిందితుల గుర్తింపు ప్రక్రియ ముగిసిన వెంటనే పూర్తి వివరాలను వెల్లడిస్తామని డీసీపీ పేర్కొన్నారు.

# అక్రమ పశువుల రవాణాపై ప్రత్యేక నిఘా

**- జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**- శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసుల కట్టుదిట్టమైన చర్యలు**

జగిత్యాల ప్రతినిధి మే 13 (ప్రజాకలం)

రాబోయే బక్రీద్ (ఈద్-ఉల్-అధా) పండుగను పురస్కరించుకొని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా సరిహద్దులు, ప్రధాన రహదారులు, చెక్‌పోస్టుల వద్ద పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. గోవులు మరియు దూడలను నిబంధనలకు విరుద్ధంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పశువైద్యుల ధ్రువీకరణ పత్రాలు లేకుండా జంతువులను రవాణా చేస్తే వాహనాలను జప్తు చేసి, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్రమ పశువుల రవాణాకు సంబంధించి ఏదైనా సమాచారం తెలిసిన వెంటనే ప్రజలు సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీసు అధికారులకు తెలియజేయాలని సూచించారు.




అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా, నిందితులపై ప్రత్యక్ష దాడులకు పాల్పడకూడదని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు గోవధ నివారణ, అక్రమ పశువుల రవాణా అరికట్టేందుకు పోలీసు శాఖ, పశుసంవర్ధక శాఖ సంయుక్త బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు.

# వెల్లుల్ల విద్యుత్ కష్టాలను తీర్చండి

**- సిజిఆర్ఎఫ్ చైర్మన్‌కు గ్రామస్తుల వినతి**

**- సమస్యలపై దృష్టి పెడుతూ వేలాడుతున్న విద్యుత్తీగలు**

**- లో-ఓల్టేజ్ సమస్యలు పరిష్కరించాలని రామకృష్ణకు విన్నపం**



మెట్‌పల్లి రూరల్, మే 13 : (ప్రజా కలం):గ్రామంలోని విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక (సి జి ఆర్ ఎఫ్ 2) చైర్మన్ ఎస్. రామకృష్ణ కి వెల్లుల్ల గ్రామ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, చైర్మన్ సానుకూలంగా స్పందించి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా తక్షణమే సింగిల్ ఫేజ్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని కోరారు, వ్యవసాయ భూములకు వెళ్లే ప్రధాన దారుల వద్ద విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని, ప్రమాదాలు జరగకముందే అక్కడ ఎత్తైన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని విన్నవించారూ, గ్రామంలో దీర్ఘకాలంగా వేధిస్తున్న లో-ఓల్టేజ్ సమస్య వల్ల గృహ వినియోగదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా ఈ సమస్యను అధిగమించాలని కోరారు.

## రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు బండలింగాపూర్‌లో

# సాగుపై అవగాహన సదస్సు



మెట్ పల్లి రూరల్,మే 13:(ప్రజా కలం):రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డా. మధుబిందు పిలుపునిచ్చారు. బుధవారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గ్రామ రైతు వేదికలో, వ్యవసాయ శాఖ సమన్వయంతో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డా. మధుబిందు మాట్లాడుతూ, వరి సాగులో నీటి యాజమాన్యం కీలకమని పేర్కొన్నారు. పంటకు అవసరమైన కీలక దశల్లో మాత్రమే తడులు ఇవ్వడం ద్వారా నీటిని ఆదా చేయడమే కాకుండా, ఆశించిన దిగుబడిని పొందవచ్చని రైతులకు వివరించారు. నిరంతరం నీరు నిల్వ ఉంచడం కంటే, ఆరుతడి పద్ధతులు పాటించడం మేలని సూచించారు. ఎరువుల వాడకంపై ఆమె స్పందిస్తూ పలు కీలక సూచనలు చేశారు సిఫార్సు చేసిన మేరకే యూరియా వాడాలి. మోతాదుకు మించితే పంటకు తెగుళ్లు, పురుగుల ఉధృతి పెరుగుతుంది. అనవసర ఎరువుల వాడకం వల్ల పెట్టుబడి పెరగడమే కాకుండా పర్యావరణం కలుషితమవుతుంది. విత్తన దశలోనే శుద్ధి చేసుకోవడం వల్ల ప్రాథమిక దశలో వచ్చే తెగుళ్లను అరికట్టవచ్చు. ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేసినప్పుడు రైతులు తప్పనిసరిగా డీలర్ల వద్ద రశీదులు తీసుకోవాలని సూచించారు.

ఒకే రకమైన పంటలు వేయకుండా పంట మార్పిడి చేయడం వల్ల భూసారం దెబ్బతినకుండా ఉంటుందని, తద్వారా చీడపీడల సమస్య తగ్గుతుందని శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి (ఏ ఓ ) దీపిక, గ్రామ సర్పంచ్ కనగందుల లక్ష్మి, ఉపసర్పంచ్, ఏఈఓలు (ఏ ఈ ఓ ) మనోజ్ఞ, భూమేశ్వర్, నరేష్‌తో పాటు గ్రామానికి చెందిన అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. రైతులు అడిగిన పలు సందేహాలను శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు.

# రాంనూర్ గ్రామానికి చెందిన సంకోజు నవీన్ కుమార్ ను దవాఖాన లో పరామర్శ

**- పరామర్శించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**



వెల్గటూర్, మే 13 : ( ప్రజాకలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం వెల్గటూర్ మండలం రాంనూర్ గ్రామానికి చెందిన సంకోజు నవీన్ కుమార్ కు కరీంనగర్ ఓ ప్రైవేట్ హసుపత్రి లో శస్త్ర చికిత్స జరుగ గా వారిని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సంకోజు నవీన్ కుమార్ ను వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వెంట సంకోజు తిరుమల్ పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను సరి చేయండి

**- అధికారులకు బీజేపీ నేత బొల్లం అనిల్ ఫిర్యాదు**



పెద్దపల్లి,మే 13 (ప్రజాకాలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని చైతన్య కాలనీలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలను వెంటనే సరిచేయాలని కోరుతూ 9వ వార్డు బిజెపి నేత బొల్లం అనిల్ బుధవారం విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలోని పలు వీధుల్లో విద్యుత్ స్తంభాలు వంగిపోయి ఏ క్షణంలోనైనా పడిపోయే స్థితిలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో అకస్మాత్తుగా వచ్చే ఈదురుగాలులు,వడగళ్ల వానలకు ఈ స్తంభాలు కూలిపోయే ప్రమాదం ఉందని,తద్వారా భారీ ప్రాణ,ఆస్తి నష్టం జరిగే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న స్తంభాల స్థానంలో వెంటనే కొత్త వాటిని ఏర్పాటు చేయాలని,లేనిపక్షంలో కాలనీవాసులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

# పట్టపగలే పంజా విసిరిన దొంగలు

**- 12 లక్షల విలువైన వెండి,బంగారం అపహరణ**




పెద్దపల్లి,మే13:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో దొంగలు బీభత్సం సృష్టించారు. మున్సిపాలిటీ పరిధిలోని భూంనగర్ కాలనీలో గుర్తుతెలియని దొంగలు ఓ ఇంట్లోకి చొరబడి భారీ చోరీకి పాల్పడ్డారు. కాలనీకి చెందిన ముత్యం రవీందర్ ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు,ఇంట్లో ఉన్న సుమారు 12 లక్షల రూపాయల విలువైన సొత్తును దోచుకెళ్లారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..నాలుగు కిలోల వెండి దేవుడి విగ్రహాలు,ఒక తులం బంగారం మరియు 40 వేల రూపాయల నగదును దొంగలు అపహరించారు. బయటకు వెళ్ళిన కుటుంబ సభ్యులు తిరిగి ఇంటికి వచ్చేసరికి చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలు సేకరించి,పరిసర ప్రాంతాల్లో విచారణ చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న కాలనీలో ఇంతటి భారీ చోరీ జరగడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు

# ధాన్యం రవాణాకు లారీ యజమానులు సహకరించాలి

**-పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి**

గోదావరిఖని,మే13 (ప్రజాకలం జిల్లాప్రతినిధి)

రైతులు పండించిన వరి, మొక్కజొన్న ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు కేంద్రాల నుండి గోదాములకు తరలించేందుకు లారీ యజమానులు పూర్తి స్థాయిలో సహకరించాలని పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి కోరారు. బుధవారం గోదావరిఖని గంగానగర్‌లో గల లారీ అసోసియేషన్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏసీపీ ఎం. రమేష్,టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ రావుతో కలిసి లారీ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ప్రస్తుతం పీఏసీఎస్ మరియు వ్యవసాయ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని డీసీపీ సూచించారు. ధాన్యం నిల్వలు పెరగకుండా,రైతులు ఇబ్బందులు పడకుండా తగిన సంఖ్యలో లారీలను అందుబాటులో ఉంచాలని,అధికారులతో సమన్వయం చేసుకుంటూ వేగవంతమైన రవాణా సదుపాయం కల్పించాలని కోరారు. దీనిపై లారీ అసోసియేషన్ సభ్యులు సానుకూలంగా స్పందిస్తూ,రైతు ప్రయోజనాల కోసం పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లారీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి,అసోసియేషన్ సభ్యులు,యజమానులు,డ్రైవర్లు పాల్గొన్నారు.





## ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వద్దు

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



పెద్దపల్లి,మే13:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

జిల్లాలో ధాన్యం కొనుగోలు,దిగుమతి ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.బుధవారం పెద్దపల్లి మార్కెట్ యార్డుతో పాటు సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి, పూసాల,సుగ్లాంపల్లి గ్రామాల్లోని పలు రైస్ మిల్లులను ఆయన స్వయంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో అక్రమ కోతలను సహించేది లేదని,మిల్లుకు చేరిన లారీలను 24 గంటల్లోపు అన్‌లోడింగ్ చేయాలని స్పష్టం చేశారు.హమాలీల కొరత వంటి సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించి,కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.ఈ పర్యటనలో డీటీసీఎస్ మహేష్,రవీందర్ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

## తల్లాడ వాలీబాల్ జట్టుకు పలు సూచనలు చేసిన గోవిందరెడ్డి

**- కార్యక్రమంలో పాల్గొన్న వాలీబాల్ డిస్టిక్ కోచ్ నాగరాజు**



తల్లాడ మే 13 ( ప్రజా కలం న్యూస్):

తల్లాడ వాలీబాల్ జట్టుకు వాలీబాల్ అసోసియేషన్ డిస్ట్రిక్ట్ సెక్రెటరీ బుధవారం పలు సూచనలు చేశారు. ఆటలో ప్రదర్శించవలసిన నైపుణ్యతను, మెలకువలను అందుకు పాటించవలసిన విషయాలను క్షుణ్ణంగా విశదీకరించారు.తల్లాడ వాలీబాల్ జట్టులో నా అబ్జర్వేషన్లో మంచి ప్రతిభ పాటవాలు ఉన్నట్లు గమనించానని,మీరూ ఇదే స్ఫూర్తితో,డెడికేషన్ తో ఆటను ప్రదర్శించి మరింత ఉన్నతంగా భవిష్యత్తులో నిలుస్తారని.ఈ సందర్భంగా ఆయన ఆశాభావం వ్యక్తపరిచారు. భవిష్యత్తులో రాష్ట్రస్థాయిలో తల్లాడ వాలీబాల్ క్లబ్బుకు మా సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని ఈ సందర్భంగా తల్లాడ వాలీబాల్ క్లబ్ అధ్యక్షులు ధరావత్ కృష్ణ,క్లబ్ సభ్యులు వారిని అభినందించి బోకే అందించి,శాలువాతో ఘనంగా సన్మానించి సత్కరించారు.ఈ కార్యక్రమంలో జట్టు సభ్యుల అందరి ప్రోత్సాహం ఉందని మా జట్టు ప్రతి విషయాన్ని వాలీబాల్ కు సంబంధించిన ప్రతి విషయాన్ని కలిసికట్టుగా పంచుకొని క్లబ్ ఉన్నతిని మరింత పెంచేందుకు సహకరిస్తారని.ఈ సందర్భంగా ఆయన జట్టు సభ్యులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ప్లేయర్ గోపాల్ రెడ్డి, తల్లాడ వాలీబాల్ జట్టు అధ్యక్షులు ధరావత్ కృష్ణ, తల్లాడ వాలీబాల్ వ్యవస్థాపకలు జివిఆర్,సీనియర్ ప్లేయర్ చల్లా వెంకట్,పెరికే శ్రీను,షేక్ మెహరాజ్,తోట సంపత్,సురేష్,మనోజ్, అక్షయ్,అరుణ్,రవితేజ, యాసీన్ పాషా,దాదా, నాగ,హరిదీప్,కార్తీక్,చిన్న కోటారెడ్డి,భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పాలేరు ధాన్యం కొనుగోలు కేంద్రానికి మంత్రులు పొంగులేటి, ఉత్తమ్ రాక

**- కొనుగోలు ప్రక్రియపై క్షేత్రస్థాయి పరిశీలన చేయనున్న మంత్రులు**

**- వివరాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి**



పాలేరు మే 13( ప్రజా కలం న్యూస్)

పాలేరు నియోజకవర్గ పరిధిలోని పాలేరు గ్రామంలో ఇటీవల ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం సందర్శించనున్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు. గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు మంత్రులు నేరుగా కొనుగోలు కేంద్రానికి చేరుకుంటారన్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరణ ఏ విధంగా జరుగుతోంది? మద్దతు ధర అమలులో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా? అన్న అంశాలను మంత్రులు స్వయంగా అడిగి తెలుసుకుంటారని చెప్పారు. ముఖ్యంగా తూకంలో పారదర్శకత, గోనె సంచుల లభ్యత, సేకరించిన ధాన్యం మిల్లులకు తరలింపు వంటి ప్రక్రియలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, , రైతు సోదరులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొనాలని దయాకర్ రెడ్డి కోరారు.

## కూసుమంచి మండలంలో వివాహాలకు హాజరై ఆశీర్వాదించిన కందాళ ఉపేందర్ రెడ్డి

పాలేరు మే 13( ప్రజా కలం న్యూస్)కూసుమంచి మండలం పరిధిలోనే బుధవారం చేగమ్మ గ్రామానికి చెందిన శ్రీ బుర్ర వీరబాబు, జానకమ్మల కుమారుడు సురేష్‌కు శైలజ, వ్యూహాబంధంతో ఒకటయ్యారు. అలాగే, ముత్యాల గూడెం గ్రామానికి చెందిన శ్రీ నాగేల్లి వరయ్య, కరుణల కుమారుడు ఉదయ్ కుమార్‌కు త్రీష్మల వివాహం స్టార్ గార్డెన్ ఫంక్షన్ హాల్, జీళ్ళచేరువు గ్రామంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంలో పాలేరు మాజీ శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి హాజరై, నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. కూసుమంచి మండల పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## మత సామరస్యానికి ప్రతీకగా బక్రీద్ పండుగ జరుపుకోవాలి

**జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ – మత పెద్దలతో పీస్ మీటింగ్ నిర్వహణ**



జగిత్యాల్ ప్రతినిధి మే 13 (ప్రజాకలం)

మత సామరస్యానికి ప్రతీకగా బక్రీద్ పండుగ జరుపుకోవాలని.జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. బుధవారం జగిత్యాల జిల్లాలో బక్రీద్ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ లు మత పెద్దలు అధికారులతో ఫీస్ మీటింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. గ్రామాల్లో, పట్టణాల్లో మసీద్ లవద్ద పారిశుధ్య నిర్వహణ మరియు స్లాటర్ హౌసెస్ వద్ద పారిశుధ్య నిర్వహణ వేస్టేజ్ డిస్పాజ్ వెంటది వెంటనే తొలగించే విధంగా కవర్లు అందించడం వంటి విషయాల్లో తగు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయితీ అధికారి, మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు. పశువుల రవాణా మరియు సర్టిఫికెషన్ విషయంలో వెటర్నరీ అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటూ వెనువెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 5 చెక్పోస్టులు (వెల్గటూర్, ధర్మపురి, మెట్ పెల్లి, కొడిమ్యాల, రాయికల్ ) ఏర్పాటు చేశామని తెలిపారు. బక్రీద్ పండుగను మన జిల్లాలో మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకోవాలని దీనికి అందరు సహకరించాలని కోరారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ బక్రీద్ పండుగను మతసామరస్యంగా నిర్వహించుకోవాలని అందుకు అన్ని మతాలవారు సహకరించాలని అన్నారు.

బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సోషల్ మీడియా ప్రచార పట్ల అప్రమత్తంగా ఉండాలని వాటిపై ఫోకస్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకుముందు మత పెద్దల నుండి బక్రీద్ పండుగ సందర్భంగా సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ చేతన్ నితిన్, అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీ ) బి. రాజ గౌడ్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కిషోర్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, పోలీస్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు మరియు సంబంధిత అధికారులు, వివిధ మత పెద్దలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు ముందుకు రావాలి

**- పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేయండి : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ మే13 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి గ్రామ, పట్టణ ప్రజాప్రతినిధులు చురుకైన పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'విద్యా వారోత్సవాల' అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సర్పంచ్‌లు, కౌన్సిలర్‌లు, విద్యాశాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాకుండా ప్రజాప్రతినిధుల సమిష్టి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి గ్రామం, వార్డులోని పాఠశాలలను తరచూ సందర్శిస్తూ మౌలిక సదుపాయాలు, బోధన ప్రమాణాలు, విద్యార్థుల హాజరు వంటి అంశాలను పర్యవేక్షించాలని సూచించారు. పాఠశాలల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రజాప్రతినిధులు విద్యార్థులతో కలిసి భోజనం చేయడం ద్వారా ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించే అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో బడి మానేసిన పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. బాల్య వివాహాల వంటి సామాజిక రుగ్మతలు విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తాయని, అలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో జిల్లా పురోగతి సాధించడం సంతోషకరమని పేర్కొంటూ, భవిష్యత్తులో నిర్మల్ జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు అందరూ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ జ్ఞాపికలు అందజేశారు. అనంతరం జిల్లా అధికారులు కలెక్టర్ భవేశ్ మిశ్రాను శాలువాతో సన్మానించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, సీపీఓ జీవరత్నం, వివిధ మండలాల ఎంఈఓలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్‌లు, విద్యాశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన ధాన్యం సత్వరమే కొనుగోలు చేయాలి

**- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**- రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలి**

**- సజావుగా ధాన్యం కొనుగోలు జరిగేలా పటిష్ట కార్యాచరణ రూపొందించాలి**

**- ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలను సన్నద్ధం చేయాలి**

**- పాలేరు గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

పాలేరు మే 13 ( ప్రజా కలం న్యూస్ )

కొనుగోలు కేంద్రానికి వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని త్వరితగతిన మద్దతు ధరపై కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. పాలేరు గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి లతో కలిసి కోనుగోలు ప్రక్రియ, కేంద్రాల్లో రైతులకు అందిస్తోన్న మౌళిక వసతులను కలెక్టర్ పరిశీలించి, పలు సూచనలు చేశారు. టోకెన్ విధానం అమలులో ఉందా అనే



అంశాన్ని పర్యవేక్షిస్తూ, నియమ నిబంధనలు పక్కాగా పాటించాలని, టోకెన్ విధానాన్ని ఖచ్చితంగా అమలు చేస్తున్నారా, గోనె సంచులు సరిపడా అందుబాటులో ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, జిల్లాలో రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ కట్టుదిట్టంగా నిర్వహించాలని, ప్రతి రోజు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల వివరాలు, వారు తీసుకువచ్చిన వడ్ల వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని, వడ్ల తేమశాతం ఎప్పటి కప్పుడు రికార్డ్ చేసి కొనుగోలు చేయాలని అన్నారు. మద్దతు ధరపై నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే సంబంధిత మిల్లులకు తరలించాలని, ఎటువంటి ఆలస్యం జరగడానికి వీలులేదని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద అకాల వర్షాల దృష్ట్యా పంట నష్టపోకుండా అవసరమైన టార్ఫాలిన్ కవర్లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. రైతుల ధాన్యాన్ని సమయానికి తూకం వేసి సంబంధిత మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని, ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులను ఎక్కువ సేపు వేచి ఉండే పరిస్థితులు రాకుండా కాంటాలు వేగంగా పూర్తి చేయాలని తెలిపారు.కొనుగోలు చేసిన వడ్ల వివరాలను వెంటనే ఓపిఎంఎస్ లో నమోదు చేస్తూ రైతులకు త్వరగా ధాన్యం డబ్బుల చెల్లింపులు జరిగేలా చూడాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వచ్చే ధాన్యం అంచనా ప్రకారం అవసరమైన వెయింగ్, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్, టార్ఫాలిన్, గన్ని సంచులు మొదలైన మౌళిక వసతుల ఏర్పాటు పకడ్బందీగా ఉండాలని అన్నారు. త్రాగు నీరు, వేసవి కాలం దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్ లు మొదలగు సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైస్ మిల్లులకు తరలించేలా పటిష్ట రవాణా వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో వెంట జిల్లా పౌర సరఫరాల సంస్థ ఇచ్చార్జ్ మేనేజర్ సునీల్ రెడ్డి, డిఆర్డీవో శ్రీరాం, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, కూసుమంచి తహసీల్దారు సైదులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురి కోర్టుకు లీగల్ ఎయిడ్ కౌన్సిల్ గా న్యాయవాది జాజాల

ధర్మపురి, మే 13 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణం లో ధర్మపురి కోర్టుకు లీగల్ కౌన్సిల్ గా న్యాయవాది జాజాల రమేష్ నియామకం.



తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు జగిత్యాల ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ జడ్జి--చైర్ పర్సన్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ శ్రీమతి సి రత్న పద్మావతి ధర్మపురి జూనియర్ సివిల్ జడ్జి–జూడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు లీగల్ ఎయిట్ కౌన్సిల్ గా నేరెళ్ల గ్రామానికి చెందిన న్యాయ వాది జాజాల రమేష్ ను నియ మించారు. న్యాయవాదిని నియ మించుకునే వారికి ఆర్థిక సామ ర్థ్యం లేని వారికి గౌరవ కోర్టు న్యాయమూర్తి ఆదేశాల మేరకు ఉచిత న్యాయ సహాయం అవసరమైన వారికి అర్హులైన వాళ్లకు మాత్రమే లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ద్వారా న్యాయ సేవలు అందించ బడుతాయని న్యాయ వాది జాజాల రమేష్ తెలిపారు.

## కనువిందు చేస్తున్న అరుదైన 'మే పుష్పం'



పెద్దపల్లి,మే 13:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) పెద్దపల్లి జిల్లా రామగుండం మండల కేంద్రంలో ప్రకృతి అపురూప దృశ్యం ఆవిష్కృతమైంది.ఏడాదికి ఒక్కసారి మాత్రమే,అది కూడా మే నెలలో వికసించే అరుదైన మే పుష్పం స్థానిక ఇంజపురి శంకర్ – శారద దంపతుల ఇంటి పెరట్లో వికసించి అందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తోంది.ఎర్రటి రంగులో,వందలాది సన్నని రేకులతో గుండ్రంగా,దాదాపు ఫుట్‌బాల్ సైజులో ఉన్న ఈ పువ్వును చూసేందుకు చుట్టుపక్కల ప్రజలు తండోపతండాలుగా తరలివస్తున్నారు. ఆకుపచ్చని ఆకుల మధ్య అగ్నిగోళంలా మెరిసిపోతున్న ఈ పువ్వు వద్ద చిన్నారులు, మహిళలు ఆసక్తిగా సెల్ఫీలు దిగుతున్నారు. శాస్త్రీయంగా స్కాడోక్సస్ మల్టీఫ్లోరస్ అని పిలిచే ఈ పుష్పాన్ని తెలుగులో మే పుష్పం లేదా అగ్ని పుష్పం అని,ఆంగ్లంలో ఫుట్‌బాల్ లిల్లీ లేదా బ్లడ్ లిల్లీ అని పిలుస్తారు.ఎండలు తీవ్రంగా మండుతున్న వేళ,వర్షాకాలం రాకకు సూచికగా ఈ పువ్వు వికసిస్తుందని ప్రకృతి ప్రేమికులు చెబుతారు.ఏడాది పొడవునా భూమిలో దుంప రూపంలో నిద్రాణంగా ఉండి,మే నెల రాగానే ముందుగా పువ్వును,ఆ తర్వాత ఆకులను విచ్చుకోవడం దీని ప్రత్యేకత.ఒక్కసారి వికసిస్తే కేవలం 10 నుంచి 15 రోజులు మాత్రమే కనువిందు చేసే ఈ అరుదైన పువ్వు ఇప్పుడు మండల కేంద్రంలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

## నేపాలీ పనివారి విషయంలో అప్రమత్తంగా ఉండాలి

**- పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్ రావు కుమార్**



పెద్దపల్లి,మే 13:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) హైదరాబాద్ నగరంలో ఇటీవల నేపాల్ దేశస్థులు వరుసగా దొంగతనాలు,దాడులకు పాల్పడుతున్న సంఘటనల దృష్ట్యా పెద్దపల్లి పోలీసులు అప్రమత్తమయ్యారు.ఈ నేపథ్యంలో పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్ రావు బుధవారం పట్టణంలోని హోటల్ యజమానులతో ప్రత్యేకంగా సమావేశమై పలు కీలక సూచనలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మణ్ రావు మాట్లాడుతూ హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ వంటి ప్రాంతాల్లో నేపాలీ ముఠాలు పనిమనుషులుగా చేరి యజమానుల నమ్మకాన్ని గడించి,ఆపై మత్తుమందు ఇచ్చి దోచుకోవడం,దాడులకు తెగబడటం వంటి ఘటనలు కలకలం రేపాయని గుర్తు చేశారు.నిందితులు నేరాలు చేసిన వెంటనే సరిహద్దులు దాటి నేపాల్‌కు పారిపోతుండటంతో వారిని పట్టుకోవడం సవాలుగా మారుతోందని,అందుకే ముందస్తు జాగ్రత్తగా హోటల్ యజమానులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.హోటళ్లలో పనిచేసే నేపాల్ దేశస్థులతో పాటు ఇతర ప్రాంతాల వారి పూర్తి వివరాలను,ఆధార్ కార్డులు,పాస్‌పోర్ట్ కాపీలు మరియు వారి స్వగ్రామ చిరునామాలను సేకరించి వెంటనే పోలీస్ స్టేషన్‌లో సమర్పించి వెరిఫికేషన్ చేయించుకోవాలని యజమానులను ఆదేశించారు.కేవలం తక్కువ జీతానికి వస్తున్నారని నమ్మకమైన ఆధారం లేని వారిని నియమించుకుని ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హెచ్చరించారు.ప్రతి హోటల్‌లో సిసిటివీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని,పనివారి కదలికలపై నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించి అపరిచితులను పనిలో పెట్టుకుంటే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని,అనుమానితుల సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించాలని ఎస్ఐ లక్ష్మణ్ కుమార్ సూచించారు.

## తురకగూడెంలో రైతులకు పంట అవశేషాల నిర్వహణ, నిషేధిత హెచ్‌టి పత్తి, నకిలీ విత్తనాలపై అవగాహన

పాలేరు మే 13 (ప్రజా కలం న్యూస్) కూసుమంచి మండలం పరిధిలోనే బుధవారం తురకగూడెం గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంట అవశేషాలను తగలబెట్టడం ద్వారా కలిగే నష్టాలు, వాటిని భూమిలో కలియదున్నే విధానం గురించి రైతులకు విస్తృతంగా వివరించారు. అనంతరం నిషేధిత హెచ్‌టి పత్తి సాగు, విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నకిలీ విత్తనాలను ఎలా గుర్తించాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎవరైనా అపరిచిత వ్యక్తులు లేదా ఇతరులు అనుమతి లేకుండా విత్తనాలు విక్రయిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జానీ బాబా, రైతులు పాల్గొన్నారు.



# పది పాసైన విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలోనే చేరాలి

- తాడిచెర్ల సర్పంచ్ బండి స్వామి



మల్హార్, మే 13 ప్రజాకలం ప్రతినిధి

మండల కేంద్రంలోని తాడిచెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత రెండు రోజులుగా ప్రారంభమైన తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజు తాడిచెర్ల జూనియర్ కళాశాల అధ్యాపకులతో కలిసి స్థానిక సర్పంచ్ బండి స్వామి ఈ సంవత్సరం పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులు ఎవరు కూడా డ్రాప్ అవుట్ కాకుండా స్థానిక కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరాలని కోరారు. విద్యార్థినుల తల్లిదండ్రులు అమ్మాయిలను తప్పకుండా పై చదువులు చదివించాలని చదువు మానేయకుండా చూడాలని కోరారు. ఈ సంవత్సరం తాడిచర్ల జూనియర్ కళాశాల ఇంటర్ వార్షిక పరీక్షల్లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం పొందినందుకుగాను కళాశాల ప్రిన్సిపాల్ విజయదేవి, అధ్యాపకులను అభినందించారు. పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు కామ బాపు, మేనం రాకేష్, వోన్న తిరుపతి రావు, నారమల్ల రాజేశ్వరి, అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## నీట్ అక్రమాలపై తాడిచెర్లలో ఆర్టీఐ నిరసన

- పేద విద్యార్థుల జీవితాలతో ఆటలాడొద్దు!



మల్హార్, మే 13 ప్రజాకలం ప్రతినిధి : నీట్ పరీక్ష నిర్వహణలో జరుగుతున్న వరుస అవకతవకలపై ఆర్టీఐ మల్హార్ రావు మండల కన్వీనర్ బండి సుధాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తాడిచర్లలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కాశిపేట పోచయ్య, ఇందారపు దావిద్ రాజ్ లతో కలిసి ఆయన మాట్లాడారు. రాత్రింబవళ్లు కష్టపడి చదివిన పేద, మధ్యతరగతి విద్యార్థుల జీవితాలను పరీక్షల్లో పారదర్శకత లోపం వల్ల అంధకారంలోకి నెట్టేస్తున్నారని ఆవేదన చెందారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కష్టపడి చదివిన ప్రతి విద్యార్థికి న్యాయం జరిగే వరకు పోరాడతామన్నారు. "విద్యార్థుల భవిష్యత్తు కాపాడాలి -- ప్రతిభకు న్యాయం చేయాలి" అంటూ ఈ సందర్భంగా వారు గట్టిగా నినాదాలు చేశారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన సర్పంచ్ జంగిడి శ్రీనివాస్ ముదిరాజ్



మల్హార్, మే13 ప్రజాకలం ప్రతినిధి ఎడ్లపల్లి గ్రామంలో బుధవారం జరిగిన జినుకల సారయ్య కుమార్తె రమ్య, చింతకింది రమేష్ కుమారుడి వివాహానికి.. అలాగే ఇసురం శంకర్ కుమార్తె వివాహ వేడుకకు గ్రామ సర్పంచ్ జంగిడి శ్రీనివాస్, ఉప సర్పంచ్ వేల్పుల రమేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు జనగామ లక్ష్మిరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకల్లో వార్డు సభ్యులు చెన్నవేని సుగుణ లక్ష్మణ్, మేరుగు శ్రీనివాస్, తోకల రమ సమ్మయ్య, లావుడ్య రవీందర్, అక్కినవేని మాంతయ్య, బత్తుల తిరుపతి, మద్దెల రాజబాబు, మద్దెల రాజకుమార్, అజ్మీర శివ, కామ వెంకటేష్, మంథని బుచ్చయ్య, గుర్రం సారయ్య గ్రామ ప్రజలు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.

## శిక్షణ నర్సులతో మంత్రి వివేక్ ముఖాముఖి

హైదరాబాద్ : టామ్కామ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ట్రిపుల్ విన్ ప్రోగ్రామ్లో భాగంగా శిక్షణ పొందుతున్న నర్సులతో మంత్రి వివేక్ వెంకటస్వామి టూరిజం ప్లాజాలో ముఖాముఖి నిర్వహించారు. జర్మనీలో పని చేయడం ఒక పెద్ద అవకాశం మాత్రమే కాదు, ఒక ఛాలెంజ్ కూడా. కొత్త భాష, కొత్త వాతావరణం, కొత్త విధానాలకు అలవాటు పడాల్సి ఉంటుంది. కానీ కష్టపడి నేర్చుకుంటే తప్పకుండా విజయాన్ని సాధించవచ్చు అని వారికి చెప్పారు. నర్సులు రోగులకు ఇచ్చే ధైర్యం, నమ్మకంతోనే సగం వ్యాధి తగ్గిపోతుంది. అందుకే నర్సింగ్ వృత్తి ఎంతో గొప్పది. అంతర్జాతీయ నర్సింగ్ డే సందర్భంగా నర్సులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రి మాట్లాడుఎతూ టామ్కామ్ ద్వారా తెలంగాణ యువతకు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పిస్తున్నాం. ఇది కేవలం ప్రారంభం మాత్రమే. ఈ బ్యాచ్ జర్మనీలో మంచి ప్రతిభ కనబరిస్తే, భవిష్యత్తులో మరింత మంది తెలంగాణ యువతకు అవకాశాలు లభిస్తాయి. జర్మన్ భాషపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించాను. డాక్టర్లు సూచించిన మందులను రోగులకు సరిగ్గా అందించాలంటే కమ్యూనికేషన్ చాలా కీలకం. ప్రస్తుతం ఆన్లైన్ ద్వారా కూడా భాషలను సులభంగా నేర్చుకునే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఆధునిక టెక్నాలజీ, సోషల్ మీడియా, కమ్యూనికేషన్ నైపుణ్యాలను సమర్థంగా ఉపయోగించుకుంటే గొప్ప విజయాలు సాధించవచ్చని వారికి వివరించాను.

# ధాన్యం అన్‌లోడింగ్‌లో జాప్యం వద్దు

## రైతులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ మే13 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలో ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం దిలావార్ పూర్ టోల్ ప్లాజా, లోకేశ్వరం మండలంలోని పలు రైస్ మిల్లులను ఆయన స్వయంగా సందర్శించి ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మిల్లులకు చేరుకున్న లారీలను 24 గంటల్లోపు తప్పనిసరిగా అన్‌లోడింగ్ పూర్తి చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి కటింగ్‌లు, అక్రమ కోతలు అనుమతించబోమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హమాలీల కొరత ఉన్న ప్రాంతాల్లో వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, ధాన్యం దిగుమతిలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే పీపీసీలు, రవాణా విభాగం, రైస్ మిల్లుల మధ్య సమన్వయం కొనసాగించాలని ఆదేశించారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని త్వరితగతిన అన్‌లోడింగ్ చేసి వారికి ఇబ్బందులు కలగకుండా చూడటం అధికారుల బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, సివిల్ సప్లై అధికారులు రాజేందర్, సుధాకర్, తహసీల్దార్ సూర్యరావ్ తదితరులు పాల్గొన్నారు.

# నల్లబెల్లి గ్రామానభివృద్ధికై ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పణ

- సబ్‌స్టేషన్ మంజూరు, చెరువు కట్ట మరమ్మత్తులకు రూ.35 లక్షల నిధులపై గ్రామస్తుల హర్షం



మే 13 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట)

వర్ధన్నపేట మండలంలోని నల్లబెల్లి గ్రామ అభివృద్ధికి సంబంధించి పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకి వినతిపత్రం అందజేశారు. నల్లబెల్లి గ్రామ కంటెస్టెడ్ సర్పంచ్, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు బిర్రు మౌనిక-రాజు ఆధ్వర్యంలో గ్రామ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం వర్ధన్నపేట మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నల్లబెల్లి గ్రామానికి విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేయించినందుకు గ్రామ ప్రజల తరఫున ఎమ్మెల్యే నాగరాజుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గ్రామ చెరువు కట్ట మరమ్మత్తుల కోసం నీటిపారుదల శాఖ ద్వారా రూ.35 లక్షలు మంజూరు చేయించడంపై హర్షం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధిలో భాగంగా కాటమయ్య గుడి వద్ద సీసీ నిర్మాణ పనులు చేపట్టాలని, ఎస్సీ స్మశానవాటికకు సింగిల్ ఫేజ్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా నల్లబెల్లి క్రాస్ నుండి కోట వీరస్వామి మిల్లు వరకు సీసీ రోడ్డు, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. రజక సంఘం కమ్యూనిటీ హాల్ మరమ్మత్తులు చేపట్టాలని కూడా విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా గ్రామ ఆడపడుచులు బతుకమ్మ పండుగ నిర్వహించుకునేందుకు ప్రత్యేక స్థలం కేటాయించాలని, రైతులు పండించిన ధాన్యం నిల్వ చేసేందుకు స్థలం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల సమస్యలను సానుకూలంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నాగరాజు హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాటికాయల దిలీప్, 12వ వార్డు సభ్యుడు ఆరెల్లి నాగరాజు, సొసైటీ డైరెక్టర్ తాటికాయల ఎల్లయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గిరగాని యాదగిరి, బిర్రు గోపాల్, జనపురెడ్డి సంపత్ రెడ్డి, దుగ్యాల దేవేందర్రావు, బిర్రు చంద్రయ్య, ముత్యం యాకాంబరం తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

## వర్ధన్నపేటలో సర్పంచులకు విద్యా కార్యక్రమాలపై ప్రత్యేక కార్యక్రమం

-విద్యార్థుల భవితవ్యం ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంది.-ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు



మే 13 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట)

వర్ధన్నపేట నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీల సర్పంచులకు పాఠశాల విద్యా కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు ఒకరోజు ప్రత్యేక వర్క్‌షాప్‌ను బుధవారం వర్ధన్నపేట మున్సిపాలిటీ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల హాజరు పెంపు, మౌలిక వసతుల కల్పన, గ్రామస్థాయి విద్యా పర్యవేక్షణలో సర్పంచుల బాధ్యతలపై అధికారులు సమగ్రంగా వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో ప్రజాప్రతినిధులు, సర్పంచులు కీలకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి గ్రామంలో విద్యా ప్రమాణాలు పెరగాలంటే స్థానిక సంస్థల భాగస్వామ్యం అవసరమన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం గ్రామస్థాయిలో పాఠశాలల పర్యవేక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. వరంగల్ జిల్లా కలెక్టర్ శ్రీమతి సత్య శారద మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పలు సంస్కరణలు చేపడుతోందని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, పారిశుధ్యం, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు వంటి అంశాల్లో సర్పంచులు చొరవ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ సారంగపాణి, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య, రాజేష్ కన్నా, జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, వరంగల్ ఆర్డీఓ శ్రీమతి సుమ, వర్ధన్నపేట తహసీల్దార్ విజయసాగర్, పర్వతగిరి తహసీల్దార్ వెంకటస్వామి, రాయపర్తి తహసీల్దార్ శ్రీనివాస్, వర్ధన్నపేట ఎంపీడీవో వెంకటరమణ, రాయపర్తి ఎంపీడీవో కిషన్, పర్వతగిరి ఎంపీడీవో శంకర్, వర్ధన్నపేట ఎంఈఓ శ్రీధర్, రాయపర్తి మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి బిక్షపతి, రిసోర్స్ పర్సన్స్, వర్ధన్నపేట, పర్వతగిరి, రాయపర్తి మండలాల సర్పంచులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# మొక్క జొన్న ,వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సత్య శారద

( వరంగల్/ పర్వతగిరి) మే 13, ప్రజాకలం ప్రతినిధి.

రాయపర్తి, వర్ధన్నపేట, పర్వతగిరి మండలాల పరిధిలోని బండవతాపూర్, చెరువు ముందు తండా, రాయపర్తి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ, పిఎసిఎస్ , వరి, మొక్క జొన్న ధాన్యం కొనుగోలు, కేంద్రాలను, వర్ధన్నపేటలోని ఏఎంసీ గోదామును జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో రైతులకు అందిస్తున్న సౌకర్యాలు, ధాన్యం కొనుగోలు ప్రక్రియ, తేమ శాతం పరీక్షలు, గన్నీ బ్యాగుల లభ్యత, ధాన్యం నిల్వలు, రవాణా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో ధాన్యం కొనుగోలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రైతులకు చెల్లింపులు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రాల్లో తాగునీరు, నీడ, కూర్చునే సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. అనంతరం ఐకేపీ కేంద్రాల నిర్వహణ, రికార్డుల నిర్వహణను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

వర్ధన్నపేట లోని వీరభద్ర రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు నిర్లక్ష్యం చేయకుండా ధాన్యాన్ని దించుకోవాలని రైస్ మిల్లర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఆర్డీవో సుమ , తహాశీల్దార్ విజయ్ సాగర్, డిసిఎస్ ఓ కిష్టయ్య, డిఎం సివిల్ సప్లై సంధ్యారాణి, సంబంధిత ఎంపీడీవోలు, వెంకటరమణ వ్యవసాయ శాఖ అధికారులు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధువరులని ఆశీర్వధించిన మార్నేని రవీందర్ రావు

- వివాహ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన మాజీ టెస్కాబ్ చైర్మన్

మే 13 : ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ / వర్ధన్నపేట)





మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు బుధవారం పలువురు నూతన వధూవరుల వివాహ వేడుకల్లో పాల్గొని ఆశీర్వదించారు. వంచనగిరి గ్రామానికి చెందిన కొల్లూరి సుమలత- రవీందర్ దంపతుల కుమార్తె రక్షిత వివాహ కార్యక్రమానికి హాజరైన ఆయన, వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసి సుఖసంతోషాలతో దాంపత్య జీవితం కొనసాగాలని ఆకాంక్షించారు. అలాగే హన్మకొండ హంటర్ రోడ్‌లోని ఆర్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన అయినవోలు గ్రామానికి చెందిన బరిగెల కవిత - నాగయ్య దంపతుల ఏకైక కుమారుడు క్రాంతి కుమార్, అక్షితల వివాహ వేడుకలో కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన దంపతులను ఆశీర్వదించిన మార్నేని రవీందర్ రావు, కుటుంబ బంధాలు పరస్పర గౌరవంతో బలపడాలని, నవదంపతులు ఆనందకరమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వారిగా బరిగెల భాస్కర్, మాజీ సర్పంచ్ జన్ను కుమార్, స్వామి, సునీల్, జెన్నీ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ




మల్హార్, మే13 ప్రజాకలం ప్రతినిధి జాప్యం లేకుండా ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం మల్హార్ రావు మండలంలోని కొయ్యూరు, కొండంపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బంది లేకుండా తార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. రవాణా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, రోజుకు కనీసం రెండు లారీలను కొనుగోలు కేంద్రాలకు కేటాయించాలని ఆదేశించారు. కేంద్రాల్లో కచ్చితమైన రిజిస్టర్లు నిర్వహించి, వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. రైతులు తాలు, రాళ్లు, మట్టి గుల్లలు లేని నాణ్యమైన ధాన్యాన్ని శుభ్రపరిచి మిల్లులకు పంపేలా సహకరించాలన్నారు. ప్యాడీ క్లీనింగ్ పరికరాలు కొరత ఉంటే, ఇతర ప్రాంతాల నుండి తెప్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఆర్ఓ వసంత కుమారి, పౌరసరఫరాల అధికారి కిరణ్ కుమార్, డీఎం రాములు, సహకార అధికారి వాలియా నాయక్, వ్యవసాయ అధికారి బాబూరావు, తహసీల్దార్ కె. రవికుమార్, ప్యాక్స్ చైర్మన్ ఇప్ప మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో ఘనంగా విద్యా వారోత్సవాలు

## గ్రామీణ-విద్యా వ్యవస్థల అనుసంధానానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం

ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. పోషయ్య

మే 13ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట) తెలంగాణ ప్రభుత్వ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల మూడవ రోజు కార్యక్రమం బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇల్లంద గ్రామ సర్పంచి భేతి సాంబయ్య, అంబేద్కర్ నగర్ సర్పంచ్ చిట్టూరి రాజు, దమ్మన్నపేట సర్పంచి అంజయ్యలను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. పోషయ్యతో పాటు అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జి. పోషయ్య మాట్లాడుతూ గ్రామీణ వ్యవస్థను విద్యా వ్యవస్థతో అనుసంధానం చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను గ్రామాల ప్రజలకు చేరవేసి, విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో చేరేలా అవగాహన కల్పించాలని సూచించారు. సర్పంచులు మాట్లాడుతూ తమ గ్రామాలలో నిర్వహించే గ్రామ సభలు, వేదికల ద్వారా ప్రభుత్వ కళాశాలల్లో చేరికలపై అవగాహన కల్పించి, విద్యార్థులు ప్రభుత్వ విద్యాసంస్థల సదుపాయాలను సద్వినియోగం చేసుకునేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశిష్ట సేవలు అందించిన అధ్యాపకులను, వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. సన్మానం పొందిన విద్యార్థుల్లో ఎం. శ్రీనివాస్ (బీకాం ద్వితీయ సంవత్సరం), భూక్య ఉమేష్ (బీజెడ్‌సీ ప్రథమ సంవత్సరం), రాజేష్ (బీఏ ప్రథమ సంవత్సరం), ఎస్. నాగరాజు (బీకాం ప్రథమ సంవత్సరం) ఉన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు డా. రజిత, డా. విష్ణు, డా. మధు, డా. శ్రీనివాస్, డా. రాజు, డా. స్నేహలత, డా. సంపత్, డా. శ్వేత, డా. సుధ తదితరులు పాల్గొన్నారు.



# వైద్య ఆరోగ్య శాఖ ప్రక్షాళన

## - 51 మంది డిస్మిస్, 33 మందికి మెమోలు

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ మంత్రి సత్యకుమార్ యాదవ్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన వైద్య పరికరాల కొనుగోళ్లలో భారీగా అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో, వీటిపై సమగ్ర విచారణకు ఆయన ఆదేశించారు. ప్రజారోగ్యంతో ముడిపడి ఉన్న శాఖలో అక్రమాలకు తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వైద్య పరికరాల సేకరణలో ఇకపై ఎటువంటి అవకతవకలకు ఆస్కారం ఉండకూడదని మంత్రి హెచ్చరించారు. కొనుగోళ్ల ప్రక్రియలో సమగ్ర సంస్కరణలు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. టెండర్ల దగ్గర నుండి డెలివరీ వరకు ప్రతి దశలోనూ పారదర్శకత ఉండాలని, దీని కోసం అత్యాధునిక విధానాలను అమలు చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా చూడడమే లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. శాఖలోని క్షేత్రస్థాయి సిబ్బంది పడుతున్న ఇబ్బందులపై మంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపారు. వైద్య సిబ్బందికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న సర్వీసు పరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్యదర్శి సౌరభ్ గౌరవ్‌కు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగులు ఆందోళన చెందకుండా, వారి సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని, దీనివల్ల ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. త్వరలో చేపట్టబోయే సాధారణ బదిలీల ప్రక్రియపై మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. బదిలీలు ఎటువంటి పైరవీలకు తావులేకుండా, అత్యంత సజావుగా సాగాలని స్పష్టం చేశారు. అర్హత కలిగిన ప్రతి ఉద్యోగికి న్యాయం జరిగేలా బదిలీల షెడ్యూల్ రూపొందించాలని, ఈ ప్రక్రియలో ఎక్కడా చిన్నపాటి అవాంతరాలు కూడా ఎదురుకాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

**సొంత వ్యాపకాలతో డ్యూటీలకు గైర్హాజరు...**మరో వైపు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో పనిచేస్తున్న 51 మంది వైద్యులను విధుల నుంచి తొలగించినట్లు మంత్రి తెలిపారు. వీరిలో 8 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 41 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు ట్యూటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఏపీ సివిల్ సర్వీసెస్ కండక్ట్ రూల్స్ ప్రకారం ఏడాదికిపైగా విధులకు గైర్హాజరవుతున్న వారిని ఉద్యోగానికి రాజీనామా చేసినట్లుగా పరిగణించి చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని మంత్రి సత్యకుమార్ తెలిపారు. అయితే నేరుగా చర్యలు తీసుకోకుండా ముందుగా సంజాయిషీ నోటీసులు ఇచ్చి సమయం కూడా ఇచ్చామని వివరించారు. అయినప్పటికీ స్పందించకపోవడంతో చివరకు తొలగింపు చర్యలు తీసుకున్నామన్నారు. విధుల నుంచి తొలగించిన వారిలో కొందరు చాలా కాలంగా ఆస్పత్రులకు రాకపోవడం బయటపడింది. ఆంధ్ర వైద్య కళాశాలకు చెందిన ఓ అసోసియేట్ ప్రొఫెసర్ 2020 ఫిబ్రవరి నుంచి విధులకు హాజరుకావడం లేదని అధికారులు గుర్తించారు. మరికొందరు 2022 నుంచి కూడా విధులకు దూరంగా ఉన్నట్లు తేలింది. ట్యూటర్లలో ఒకరు ఏకంగా ఏడేళ్లుగా విధులకు రాకపోవడం సంచలనంగా మారింది. కడప, అనంతపురం, ఒంగోలు, తిరుపతి, విజయవాడ, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, నెల్లూరు, మార్కాపురం ప్రభుత్వ వైద్య కళాశాలలకు చెందిన వైద్యులు ఈ జాబితాలో ఎక్కువగా ఉన్నారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. కొందరు వైద్యులు సొంత వ్యాపకాలు, ప్రైవేట్ ప్రాక్టీసులు చూసుకుంటూ ప్రభుత్వ విధులకు దూరంగా ఉన్నట్లు గుర్తించారు. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. రెగ్యులర్ నియామకాల ద్వారా ప్రభుత్వ సేవల్లో చేరినప్పటికీ.. కొందరు ఆస్పత్రులకు రాకుండా వేతనాలు పొందుతున్నారన్న ఫిర్యాదులు చాలా కాలంగా వస్తున్నాయి. దీనివల్ల బోధనాసుపత్రుల్లో వైద్య సేవలు దెబ్బతింటున్నాయని ప్రభుత్వం భావించింది. ప్రత్యేకంగా మెడికల్ కాలేజీల్లో అధ్యాపకుల కొరత కారణంగా విద్యార్థులు, రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నివేదికలు రావడంతో ప్రభుత్వం కఠిన చర్యలకు దిగింది. వైద్యులు విధులకు హాజరుకాకపోవడంపై మంత్రి సీరియస్ కావడంతో డీఎంఈ అధికారులు పూర్తి స్థాయి తనిఖీలు చేపట్టారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల నుంచి హాజరు వివరాలు తెప్పించారు. ఎవరు ఎంతకాలంగా విధులకు దూరంగా ఉన్నారు? ఎవరికి నోటీసులు ఇచ్చారు? ఎవరెవరు స్పందించారు? అనే అంశాలపై ప్రత్యేక జాబితా సిద్ధం చేశారు. తర్వాత నిబంధనల ప్రకారం తొలగింపు ప్రక్రియ చేపట్టారు. మరో ముగ్గురు ప్రొఫెసర్లపై కూడా చర్యలు ప్రస్తుతం తొలగించిన 51 మందిలో ప్రొఫెసర్లు లేరు. అయితే దీర్ఘకాలంగా విధులకు దూరంగా ఉన్న ముగ్గురు ప్రొఫెసర్లపై కూడా త్వరలో చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మొత్తం ఐదుగురు ప్రొఫెసర్లు దీర్ఘకాలంగా గైర్హాజరైనట్లు గుర్తించగా..నోటీసుల తర్వాత ఇద్దరు తిరిగి విధుల్లో చేరినట్లు సమాచారం. మిగిలిన ముగ్గురిపై చర్యలకు రంగం సిద్ధమవుతోందిఇంకా ఏడాది పూర్తి కాకపోయినా దీర్ఘకాలంగా విధులకు రాని మరో 33 మంది వైద్యులకు ఛార్జిమెమోలు జారీ చేశారు. వీరిలో ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, 31 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. ఇప్పటికే 11 మంది వైద్యులు నోటీసుల తర్వాత తిరిగి విధుల్లో చేరినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన వారు కూడా వెంటనే హాజరుకాకపోతే.. ఏడాది గడువు దాటిన తర్వాత వారిపైనా ఉద్వాసన చర్యలు తప్పవని స్పష్టం చేస్తున్నారు. “బాధ్యతారాహిత్యాన్ని ఉపేక్షించం” విధుల నిర్వహణలో అలక్ష్యం, నిర్లక్ష్యం సహించబోమని మంత్రి సత్యకుమార్ యాదవ్ హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులు ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉంటారని.. ఇష్టానుసారంగా విధులకు దూరంగా ఉండటం తీవ్రమైన విషయం అని పేర్కొన్నారు. “ప్రభుత్వ సేవలో ఉంటూ విధులకు హాజరుకాకపోవడం అనేది చిన్న విషయం కాదు. రోగులకు నష్టం జరిగితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారు? బాధ్యతారాహిత్యాన్ని ప్రభుత్వం ఉపేక్షించే పరిస్థితి లేదు” అని మంత్రి స్పష్టం చేశారు. ఒకవైపు గైర్హాజరు వైద్యులపై చర్యలు తీసుకుంటూనే.. మరోవైపు ఖాళీల భర్తీపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టింది. జీరో వేకెన్సీ పాలసీ కింద వెంటనే నియామకాలు చేపట్టే దిశగా చర్యలు తీసుకుంటోంది. బోధనాసుపత్రుల్లో వైద్యులు, అధ్యాపకుల కొరత లేకుండా చూడాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే పలు పోస్టుల భర్తీ ప్రక్రియ వేగవంతం చేసినట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ తాజా చర్యలతో బోధనాసుపత్రుల్లో డ్యూటీలకు గైర్హాజరు అయ్యే వైద్యుల్లో ఆందోళన మొదలైనట్లు తెలుస్తోంది. ఇకపై విధులకు డుమ్మా కొడితే కఠిన చర్యలు తప్పవన్న సంకేతాన్ని ప్రభుత్వం స్పష్టంగా ఇచ్చిందని వైద్య వర్గాలు భావిస్తున్నాయి.

# పరుగులు పెడుతున్న అమరావతి

విజయవాడ :అమరావతి రాజధాని నిర్మాణ పనులు చాలా వేగంగా జరుగుతున్నాయి. 2028 నాటికి తొలి దశ పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉంది ప్రభుత్వం. ఒక రూపం తీసుకువచ్చి ఎన్నికలకు వెళ్లాలన్నది ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది. ఓటమి వచ్చిన తర్వాత అమరావతి పునర్నిర్మాణంపై ఫుల్ ఫోకస్ పెట్టింది. అమరావతిని ప్రపంచ నగరాల్లో ఒకటిగా నిలపాలన్నది చంద్రబాబు ఆలోచన. ఆ వ్యూహానికి తగ్గట్టు పనులు జరుగుతున్నాయి. అయితే ఇప్పటివరకు రాష్ట్రస్థాయిలోనే అమరావతిపై చర్చ జరిగేది. కానీ ఇప్పుడు జాతీయ స్థాయిలో సైతం అమరావతిపై చర్చ జరుగుతోంది. దేశంలోని ప్రముఖ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు, జర్నలిస్టులు ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో జాతీయస్థాయిలో విస్తృత ప్రచారం జరుగుతోంది అమరావతి నిర్మాణంలో సాంకేతిక అంశాలను జోడిస్తోంది ప్రభుత్వం. ప్రధానంగా గ్రిడ్ తరహా డిజైన్, కృష్ణానది తీరాన అభివృద్ధి చెందుతున్న జోనల్ సిస్టం ఇప్పుడు ప్రచారంలోకి వస్తోంది. ప్రముఖ యూట్యూబర్ రాజన్ సింగ్ అమరావతి పనులపై రూపొందించిన వీడియో విపరీతంగా వైరల్ అవుతోంది. దేశ ప్రజలను ఆకర్షిస్తోంది. కేవలం సంక్షేమ పథకాలు కాదు.. శాశ్వతమైన మౌలిక సదుపాయాల కల్పన ప్రాధాన్యతను అమరావతి నిరూపిస్తోందని ఈ వీడియో చూసిన వారు అభిప్రాయపడుతున్నారు. ఒకవైపు ఏపీలో సంక్షేమ పథకాలు కొనసాగిస్తూనే.. సెల్ఫ్ ఫైనాన్స్ సిటీగా అమరావతిని రూపుదిద్దుతున్నారు. ఇప్పటికే ప్రతిష్టాత్మక యూనివర్సిటీలు, ప్రపంచ స్థాయి విద్యాసంస్థల క్యాంపస్లు అమరావతిలో నెలకొల్పుతున్నారు. ఇదే విషయాన్ని చెబుతున్నారు యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు. ప్రస్తుతం ఎండలకు తీవ్రత అధికంగా ఉంది. అమరావతి చుట్టుపక్కల ప్రాంతాల్లో తీవ్ర స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అయితే ఈ ఎండల్లో సైతం అమరావతి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరోవైపు ఎండలను కూడా లెక్క చేయకుండా జాతీయస్థాయి ఇన్ఫ్లుయెన్సర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి.. అక్కడ జరుగుతున్న అద్భుతమైన మౌలిక వసతుల కల్పనను రికార్డ్ చేస్తున్నారు. అత్యాధునిక రవాణా సౌకర్యాలు, విశాలమైన రహదారులు, పక్కాగా విభజించిన నివాస, వాణిజ్య జోన్లను చూసి ఇండియాలోనే అద్భుత నగరం అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. రాబోయే తరాలకు ఒక ఆదర్శప్రాయమైన మాడల్ అవుతుందని ఎక్కువమంది కామెంట్స్ చేస్తున్నారు. జాతీయ మీడియాలో సైతం ప్రత్యేక కథనాలు వస్తున్నాయి. తద్వారా అమరావతిలో పెట్టుబడులు పెడుతున్న ప్రైవేటు సంస్థలు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

# మురిగిపోతున్న కేంద్ర నిధులు

విజయవాడ : కేంద్ర నిధులను సకాలంలో వినియోగించక పోవటంతో ఏపీ భారీగా నష్టపోయింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రాయోజిక పథకాల ద్వారా కేంద్రం ఏపీకీ రూ.15031 కోట్లు కేటాయించింది. అయితే ఇందులో కేవలం 9980 కోట్లు మాత్రమే వినియోగించుకున్నారు. సకాలంలో సక్రమంగా వినియోగించుకోకపోవటంతో రూ.5000 కోట్లకుపైగా నిధులు మురిగిపోయాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ శాఖలు కేంద్ర నిధులను సకాలంలో వినియోగించుకోవాలని ప్రభుత్వం అధికారులకు స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ నిధులను సక్రమంగా వినియోగించుకోకపోవటంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భారీగా నష్టపోయింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రాయోజిక పథకాలు (సీఎస్ఎస్) కింద అందిన నిధులలో సక్రమంగా వినియోగించని కారణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రూ.5000 కోట్లకు పైగా కోల్పోయింది. ఈ నేపథ్యంలో కేంద్ర నిధులను సకాలంలో వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ శాఖలు, జిల్లా యంత్రాంగాలను ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను సమర్థవంతంగా వినియోగించటంపై దృష్టి పెట్టాలని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రిన్సిపల్ సెక్రటరీలను ఆదేశించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం 79 పథకాల కింద రాష్ట్రానికి రూ.15,031 కోట్లు కేటాయించింది. అయితే ఇందులో కేవలం రూ. 9980 కోట్లను మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకుంది. 2025 - 26 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఏపీకి రూ.15,031 కోట్లు కేటాయించిందన్న ఏపీ ఆర్థికశాఖ కార్యదర్శి రొనాల్డ్ రాస్.. ఇందులో రూ. 11,465 కోట్లు విడుదల చేసిందన్నారు. కేంద్రం చేసిన మొత్తం కేటాయింపులో దాదాపు 76 శాతానికి సమానంగా వెల్లడించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా నిధులు సకాలంలో విడుదలైనప్పటికీ, రాష్ట్రం కేవలం రూ. 9,980 కోట్లను మాత్రమే వినియోగించుకోగలిగిందని.. పలు పరిపాలనా, సాంకేతిక కారణాల వల్ల నిధుల గడువు ముగిసిందని వివరించారు. బడ్జెట్ అంచనాల్లో మార్పులు, నాలుగో త్రైమా సికంలో నిధులు విడుదల కాకపోవటం, కొన్ని శాఖలలో తక్కువగా నిధుల వినియోగం, కేంద్రానికి పంపించిన బిల్లుల తిరస్కరణ వంటి కారణాలతోనే నిధులు కోల్పోయినట్లు వెల్లడించారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉందని.. ఇలాంటి లోపాలు జరగకూడదని అధికారులను హెచ్చరించారు. అలాగే, ఖర్చులను నిశితంగా పర్యవేక్షించడం, బిల్లులను సకాలంలో సమర్పించడం తప్పనిసరని స్పష్టం చేశారు. ఇక నిధుల వినియోగంలో న్యాయ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖలు, ఉన్నత విద్య విభాగం ముందున్నాయి. జిల్లాల సంగతికి వస్తే అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాలు 99 శాతం నిధుల వినియోగంతో అన్నింటి కంటే ముందున్నాయి. ఇక అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, ఏలూరు జిల్లాలు నిధుల వినియోగంలో వెనుకబడ్డాయి. పెండింగ్‌లో ఉన్న నిధులలో అధిక భాగం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ప్రధాన మంత్రి పోషణ, అంగన్‌వాడీ సంబంధిత పథకాలకు చెందినవేనని ఏపీ ఆర్థికశాఖ కార్యదర్శి రొనాల్డ్ రాస్ తెలిపారు. మార్చి 2026 చివరి వారంలో సమర్పించిన రూ. 828 కోట్ల విలువైన బిల్లులు సాంకేతిక లోపాల కారణంగా, కేంద్ర మంత్రిత్వ శాఖలలో నిధుల కొరత వల్ల తిరస్కరించారని వివరించారు.

# విజయ్ టీమ్ లో ఎవరీ విష్ణురెడ్డి...

తిరుపతి : తమిళనాడు రాజకీయాల్లో తెలుగు వ్యక్తుల గురించి ఇటీవల సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. తమిళనాడు సీఎం విజయ్ మంత్రివర్గంలో శివకాశి ఎమ్మెల్యే కీర్తనకు అవకాశం దక్కటంపై పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. అలాగే ప్రమాణ స్వీకారానికి ముందు టీవీకే చీఫ్ విజయ్.. తమిళనాడు గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్‌ను కలిసిన ఫోటో కూడా సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అవుతోంది. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలంటూ విజయ్ గవర్నర్‌ను కోరేందుకు వెళ్లిన సమయంలో పలువురు విజయ్ వెంట ఉన్నారు. ఈ క్రమంలోనే అందులో ఉన్న విష్ణు రెడ్డి అనే వ్యక్తి ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారారు. ఎవరీ విష్ణు రెడ్డి.. సోషల్ మీడియాలో ఈ వ్యక్తిపై ఇటీవల విపరీతంగా చర్చ జరుగుతోంది. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఆహ్వానించాలంటూ టీవీకే అధినేత విజయ్.. గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్‌ను కలిసిన సమయంలో విష్ణు రెడ్డి అక్కడే ఉన్నారు. ఈ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ కావటంతో.. ఎవరీ విష్ణు రెడ్డి అనే చర్చ మొదలైంది. ఈ క్రమంలోనే ఈయన ఏపీకి చెందినవారని.. ఏపీ మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డికి సమీప బంధువు అవుతారని.. బావమరిది అవుతారంటూ వార్తలు వస్తున్నాయి. టీవీకే అధినేత విజయ్‌కు అత్యంత నమ్మకస్తుడు, సన్నిహితుడిగా పేరొందిన విష్ణువర్ధన్ రెడ్డి గురించి తమిళ మీడియాతో పాటు తెలుగు మీడియాలోనూ చర్చ జరుగుతోంది. ఈయన పేరు ఎర్రదొడ్డి విష్ణువర్ధన్ రెడ్డి. గ్రానైట్ క్వారీల వ్యాపారం చేస్తుంటారు. ఈయన స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా కలికిరి మండలం ఎర్రదొడ్డిపల్లె. పదిహేనేళ్లుగా గ్రానైట్ వ్యాపారం చేస్తున్న విష్ణు రెడ్డి.. చెన్నైలోనే స్థిరపడ్డారు. విష్ణువర్ధన్ రెడ్డి కుటుంబానికి పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్ ఉంది. ఈయన తండ్రి రామనారాయణరెడ్డి వైఎస్ ఎంపీపీగా గతంలో పనిచేశారు. అద్దవారిపల్లె సర్పంచ్, మహల్ ఎంపీటీసీ, కలికిరి మండలానికి వైస్ ఎంపీపీగానూ వ్యవహరించారు. మరోవైపు విష్ణు రెడ్డి.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి సమీప బంధువు కావటం విశేషం. విష్ణు రెడ్డి తల్లి, రామనారాయణ రెడ్డి భార్య.. కలికిరి మాజీ ఎంపీపీగా పనిచేసిన నల్లారి ఆనంద రెడ్డికి సోదరి అవుతారు. అలాగే నల్లారి ఆనంద రెడ్డికి, కిరణ్ కుమార్ రెడ్డి కుటుంబానికి బంధుత్వం ఉంది. కిరణ్ కుమార్ రెడ్డి సోదరిని ఆ కుటుంబంలోని వారికే ఇచ్చి పెళ్లి చేశారు. దీంతో కిరణ్ కుమార్ రెడ్డికి విష్ణువర్ధన్ రెడ్డికి బంధుత్వం ఏర్పడింది. కిరణ్ కుమార్ రెడ్డికి విష్ణు రెడ్డి వరుసగా బావమరిది అవుతారు. మరోవైపు టీవీకే చీఫ్ విజయ్‌కు విష్ణు రెడ్డి అత్యంత సన్నిహితుడని సమాచారం. టీవీకేకు వ్యూహకర్త ఆయనేనని.. సోషల్ మీడియా నిర్వహణ, ఆర్థిక వ్యవహారాల్లోనూ విజయ్ పార్టీకి అండగా ఉన్నారని తమిళ మీడియాలో చర్చ జరుగుతోంది. విజయ్ సినిమాల పర్యవేక్షణలోనూ విష్ణు రెడ్డి పాత్ర ఉంటుందంటూ ప్రచారం జరుగుతోంది.

## కరివేన గ్రామంలో శక్తి యాప్ అవేర్నెస్ ప్రోగ్రాం

నంద్యాల : ఆత్మకూరు ఒఖూ మనోహర్ తో కరివేన పంచాయతీ సెక్రెటరీ రాజశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణ నాయక్, శక్తీ టీమ్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ నూర్ అహమ్మద్, డబ్ల్యూ. హెచ్. జి సుప్రియ ఆధ్వర్యంలో ఆత్మకూరు పరిధిలోని కరివేన గ్రామంలో ఉపాధి హామీ పథకం లో భాగంగా జరుగుచున్న కరువు పనికి వచ్చిన మహిళలకు మరియు మగ వారికి “ శక్తీ యాప్ “ అవేర్నెస్ ప్రోగ్రాము లో భాగంగా మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన “ శక్తి యాప్ “ గురించి మరియు శక్తి యాప్ వాట్సాప్ నంబర్ 7993485111 గురించి తెలుపుతూ, మహిళల రక్షణకై ఏర్పాటు చేసిన పోక్సో చట్టం గురించి బాల్యవివాహాలు, చిన్న పిల్లలపై నేరాలు జరగకుండా ఆపుటకు 1098 ఫిర్యాదు చేయవలెనని, ఉమన్ వెల్ఫేర్ 181, ఎమర్జెన్సీ కాల్ 112, 100 కి ఫోన్ చేయవలెనని, సైబర్ క్రైమ్ జరిగినచో టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫోన్ చేయవలెనని, ఫేక్ కాల్స్,జీజూని ఫైల్స్ లాంటివి ఏదన్నా వాట్స్ అప్ లో పంపితే వాటిని ఓపెన్ చేయొద్దు అని తెలుపుతూ, వాటి ద్వారా వారికీ జేరిగే ఆర్థిక నష్టాల గురించి కూడా తెలిపి,వన్ స్టాప్ సెంటర్ యొక్క ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. అలాగే అవేర్నెస్ ప్రోగ్రాములో పాల్గొన్న అందరు వారి మొబైల్స్ నందు శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకొని, ఆపద సమయం లో ఎలా ఉపయోగించుకోవాలో తెలుపుతూ అవేర్నెస్ కలిపిస్తూ ప్రోగ్రాము చేయడం జరిగినది. అదేవిధంగా మీ, మీ ఇంట్లోని మగవారు వారి మోటార్ సైకిళ్లను నడిపేటప్పుడు ఖచ్చితంగా తలకు హెల్మెట్ పెట్టుకొని ప్రయాణం చేసే లాగా చెప్పమని చెప్తూ ఏదైనా అనుకోకుండా యాక్సిడెంట్లు జరిగితే తలకు దెబ్బలు తగలడం వల్లనే నూటికి 90 శాతం మంది చనిపోవడం జరుగుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరు కచ్చితంగా తలకు హెల్మెట్ ధరించమని తెలిపారు. అదేవిధంగా అక్కడికి వచ్చిన మగవారికి ఎవరు కూడా మద్యం తాగి వాహనాలు నడపవద్దని తెలుపుతూ అట్లా తాగి వాహనాలు నడిపితే 10 వేల రూపాయలు ఫైన్ లేదా

# జనసేనలో ఇంచార్జీల లొల్లి

గుంటూరు : జనసేన పార్టీకి కొత్త తలనొప్పి ప్రారంభం అయింది. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా 11 మందిని ఇన్చార్జులుగా నియమించారు పవన్ కళ్యాణ్. రాయలసీమతో పాటు ప్రకాశం,నెల్లూరు బాధ్యతలను బాలినేని శ్రీనివాస్ రెడ్డి తో పాటు మరో ఇద్దరు నేతలకు అప్పగించారు. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు వంటి వాటిపై పార్టీ క్యాడర్ అభిప్రాయాలు సేకరించాల్సిన పని ఈ కమిటీకి ఉంది. అందులో భాగంగా రాయలసీమ రీజియన్కు సంబంధించి సమావేశం నిర్వహించగా రచ్చకు దారితీసింది. పార్టీలో కీలక నాయకులుగా ఉన్న వారిని వ్యతిరేకిస్తూ.. కొందరు నాయకులు బహిరంగ విమర్శలు చేశారు. సమావేశం నిర్వహణను కూడా బహిష్కరించారు. దీంతో ఇప్పటివరకు జనసేన లో ఉన్న అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. పార్టీలో ప్రారంభం నుంచి ఉన్న నేతలకంటే పక్క పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం లభిస్తుందన్న టాక్ జనసేనలో ఉండి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన వారితోనే ఇటువంటివి జరుగుతున్నాయని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. అటువంటి వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వాస్తవంగా చెప్పాలంటే మాజీ మంత్రి బాలినేని వ్యతిరేకిస్తూ గళం విప్పారు ఎక్కువ మంది నేతలు. బాలినేని రాకను జనసేన లోని ప్రధాన వర్గం వ్యతిరేకిస్తూ వస్తోంది. ఈ క్రమంలో బాలినేని నియామకం, అదే నేత సమావేశం నిర్వహించడాన్ని ఆయన వ్యతిరేకులు తట్టుకోలేకపోయారు. ఇంకోవైపు ఇదే కమిటీ లో ఉన్న తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ హరిప్రసాద్ మధ్య కూడా విభేదాలు ఉన్నాయి. ఇదే సమావేశంలో ఒకరికొకరు తీవ్రస్థాయిలో విమర్శలు చేసుకున్నారు. ఈ పరిణామాలతో బాలినేని సహా అందరూ విస్తు పోయారు. అయితే ప్రధానంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి జనసేన లో చేరిన నేతలతోనే ఈ పరిస్థితి అని అర్థమవుతోంది. ఎందుకంటే బాలినేని సైతం వైసీపీ నుంచి వచ్చి జనసేనలో చేరారు. ఎన్నికల ముందు ఆరని శ్రీనివాసులు సైతం వైసీపీ నుంచి జనసేన లోకి వచ్చారు. అయితే పార్టీ ఆవిర్భావం నుంచి వచ్చిన నేతలకు ఎటువంటి ప్రాధాన్యం లేదు. దీంతో పార్టీలో విభేదాలు పతాక స్థాయికి చేరుకుంటున్నాయి. ఇలా అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన నెగ్గుకు రావడం మాత్రం కష్టం.

# పెరిగిన చికెన్, మటన్ ధరలు

కాకినాడ : మటన్ తో పోలిస్తే నాన్ వెజ్ ప్రియులు ఎక్కువగా చికెన్ ను తింటారు. డిమాండ్ కూడా ఎక్కువగానే ఉంటుంది. ఎందుకంటే.. ధరలు అందుబాటులో ఉంటాయన్న కారణంతో సామాన్యులు ఎక్కువగా చికెన్ ను కొనుగోలు చేసి తింటారు. అయితే.. ప్రస్తుత కాలంలో తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ఎండలు.. పెళ్లిళ్ల సీజన్.. సరఫరా తగ్గుదల.. వెరసి చికెన్ ధరలు భారీగా పెరిగాయి. రోజురోజుకూ చికెన్, మటన్ ధరలు పెరుగుతుండటంతో సామాన్యులు కొనాలా వద్దా అన్న పరిస్థితి నెలకొంది. వారం రోజుల నుంచి పరిశీలిస్తే చికెన్ (కోడి మాంసం) ధరలు అమాంతం 80 రూపాయల వరకు పెరిగింది. గతవారం కేజీ చికెన్ రూ.260 వరకు ఉండగా.. ప్రస్తుతం కిలో చికెన్ ధర రూ.360 పలుకుతోంది.
తాజా చికెన్ రేట్ల ప్రకారం.. ఫామ్ రేట్ లైవ్ బర్డ్ (కోడి కిలో) 170 నుంచి 180 ఉంది. డ్రెస్డ్ చికెన్ రూ.320 -330 వరకు అమ్ముతున్నారు. స్కిన్ లెస్ రూ.350 నుంచి రూ.360 వరకు విక్రయిస్తున్నారు. గుడ్లు డజన్ రూ.72 నుంచి 75 వరకు విక్రయిస్తున్నారు. చికెన్ రేట్లు భారీగా పెరగడంతో మాంసం ప్రియులు కోడి మాంసం కొనాలంటే జంకుతున్నారు. ప్రస్తుతం ధరలు మరింత పెరగడంతోపాటు జూన్ నెలాఖరు వరకు ఇలానే ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు. వేసవి తీవ్రత కారణంగా కోళ్ల మరణాలు పెరగడం, ఫారాల్లో ఉత్పత్తి తగ్గడం వల్ల మార్కెట్‌లో సరఫరా తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు పెళ్లిళ్లు, ఫంక్షన్లు, హోటళ్ల నుంచి డిమాండ్ పెరగడంతో ధరలు ఒక్కసారిగా పెరిగాయని చెబుతున్నారు.
మటన్ రేట్లు.. ఇదిలా ఉంటే.. మటన్ రేట్లు సైతం భారీగా పెరిగాయి.. మార్కెట్లలో కేజీ మటన్ 1100లకి పెరగగా.. బోన్ లెస్ మటన్ రూ.1300 ల వరకు చేరింది.

## గర్భిణీలకు పోషకాహారం అందించిన గోగులపాటి రాజు ఆదర్శనీయులు

అమరావతి : సృష్టిని సృష్టించనున్న గర్భిణీలకు పోషకాహారం అందించిన గోగులపాటి రాజు ఆదర్శనీయులని బలమైన పోషకాహారాన్ని రెండు సంవత్సరాలుగా పంపిణీ చేస్తున్న జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ సేవలు మరువలేమని తెలుగు రైతు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ,బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు అన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పెదకూరపాడు మండలం 75 తాళ్లూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గోగులపాటి రమాదేవి,రాజు దంపతుల సహకారంతో గర్భిణీలకు వారి సహాయకులకు భోజనంతోపాటు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈసందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అన్న సంకల్పంతో గర్భిణీలకు రెండు సంవత్సరాల నుండి పోషకాహారాన్ని అందిస్తున్న జన చైతన్య సమితి నిర్వాహకులు అభినందనీయులని అన్నారు. గర్భిణీలకు పౌష్టికాహారం అందించటానికి మంచి మనసుతో ముందుకు వచ్చిన గోగులపాటి రాజు కుటుంబ సభ్యులు ఆదర్శనీయులని అన్నారు.

# ఈ వారం వానలే.. గుడ్ న్యూస్ చెప్పిన వెదర్ మ్యాన్

విశాఖపట్టణం : ఏపీ ప్రజలకు బిగ్ రిలీఫ్.. రాష్ట్రంలో మరో వారం రోజుల్లో వర్షాలు కురవనున్నాయి. నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో మరో వారం రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. మరోవైపు రోజున పలు జిల్లాలలో పిడుగులతో కూడిన తేలికపాటి వానలు పడతాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. పిడుగులు పడే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వారం రోజులలో వర్షాలు కురవనున్నట్లు విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం వెల్లడించింది. వారం రోజుల్లో తేలికపాటి జల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. నైరుతి బంగాళాఖాతాన్ని ఆనుకొని శ్రీలంక పరిసరాల్లో అల్పపీడనం కొనసాగుతోందన్న విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు.. ఈ అల్పపీడనం మరికొన్ని గంటల్లో మరింత బలపడే అవకాశాలున్నాయని తెలిపారు. బంగాళాఖాతంలో అల్పపీడనానికి అనుబంధంగా.. 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని.. దీంతో వారం రోజుల్లో ఏపీలో వర్షాలు కురిసే అవకాశంఉందన్నారు. గడిచిన 24 గంటల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో అత్యధికంగా 3.24 సెం.మీ వర్షం కురిసినట్లు వెల్లడించారు. మరోవైపు ఉత్తర శ్రీలంక తీరము, నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం అదే ప్రాంతంలో కొనసాగుతోందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. దీని ప్రభావంతో మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లా , పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు ,కృష్ణా జిల్లా, ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు, బాపట్ల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. మరోవైపు అల్లూరి జిల్లా జికే వీధి,

## హీరోల బాటలో రకుల్ యూటర్న్.. మరో రమ్యకృష్ణ కానుందా?



ఒకప్పుడు హీరోలు తమ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకొని.. ఆ తర్వాత యూటర్న్ లో భాగంగా విలన్ గా ప్రేక్షకులను మెప్పిస్తున్న విషయం తెలిసిందే.. ఈ క్రమంలోనే గ్లామర్ బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్ తన కెరీర్‌లో అత్యంత సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. ఎప్పుడూ చిలిపి పాత్రలు, గ్లామరస్ రోల్స్‌తో అలరించే ఈ భామ, ఇప్పుడు ఏకంగా రామాయణంలో 'శూర్పణఖ'గా నెగటివ్ షేడ్ ఉన్న పాత్రలో కనిపించబోతోంది. నితేష్ తివారీ ప్రతిష్టాత్మక చిత్రంలో రకుల్ చేస్తున్న ఈ ప్రయోగం చూస్తుంటే, ఆమె మరో రమ్యకృష్ణలా పవర్‌ఫుల్ విలనిజం పండించబోతోందని ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. ఈ ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ విశేషాలు మీకోసం.. నితేష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఇండియన్ బిగ్గెస్ట్ మూవీ 'రామాయణ'లో రకుల్ ప్రీత్ సింగ్ ఎంట్రీ ఖరారైందనే వార్త ఫిల్మ్ నగర్‌లో సెన్సేషన్ సృష్టిస్తోంది. ఈ సినిమాలో రావణాసురుడి సోదరి శూర్పణఖ పాత్రను రకుల్ పోషించబోతుందట. ఎప్పుడూ కమర్షియల్ సినిమాల్లో మెరిసే రకుల్, కథను మలుపు తిప్పే ఇలాంటి క్లిష్టమైన పాత్రను ఎంచుకోవడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. గతంలో రమ్యకృష్ణ వంటి వారు నెగిటివ్ టచ్ ఉన్న పాత్రలు చేసి తమ నట విశ్వరూపాన్ని చూపించారు. ఇప్పుడు రకుల్ కూడా అదే బాటలో నడుస్తోంది. హీరోయిన్ అంటే కేవలం గ్లామర్ మాత్రమే కాదు, నటనకు ఆస్కారమున్న నెగటివ్ షేడ్స్ కూడా చేయగలనని ఆమె నిరూపించుకోవాలని చూస్తోంది. ఈ పాత్ర కనుక క్లిక్ అయితే, రకుల్ కెరీర్ గ్రాఫ్ పూర్తిగా మారిపోవడం ఖాయం. స్టార్ క్యాస్టింగ్ మధ్య శూర్పణఖ: ఈ సినిమాలో రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్నారు. కన్నడ రాకింగ్ స్టార్ యష్ రావణాసురుడిగా కనిపించబోతుండగా, ఆయనకు సోదరిగా రకుల్ తన పెర్ఫార్మెన్స్‌తో పోటీ పడనుంది. ఇక యష్, రకుల్ కాంబినేషన్ వెండితెరపై ఎలా ఉంటుందోనని అభిమానులు ఇప్పటి నుంచే ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు. శూర్పణఖ పాత్ర రామాయణంలో చాలా కీలకమైనది. ఒకరకంగా కథలో ఘర్షణ మొదలయ్యేది ఆమెతోనే. ఈ పాత్రలో రకుల్ సక్సెస్ అయితే, భవిష్యత్తులో ఆమె కోసం మరిన్ని వైవిధ్యమైన, నెగటివ్ షేడ్ ఉన్న పాత్రలు క్యూ కట్టడం గ్యారెంటీ. కేవలం అందంతోనే కాదు, తనలోని నటనతోనూ ఆడియన్స్‌ను భయపెట్టేందుకు రకుల్ సిద్ధమవుతోంది. స్టార్ హీరోయిన్ స్థాయి నుంచి గ్రే షేడ్ పాత్రకు యూటర్న్ తీసుకోవడం రకుల్ చేస్తున్న పెద్ద రిస్క్ అనే చెప్పాలి. కానీ, ఇలాంటి రిస్క్ తీసుకుంటేనే నటిగా గుర్తింపు వస్తుంది. మరి రామాయణంలో శూర్పణఖగా రకుల్ ఎంతవరకు మెప్పిస్తుందో చూడాలి.

## చెన్నైలో పెళ్లి చేసుకుంటానో లేదో తెలియదు..



టాలీవుడ్ యంగ్ బ్యూటీ శ్రీలీల మరోసారి తన పర్సనల్ లైఫ్ గురించి చేసిన కామెంట్స్ తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే కెరీర్, చదువు, వ్యక్తిత్వంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ యంగ్ హీరోయిన్ తాజాగా చెన్నైలో జరిగిన ఓ ఈవెంట్‌లో పెళ్లిపై చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా పెళ్లి గురించి శ్రీలీల చేసిన కామెంట్స్ ఫ్యాన్స్ లో కొత్త చర్చకు దారి తీశాయి. ప్రస్తుతం టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు నటీనటుల పెళ్లిళ్లు వరుసగా జరుగుతున్న నేపథ్యంలో శ్రీలీల వ్యాఖ్యలు మరింత ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. చెన్నైలోని అమృత ఏవియేషన్ కాలేజ్ ఈవెంట్ కు హాజరైన శ్రీలీల స్టూడెంట్స్ తో సరదాగా ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమెకు కోలీవుడ్ ఫ్యాన్స్ నుంచి మంచి రెస్పాన్స్ లభించింది. కాలేజ్ లోని స్టూడెంట్స్ శ్రీలీలను లేడీ సూపర్ స్టార్ అంటూ పిలవగా దానికి ఆమె వెంటనే రియాక్ట్ అవుతూ, ఆ ట్యాగ్‌కు అసలైన అర్హురాలు నయనతార అని చెప్పారు. నయనతార తనకు ఎంతో ఇష్టమైన నటి అని, ఆమె కెరీర్, వ్యక్తిత్వం తనకు ఇన్స్పిరేషన్ అని వెల్లడించారు. అదే సమయంలో చెన్నై గురించి మాట్లాడిన శ్రీలీల అక్కడి ప్రజల ప్రేమ, ముఖ్యంగా చెన్నై దోశ తనకు చాలా ఇష్టమని చెప్పారు. ఈ క్రమంలోనే నయనతార లాగానే తాను కూడా చెన్నైలో పెళ్లి చేసుకుంటానా లేదా అనేది మాత్రం తనకు తెలియదంటూ నవ్వుతూ చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే శ్రీలీల చేసిన ఈ కామెంట్స్‌ను నెటిజన్లు తమదైన రీతిలో విశ్లేషిస్తున్నారు. కొందరు ఆమె సరదాగా మాట్లాడిందని భావిస్తుండగా, మరికొందరు మాత్రం ఈ కామెంట్స్ వెనుక ఏదైనా స్పెషల్ రీజన్ ఉందా అంటూ డిస్కస్ చేసుకుంటున్నారు. శ్రీలీల కామెంట్స్ విన్న తర్వాత తమిళనాడుకు కోడలిగా వెళ్లబోతుందా?, చెన్నై వ్యక్తితో లవ్ లో ఉందా లాంటి కామెంట్స్ సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. అయితే ఇప్పటి వరకు శ్రీలీల తన పర్సనల్ లైఫ్ పై స్పందించిన సందర్భాలు తక్కువ. గతంలో కూడా ఆమె పెళ్లి, రిలేషన్‌షిప్‌పై పలు రూమర్స్ వచ్చినప్పటికీ వాటిని ఆమె ఖండించారు. ఇక కెరీర్ విషయానికి వస్తే శ్రీలీల వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. టాలీవుడ్‌లో స్టార్ హీరోల సరసన నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె ఇప్పుడు కోలీవుడ్, బాలీవుడ్ వైపు కూడా అడుగులు వేస్తున్నారు. ఒకవైపు సినిమాలు చేస్తూనే మరోవైపు ఎంబీబీఎస్ పూర్తి చేసి డాక్టర్ పట్టా అందుకోవడం ఆమె పట్టుదలకు నిదర్శనంగా నిలిచింది. ప్రస్తుతం గ్లామర్ పాత్రలకంటే కథలో ప్రాధాన్యం ఉన్న సినిమాలపై దృష్టి పెడుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో చెన్నైలో పెళ్లి గురించి చేసిన సరదా వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారాయి.

## వెడ్డింగ్ గ్లామర్‌లో మెహ్రీన్.. ఖరీదైన లుక్ నెట్‌లో వైరల్

టాలీవుడ్ ప్రేక్షకులకు 'హనీ ఈజ్ బెస్ట్' అంటూ దగ్గరైన మెహ్రీన్ పిర్జాదా, ఇప్పుడు రియల్ లైఫ్ ప్రిన్సెస్ లా మెరిసిపోతోంది. ఇటీవల అర్ష్ ఔలఖ్‌ను పెళ్లాడిన ఈ ముద్దుగుమ్మ, తాజాగా తన వివాహ వేడుకకు సంబంధించిన మరికొన్ని అద్భుతమైన ఫోటోలను షేర్ చేసింది. అందులో ఆమె ధరించిన వెరైటీ వెడ్డింగ్ డ్రెస్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయింది. అసలు ఆ డ్రెస్ స్పెషాలిటీ ఏంటో, ఆ వేడుక విశేషాలేంటో మీ కోసం.. మెహ్రీన్ తన వివాహ వేడుక తర్వాత జరిగిన గ్రాండ్ పార్టీ ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తూ "నక్షత్రాల్లో రాసిపెట్టిన రాత్రి" అంటూ క్యాప్షన్ ఇచ్చింది. తన భర్త అర్ష్‌తో కలిసి దిగిన ఈ ఫోటోల్లో మెహ్రీన్ చందమామలా మెరిసిపోతోంది. హిమాచల్ ప్రదేశ్‌లోని అందమైన లొకేషన్లలో ఏప్రిల్ 26న వీరి వివాహం అత్యంత వైభవంగా జరిగింది. మెరిసిన హనీ పాప: మెహ్రీన్ ధరించిన ఈ డ్రెస్ ఇప్పుడు అందరినీ ఆకర్షిస్తోంది. ఇది ఒక పాకిస్థానీ డిజైనర్ 'షెహ్లా చటూర్' రూపొందించిన కస్టమ్ మేడ్ కౌచర్. షాంపేన్ కలర్ లో ఉన్న ఈ లెహంగా మీద చాలా రిచ్ గా ఎంబ్రాయిడరీ చేశారు. పైన చిన్న జాకెట్ లాంటి కేప్, దానికి మ్యాచింగ్‌గా ఉన్న లెహంగా ఆమెకు ఒక రాకుమారి లుక్‌ని ఇచ్చింది. ఈ డ్రెస్ డిజైన్ కోసం ప్రత్యేకంగా హ్యాండ్ ఎంబ్రాయిడరీ చేయించారట. నాని సినిమా 'కృష్ణగాడి వీరప్రేమ గాథ'తో ఎంట్రీ ఇచ్చిన మెహ్రీన్, అతి తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్ అయిపోయింది. మహానుభావుడు, రాజా ది గ్రేట్, ఎఫ్ 2 సినిమాల్లో ఆమె నటనకు ఫిదా అవ్వని వారు ఉండరు. ముఖ్యంగా 'హనీ ఈజ్ బెస్ట్' అనే డైలాగ్ ఇప్పటికీ ఫేమస్. సినిమాల్లో గ్లామరస్‌గా కనిపించిన ఈ ముద్దుగుమ్మ, ఇప్పుడు పెళ్ళికూతురిగా మరింత కొత్త అందాన్ని సంతరించుకుంది. పెళ్లి తర్వాత మెహ్రీన్ షేర్ చేసిన పిక్స్ నిమిషాల్లోనే ఇంటర్నెట్‌ను చుట్టేశాయి. తన భర్తతో కలిసి ఉన్న రొమాంటిక్ అండ్ క్లాసిక్ ఫోటోలు చూసి ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. "సో బ్యూటిఫుల్ హనీ" అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఈ ఫోటోలలో మెహ్రీన్ ధరించిన నగలు, ఆ మేకప్ అంతా ఒక పర్ఫెక్ట్ రాయల్ వెడ్డింగ్‌ను గుర్తుచేస్తున్నాయి. మెహ్రీన్ పిర్జాదా కొత్త జీవితం నూతన వెలుగులతో నిండాలని ఆమె అభిమానులు కోరుకుంటున్నారు. సినిమాల్లో తన నటనతో అలరించిన హనీ పాప, ఇప్పుడు గృహిణిగా కూడా తన స్టైల్ అండ్ గ్రేస్‌ను కొనసాగిస్తోంది. ఇక ఈ పెళ్లి ఫోటోలు చూస్తుంటే, మెహ్రీన్ తన జీవితంలోని అత్యంత అందమైన క్షణాలను ఎంజాయ్ చేస్తోందని అర్థమవుతోంది.



## ఎలిగెంట్ శారీ స్టైల్‌లో కయాదు లోహర్.. ఫ్యాన్స్ ఫిదా!

టాలీవుడ్ అందాల సుందరి కయాదు లోహర్. 'అల్లూరి' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఈ భామ, తాజాగా తన లేటెస్ట్ ఫోటోషూట్‌తో నెట్టింట సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. మేకప్ లేకుండానే మెరిసిపోయే చర్మకాంతి, సింపుల్ సారీ లుక్‌లో ఆమె కనిపిస్తున్న తీరు చూసి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. నిండుగా ఉన్న చీరకట్టులో తెలుగు పడుచులా మెరిసిపోతున్న ఈ ముద్దుగుమ్మ ఫ్యాషన్ విశేషాలు ఇప్పుడు చూద్దాం. రాయల్ లుక్.. 'రాద్' బ్రాండ్ శారీ: ఈ ఫోటోషూట్‌లో కయాదు లోహర్ ఎంచుకున్న శారీ స్టైల్ చాలా క్లాసీగా ఉంది. 'రాద్' బ్రాండ్‌కు చెందిన ఫ్లోరల్ ప్యాటర్న్ డిజైన్ ఉన్న డ్రేప్‌లో ఆమె ఎంతో ఎలిగెంట్‌గా కనిపిస్తోంది. సోబర్ కలర్స్, మినిమలిస్ట్ టచ్ ఇష్టపడే కయాదు, ఈ చీరలో తన నేచురల్ అందాన్ని మరింత ఎలివేట్ చేసుకుంది. ఇక సింపుల్‌గా ఉన్నా కూడా ఆ లుక్ మాత్రం ఒక రాయల్ వైబ్‌ను ఇస్తోంది. ఈ శారీకి కాంబినేషన్‌గా ఆమె వేసుకున్న డీప్ మెరూన్ (బర్గండీ) కలర్ బ్లౌజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రష్మిత థాపా డిజైన్ చేసిన ఈ కస్టమ్ మేడ్ బ్లౌజ్‌కు ముందు భాగంలో 'కీహోల్ కటౌట్' స్టైల్ ఇచ్చారు. ఇక చేతులపై ఉన్న ఎంబ్రాయిడరీ వర్క్ చాలా క్లియర్ గా, అందంగా కనిపిస్తోంది. ఇక జ్యువెలరీ విషయానికి వస్తే.. 'ద జ్యువెలరీ గ్యాలరీ' నుంచి సేకరించిన ఆభరణాలతో ఆమె లుక్ కంప్లీట్ అయ్యింది. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా స్వయంకృషితో పైకి వచ్చిన కయాదు, కన్నడ మరియు మలయాళంలో మంచి హిట్స్ అందుకుంది. తెలుగులో 'అల్లూరి' సినిమా కోసం డైలాగులు నేర్చుకుని మరీ ప్రాణం పోసింది. ఇక గతేడాది 'డ్రాగన్' మూవీతో బాక్సాఫీస్ వద్ద సక్సెస్ అందుకున్న ఈ భామ, 2026లో 'పావళ మల్లి' అనే ఆసక్తికరమైన చిత్రంతో మన ముందుకు రాబోతోంది. కయాదు లోహర్ నటి కావాలనే కోరిక వెనుక ఆమె కుటుంబం ప్రోత్సాహం ఎంతో ఉంది. తల్లి కన్న కలనే తన లక్ష్యంగా మార్చుకుని మోడలింగ్‌లో రాణించి, ఆ తర్వాత వెండితెరపై అడుగుపెట్టింది. ఇక మేకప్ లేకుండా, ఫిల్టర్లు వాడకుండా సహజంగా కనిపించడమే అసలైన అందమని నమ్మే కయాదు, అందుకే కుర్రకారుకు ఫేవరెట్ హీరోయిన్‌గా మారిపోయింది. ఎప్పుడూ ట్రెండీగా, మోడ్రన్ గా కనిపించే హీరోయిన్ల మధ్య.. ఇలా సంప్రదాయబద్ధమైన చీరకట్టులో కయాదు లోహర్ కనిపించడం నిజంగా రిఫ్రెషింగ్ గా ఉంది. ఆమె నటన, అందం చూస్తుంటే రాబోయే రోజుల్లో టాలీవుడ్‌లో ఈ పుణె సుందరి మరిన్ని వండర్స్ క్రియేట్ చేయడం ఖాయం. 'పావళ మల్లి' మూవీతో ఆమె మళ్ళీ ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి.





## బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు..

# బాల్య వివాహం చట్ట విరుద్ధం..

### చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ గణేష్.. ఐసిడిఎస్ సూపర్వైజర్ రజిత..




గజ్వేల్ :13 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు బాల్య వివాహాన్ని అడ్డుకొని నిలిపివేసిన సంఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అక్కారం గ్రామం లో చోటుచేసుకుంది.మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులకు అందిన సమాచారం మేరకు అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని బాల్య వివాహాన్ని అడ్డుకొని నిలిపివేశారు. బాల్య వివాహం వల్ల కలిగే చట్టపరమైన మరియు సామాజిక సమస్యలపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండని బాలికలకు మరియు 21 సంవత్సరాలు నిండని బాలురకు వివాహం జరపడం చట్ట విరుద్ధమని తెలిపారు. బాలల భవిష్యత్తు,విద్య మరియు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలను అరికట్టేందుకు సహకరించాలని కోరారు. అలాగే బాలలపై ఎలాంటి సమస్యలు తెలిసినా వెంటనే 1098 చైల్డ్ హెల్ప్ లైన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.



## బండి సంజయ్ కుమారుడిపై

# లుక్ అవుట్ నోటీసులు జారీ చేయాలి

### - తెలంగాణకు మోదీ మరోసారి మొండిచేయి
### - పాలమూరు-రంగారెడ్డి జాతీయ హోదాపై సీఎం, - బీఆర్ఎస్ మౌనం ఎందుకు?
### - తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ డిమాండ్ -కల్వకుంట్ల కవిత

హైదరాబాద్: మే 13: ప్రజాకలం ప్రతినిధి

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడి పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో పోలీసులు తక్షణమే స్పందించి, ఆయన విదేశాలకు పారిపోకుండా లుక్ అవుట్ నోటీసులు జారీ చేయాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు, నిందితులకు అండగా నిలవడం బీజేపీకి అలవాటుగా మారిందని, ప్రజ్వల్ రేవణ్ణ ఉదంతమే దీనికి నిదర్శనమని ధ్వజమెత్తారు. బాధితురాలికి న్యాయం జరగాలని, సోషల్ మీడియాలో బాధితురాలి ఫోటోలు లీక్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రం పై కేంద్రం వివక్ష

ప్రధాని నరేంద్ర మోదీ తన పర్యటనలో తెలంగాణకు మరోసారి మొండిచేయి చూపారని కవిత మండిపడ్డారు. పొరుగు రాష్ట్రం ఆంధ్రాకు నిధులు ప్రకటించి,తెలంగాణకు మాత్రం కేవలం పొదుపు సూత్రాలు చెప్పి వెళ్లారని విమర్శించారు.పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇస్తారని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు.దేశంలోని 16 రాష్ట్రాల ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇచ్చిన కేంద్రం, తెలంగాణపై ఎందుకు వివక్ష చూపుతోందని ప్రశ్నించారు. ఈ విషయంలో అటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదని,ఇటు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మౌనంగా ఉండటం శోచనీయ మని అన్నారు.

**అధికారంలోకి వస్తే వాటర్ కమిషన్**

తెలంగాణలో సాగు యోగ్యమైన ప్రతి గుంట భూమికి నీరు అందించడమే తమ లక్ష్యమని కవిత స్పష్టం చేశారు.మేము అధికారంలోకి రాగానే రాష్ట్రంలో వాటర్ కమిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి మూడు వేల ఎకరాలకు ఒక లష్కర్‌ను నియమించి నీటి నిర్వహణను క్రమబద్ధీకరిస్తామని వివరించారు.నదులపై వందేళ్ల పాటు చెక్కుచెదరని విధంగా గేట్లతో కూడిన చెక్ డ్యామ్‌లను నిర్మిస్తామని వెల్లడించారు.

**పోరాటం ఆగదు**

బీసీలకు చట్టసభలు, విద్య, ఉద్యోగాల్లో 42 నుంచి 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం తమ పోరాటం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు. కామారెడ్డిలో గతంలో నిర్వహించిన రైల్ రోకో కేసుకు సంబంధించి ఆమె నాంపల్లి రైల్వే కోర్టుకు వ్యక్తిగతంగా హాజరయ్యారు. కేసులకు భయపడే ప్రసక్తే లేదని, ఈ నెల 20 నుంచి నిర్వహించే జెండా పండుగ ద్వారా పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేస్తామని ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై స్పందిస్తూ.. విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రం ఆడుకుంటోందని తీవ్రస్థాయిలో విమర్శించారు.

# మోడీ గ్రేటర్ వ్యూహం



హైదరాబాద్ : తెలంగాణలో పర్యటించారు ప్రధాని నరేంద్ర మోడీ. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో దాదాపు పదివేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పరేడ్ గ్రౌండ్స్ లో భారీ బహిరంగ సభ జరిగింది. అదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డితో సైతం సన్నిహితంగా మెలిగారు ప్రధాని. ఒక విధంగా చెప్పాలంటే పక్క పొలిటికల్ వ్యూహంతోనే సాగింది నరేంద్ర మోడీ పర్యటన. అయితే మరోవైపు హైదరాబాదులో ఉంటున్న ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులతో గడిపారు మోదీ. అయితే దీని వెనుక గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ ఎన్నికల వ్యూహం ఉన్నట్టు అర్థం అవుతోంది. ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనలను గమనిస్తే ఒక వ్యూహం ప్రకారమే సాగుతుంటాయి. ఇప్పుడు చంద్రబాబుతో పాటు పవన్ విషయంలో కూడా ప్రధాని ఆలోచన అదేనని ఒక టాక్ నడుస్తోందిమరి కొద్ది రోజుల్లో గ్రేటర్ ఎన్నికలు జరగనున్నాయి. భారతీయ జనతా పార్టీ వీటిని ఒక సెమీఫైనల్స్ గా భావిస్తున్నాయి. అందుకే ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. గత ఎన్నికల్లో సైతం ఇక్కడ మంచి ఫలితాలు సాధించింది.. అందుకే ఈసారి మేయర్ పీఠం సాధించడం ద్వారా తెలంగాణలో తామే ప్రత్యామ్నాయం అన్నట్టు సంకేతాలు పంపాలని చూస్తోంది. ఈ క్రమంలోనే ప్రధాని మోదీ స్వయంగా రంగంలోకి దిగారు. చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ ఇళ్లకు వెళ్లి.. టిడిపి తో పాటు జనసేన మద్దతును పరోక్షంగా పొందినట్టు అర్థం అవుతోంది.గ్రేటర్ పరిధిలో టిడిపికి క్యాడర్ ఉంది. ఒక బలమైన సామాజిక వర్గం దన్ను ఉంది. ఆ రెండింటిని తిప్పుకుంటే బీజేపీకి ఇక్కడ ప్లస్ పాయింట్ అవుతుంది. పైగా పవన్ కళ్యాణ్ ఇమేజ్ కూడా గ్రేటర్ పరిధిలో ఎక్కువ. ఏపీలో ప్రధాన భాగస్వామ్య పక్షాలుగా ఉండడంతో సెటిలర్స్ తప్పకుండా బిజెపి వైపు మొగ్గు చూపుతారని అంచనాలు ఉన్నాయి. అయితే ఆ ఇద్దరు నేతలను కలవడం ద్వారా సరికొత్త సంకేతాలను పంపించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి పోటీకి దూరంగా ఉండిపోయింది. అది అంతిమంగా కాంగ్రెస్ పార్టీకి లాభం చేకూర్చిందని విశ్లేషణలు ఉన్నాయి. ఒకవేళ గ్రేటర్ ఎన్నికల పరిధిలో టిడిపి ఓటు బ్యాంకును బిజెపి వైపు మళ్లించగలిగితే.. భారతీయ జనతా పార్టీ గెలుపు నల్లేరు మీద నడక కానుంది. ఆ ఉద్దేశంతోనే చంద్రబాబు ఇంటికి వెళ్లిన మోడీ గంటా పది నిమిషాల పాటు ఆయన కుటుంబ సభ్యులతో గడిపారు.పవన్ కళ్యాణ్ బిజెపికి సానుకూలంగా ఉంటారు.

# మత కల్లోలాల వ్యూహం

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఒకే రకమైన చిత్రం కనిపిస్తోంది.. ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కడప వరకు, మత కల్లోలాల వెనుక దాగి ఉంది ఒక వ్యూహాత్మక రాజకీయం. ఇది కేవలం సంఘటనల పాట కాదు, దేశ సమగ్రతపై చేయబడే దాడి. ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్‌లో రాణాప్రతాప్ జయంతి సందర్భంగా అల్లర్లు, ఆంధ్రప్రదేశ్‌లో టిప్పు సుల్తాన్ జయంతి పేరుతో పార్టీల పోటీ పడుతున్నాయి. కశ్మీర్, మణిపూర్‌లలో అల్లర్లు పెద్ద ప్రాధాన్యత పొందకపోవడం వల్ల, రాజకీయ నేతలు ఇప్పుడు ఉత్తర, దక్షిణ భారతదేశంలోని ప్రాంతాలపై దృష్టి సారించారు. ఉద్రిక్తతలను పెంచేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు, మరియు ఒక వర్గం ఈ ప్రయత్నాలకు మద్దతు ఇస్తోంది. హాపూర్‌లో ధౌలానా ఏరియాలో రాణాప్రతాప్ జయంతి ర్యాలీని భగ్నం చేయడానికి ప్రయత్నం జరిగింది. అక్బర్ సైనికాధికారితో యుద్ధం చేసిన రాణాప్రతాప్ జయంతిని కొందరు వ్యతిరేకించారు. యోగి ప్రభుత్వం వెంటనే చర్య తీసుకోవడం గమనించదగినది. రాళ్లు రువ్వినవారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో చిత్రం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. వైసీపీ, టీడీపీ టిప్పు సుల్తాన్ జయంతి విషయమై పోటీ పడుతున్నాయి. ప్రొద్దుటూరులో వైసీపీ ఎమ్మెల్యే టిప్పు సుల్తాన్ సర్కిల్ ఏర్పాటు చేశాడు, కడపలో గత వైసీపీ మేయర్ టిప్పు సుల్తాన్ విగ్రహం ఏర్పాటుకు తీర్మానం చేశారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో విగ్రహం ఏర్పాటు చేయిస్తానని వాగ్దానం చేశారు.అల్మాస్‌గూడ ఏరియాకు టిప్పు సర్కిల్ అని పేరుపెట్టడానికి ప్రయత్నించినప్పుడు, హిందువులు దానిని హనుమాన్ సర్కిల్‌గా మార్చారు. దీంతో ముస్లింలు రోడ్లపైకి వచ్చి దాడి చేశారు, పోలీసులు గాయపడ్డారు, లాఠీచార్జి జరిగింది. జిల్లా యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా నిర్ణయం తీసుకుంది, శాంతి కమిటీ మీటింగ్‌లో గొడవ ఆపే ప్రయత్నం చేశారు, కానీ సమస్య పరిష్కరించలేదు.గుంటూరులో మహ్మద్ జిన్నా టవర్ విషంలో గొడవ జరిగింది. హిందువులు ఆగ్రహించడంతో టవర్‌కు జాతీయ జెండా రంగులు వేశారు. జాతీయ జెండా ఎగురవేయడం మొదలైంది. హిందువులు తలుచుకుంటే ఇలా మార్పు వస్తుంది. ఇది కేవలం మాట కాదు, నిజం.

కానీ ప్రశ్న ఎక్కువ ముఖ్యమైనది: హిందువుల్లో పెరుగుతున్న అసంతృప్తి, కోపాన్ని రాజకీయ నేతలు గుర్తించకపోతే ఇబ్బందులు తప్పవు.టీడీపీ, వైసీపీ బెంగాల్ అస్సాంల నుంచి గుణపాఠం నేర్చుకోవాలి. ఈ రాష్ట్రాల్లో మత కల్లోలాల ఫలితాలు ఏమిటో చరిత్ర చెబుతోంది. మత రాజకీయాల్లో లాభం లేదు, కేవలం దేశ విభజనే ఉంది.మత కల్లోలాల వెనుక ఉన్నది కేవలం ముస్లిం ఓట్ల కోసం రాజకీయం మాత్రమే.




# గోవులను రక్షించేందుకు చెక్ పోస్ట్ ల ఏర్పాటు.

**-బక్రీద్ పండుగ సందర్భంగా గోవుల అక్రమ రవాణా, చెక్‌పోస్టుల నిర్వహణపై జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ.**

**-ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి.**



సంగారెడ్డి ప్రతినిధి మే 13 (ప్రజా కలం):

సంగారెడ్డి జిల్లాలో పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సమన్వయంతో విధులు నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఐఏఎస్, ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ, గోవుల అక్రమ రవాణా నివారణ, ధాన్యం కొనుగోలు, ధాన్యం అక్రమ రవాణా నియంత్రణ వంటి అంశాలపై జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు తెలిపారు. బక్రీద్ పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు పోలీస్ శాఖ ఇతర శాఖలతో పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో పశువుల అక్రమ రవాణా నివారణ కోసం జిల్లా వ్యాప్తంగా 9 చెక్‌పోస్టులను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. చెక్‌పోస్టు సిబ్బంది తగు జాగ్రత్తలు పాటిస్తూ.., జిల్లాలోకి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. జిల్లా మీదుగా ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా అధికారులు, సిబ్బంది 24ॽ7 అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. బక్రీద్ సందర్భంగా ఎలాంటి పశువుల అక్రమ రవాణా జరగడానికి వీలులేదని, అదే విధంగా బక్రీద్ సందర్భంగా వ్యర్థాలను నిర్ణీత ప్రదేశాల్లోని గుంతల్లో మాత్రమే వేయాలని, పరిశుభ్రతకు భంగం కలగకుండా చూడాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, పోలీస్ శాఖ తరఫున అన్ని రకాల భద్రతా ఏర్పాట్లకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అవసరాన్ని బట్టి రవాణా వాహనాలు అందుబాటులో ఉండేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ధాన్యాన్ని ఇతర కారణాలచేత తెలంగాణ రాష్ట్రంలో విక్రయించకుండా చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టమైన తనిఖీలు చేపట్టినట్లు ఎస్పీ తెలియజేశారు. పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో విధులు నిర్వహిస్తూ శాంతిభద్రతలు, రైతుల ప్రయోజనాలు కాపాడేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు.



**నవ సమాజ నిర్మాణంలో**

# ఉన్నత విద్యాసంస్థల పాత్ర కీలకం.

**- కళాశాల ప్రిన్సిపాల్ ఎం. ప్రవీణ.**

సంగారెడ్డి ప్రతినిధి మే 13( ప్రజా కలం):

తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డిలో ప్రజా పాలనబి ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవాలను మూడవరోజు ప్రతిభగల విద్యార్థులకు, అధ్యాపకులకు, కళాశాలకు సి ఎస్ ఆర్ నిధులను సమకూర్చిన సంస్థల ప్రతినిధులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం ప్రవీణ తెలిపినారు. తారా ప్రభుత్వ కళాశాల లోని 36 మంది విద్యార్థినులకు అజీమ్ ప్రేమ్జీ ఫౌండేషన్ తరపున ప్రతి ఒక్కరికి 30 వేల రూపాయల చొప్పున స్కాలర్షిప్ లభించిందని, ఈ స్కాలర్షిప్ ఐదు సంవత్సరాల పాటు సంబంధిత విద్యార్థులకు అందించడం జరుగుతుందని తెలిపినారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సంగారెడ్డిలోని అజీమ్ ప్రేమ్జీ ఫౌండేషన్ ప్రతినిధులను సన్మానించడం జరిగిందని తెలిపారు. అదే విధంగా కళాశాలలో ఆచార్యులుగా పదోన్నతి పొందిన ప్రొఫెసర్ మహంతయ్య, ప్రొఫెసర్ శ్రీనివాస్, ప్రొఫెసర్ విజయ లను సన్మానించడం జరిగిందని తెలిపినారు. అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ సంగారెడ్డి ప్రతినిధి కృష్ణ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ పేద బాలికలకు ఉన్నత విద్యాభ్యాసాన్ని అందించడానికి ఈ స్కాలర్షిప్ సదుపాయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఇది సి ఎస్ ఆర్ నిధులతో కొనసాగుతుందని, భవిష్యత్తులో ఈ సదుపాయాన్ని ఇంకా ఎక్కువ మంది విద్యార్థులకు అందేటట్లుగా చేస్తామని, నవ సమాజ నిర్మాణంలో ఉన్నత విద్యాసంస్థల పాత్ర ఎంతైనా ఉందని తెలిపినారు. ఉన్నత విద్యాసంస్థలలో విద్య నాణ్యమైనదిగా ఉంటే సమాజ నిర్మాణము సక్రమంగా జరుగుతుందని తెలిపినారు. అనంతరము కళాశాల నుండి ఎన్ఎస్ఎస్ తరపున ఒరిస్సాలోని గౌహతిలో జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో మరియు త్రివేండ్రము, కర్ణాటకలో జరిగిన అంతరాష్ట్ర శిబిరాలలో పాల్గొన్న విద్యార్థులు అవని సహస్ర కులకర్ణి మరియు సిహెచ్ రాకేష్ లను సన్మానించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ నిర్మల, డాక్టర్ జగదీశ్వర్, ఎన్ఎస్ఎస్ అధికారులు, కళాశాల వివిధ విభాగ అధిపతులు ,అధ్యాపక బృందము అజీమ్ ప్రేమ్జీ ఫౌండేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




**చందన మంత్రాల చెరువు,పెద్ద చెరువుల లోని**

# గుర్రం టెక్కను వెంటనే తొలగించాలి

**మీర్పేట్ బిఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి**



మహేశ్వరం, మే 13,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోనీ చందనం చెరువు, మంత్రాల చెరువు,పెద్ద చెరువును మీర్పేట్ బిఆర్ఎస్ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులతో కలిసి బుధవారం ఉదయం చెరువులను సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాజీమంత్రి మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి ఆదేశనుసారాల మేరకు చెరువుల సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. చెరువులో విస్తరించిన గుర్రం టెక్క,చెత్త చెదారంతో పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయని దీనివల్ల దోమలు క్రిమి కీటకాలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో చెరువులను సుందరీకరణ కార్యక్రమాల నిర్వహించి ప్రజలకు హాలదకర వాతావరణ ఏర్పాటు చేశారనీ గుర్తుచేశారు. ప్రస్తుతం ఈ ప్రభుత్వ మాత్రం చెరువులను విస్మరించి ప్రజల ఆరోగ్యాలతో, ప్రాణాలతో చెలగాటమాడుతురనడానికి ఈ చెరువులే నిదర్శనం అన్నారు. చెరువులలో గుర్రం టెక్క, చెత్త చెదారం పేరుకుపోయి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం వెంటనే స్పందించి చెరువులను వారం 10 రోజులలో గుర్రం టెక్క, చెత్త చెదారం నివారణకు చర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్యాలని, ప్రాణాలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులంతా కలిసి పెద్ద మొత్తంలో ధర్నా నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బుపేష్ గౌడ్ ,అనిల్ కుమార్ యాదవ్, సిద్ధాల బీరప్ప,సునీతబాలరాజ్,మాధవి ,బిందు ,లక్ష్మణ్ ,సంతోష్ ,యాదగిరి రెడ్డి, రవీందర్ రెడ్డి, చారి, రజాక్ బాయ్, సిద్ధల భారత్, దయానంద్, జగాల్ రెడ్డి,శాంతమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**కాళేశ్వరం బ్యారేజీలను కె ఎల్ ఆర్ పరిశీలన**

# కొనసాగుతున్న మట్టి నమూనా పరీక్షలు

**సాగునీటి అధికారులతో ప్రత్యేక భేటీ అయినా**

**కె ఎల్ ఆర్ ఇండస్ట్రీస్ అధినేత, సాంకేతిక నిపుణులు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి**



మహేశ్వరం, మే 13,(ప్రజా కలం)

కూలిన మేడిగడ్డ బ్యారేజీ పనులు సహా లీకేజీ అవుతున్న సుందిళ్ల, అన్నారం బ్యారేజీ పనులను కె ఎల్ ఆర్ ఇండస్ట్రీస్ అధినేత, సాంకేతిక నిపుణులు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు గత కొద్ది రోజులుగా కాళేశ్వరం అనుసంధాన బ్యారేజీ పనులు, మట్టి పరీక్షలు కె ఎల్ ఆర్ నిర్వహిస్తున్నారు.

గతంలో చేసిన బ్యారేజీ నిర్మాణ పనులను, మట్టి పరీక్షల్లో ఇసుక, బొగ్గు రావటాన్ని సీఈ, డీఈ సహా ఇతర ఉన్నతాధికారులు, సాంకేతిక నిపుణులు కిచ్చెన్నగారి దృష్టికి తెచ్చారు. దేశ వ్యాప్తంగా ఉన్న ఇరిగేషన్ సాంకేతిక నిపుణులు, జీయాలజిస్టులను రప్పించి సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలకు మరమ్మతులు చేద్దామని లక్ష్మారెడ్డి భరోసా ఇచ్చారు.భూగర్భ మట్టి పరీక్షలు, నాణ్యతను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల ప్రజాధనం వృధా అయిందని కె.ఎల్.ఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి మళ్లీ బ్యారేజీలను పునరుద్ధరించాలని కృతనిశ్చయంతో ఉన్నారని కిచ్చెన్నగారు తెలిపారు.

# ఉచిత క్రికెట్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

**-యువత డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి**

**-క్రీడలు మానసిక ఉల్లాసానిస్తాయి -గజ్వేల్ సీఐ రవికుమార్**

గజ్వేల్: 13మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

క్రీడలు శారీరక,మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, క్రికెట్ వంటి జట్టు క్రీడలు ఆత్మవిశ్వాసం,క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని గజ్వేల్ సీఐ రవికుమార్ అన్నారు.హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలోని ఐఓసీ మైదానంలో నిర్వహిస్తున్న ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరానికి గజ్వేల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్,కార్యదర్శి బాకీ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ,రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.నెల రోజుల పాటు కొనసాగే ఈ శిబిరంలో ఆసక్తి గల యువ క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు.సీఐ రవికుమార్ మాట్లాడుతూ, ఇటీవలి కాలంలో యువత మొబైల్ ఫోన్లకు అధికంగా అలవాటు పడి అనారోగ్యాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.తల్లిదండ్రులు పిల్లల్లో ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పిస్తూ, క్రీడల పట్ల ఆసక్తి పెంచాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, భవిష్యత్తులో మంచి క్రికెట్ క్రీడాకారులను తయారు చేయాలనే ఉద్దేశంతో హరిప్రసాద్,బాకీ స్వామి ఉచిత శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారని అభినందించారు.గజ్వేల్ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అలాగే,"యువత డ్రగ్స్,ఆన్‌లైన్ బెట్టింగ్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, క్రీడలపై ఆసక్తి పెంచుకుని ఆరోగ్యంతో పాటు భవిష్యత్తును కూడా కాపాడుకోవాలని సూచించారు".




# గంజాయి, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉక్కుపాదం

**మహేశ్వరం సీఐ రాఘవేందర్ రెడ్డి హెచ్చరిక**

మహేశ్వరం, మే 13, (ప్రజా కలం)

మహేశ్వరం మండల కేంద్రంలో బుధవారం మహేశ్వరం సీఐ రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నివారణ, డ్రంక్ అండ్ డ్రైవ్ నియంత్రణ, అక్రమ గంజాయి రవాణా, రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించడం, యువతను మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సీఐ తెలిపారు.సదస్సులో సీఐ మాట్లాడుతూ గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. అక్రమంగా గంజాయి రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల ప్రమాదాలు అధికమవుతున్న నేపథ్యంలో మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. ఇటీవల ఇతర రాష్ట్రాల నుంచి జీవనోపాధి కోసం వచ్చిన కొందరు వ్యక్తులు సరైన గుర్తింపు కార్డులు లేకుండా సంచరిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. నేపాల్ గ్యాంగ్ తరహా సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఆధార్, గుర్తింపు పత్రాలు లేని అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నామని చెప్పారు. సరైన ఆధారాలు చూపించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు, అక్రమ కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం ఎస్సైలు రాఘవేందర్, ధనుంజయ్, ప్రసాద్, పోలీస్ సిబ్బంది, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 13 ప్రజా కలం : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపాలిటీ లో బుధవారం కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో



ఉదయం 11 గంటలకు కో ఆప్షన్ సభ్యుల ఎన్నికను స్థానిక చైర్మన్ పద్మ శ్రీకాంత్, వైస్ చైర్మన్ మత్తమాల భాగ్యవతి, ఆర్డీవో ప్రభాకర్ ల సమక్షంలో నిర్వహించారు. ఈ ఎన్నికలో కో ఆప్షన్ సభ్యులుగా మహమ్మద్ అబ్దుల్ వహీద్, షాదబ్, పప్పు వెంకటేశం, చిట్టిమిల్ల అరుణ లు ఎన్నికయ్యారు. అనంతరం వారి చేత మున్సిపల్ మేనేజర్ వాసంతి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీవన్, కౌన్సిలర్లు, కార్యాలయ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వారోత్సవాలపై ప్రజా ప్రతినిధులకు వర్క్ షాప్ నిర్వహణ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 13 ప్రజా కలం : ఎల్లారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం పాఠశాల విద్యా ప్రజా



పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలపై వర్క్ షాప్ నిర్వహించినట్లు మండల విద్యాధికారి రాజులు తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11 నుండి 17వ తేదీ వరకు విద్యా వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా పాఠశాల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం అనే లక్ష్యంతో పాఠశాల విద్యాశాఖ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లకు అవగాహన కల్పించేందుకు వర్క్ షాప్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ప్రభాకర్, ఏఎంసీ చైర్పర్సన్ రజిత వెంకటరామిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ దశరథం, మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, ఎంపీడీవో తాహెరా బేగం, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, నియోజక వర్గంలోని మండల విద్యాధికారులు పాల్గొన్నారు.



# నిజామాబాద్ డీఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన గీత

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 13:

నిజామాబాద్ డీఆర్వోగా బి.గీత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు సిబ్బంది స్వాగతం పలికారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం డీఆర్వో గీత మాట్లాడుతూ.. జిల్లాలో రెవెన్యూ పరిపాలనకు సంబంధించి ఉన్నతాధికారి, ప్రజల సహకారంతో ముందుకు సాగుతామని తెలిపారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ.. సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఏవైనా ఇబ్బందులు ఉన్న వారు తనను సంప్రదించవచ్చని చెప్పారు. నిజామాబాద్ డీఆర్వోగా గీత బాధ్యతలు చేపట్టిన అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి అదనపు కలెక్టర్లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పూలమొక్కను అందజేశారు. అనంతరం జిల్లాలో పరిస్థితులపై డీఆర్వోకు పలు సూచనలు చేశారు.గీత హైదరాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ నివాస విద్యాసంస్థ సొసైటీ లో అడిషనల్ సెక్రెటరీగా పనిచేశారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన అదనపు కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా నిజామాబాద్ కు వచ్చారు. ఆమె తహశీల్దార్ స్థాయి నుంచి డీఆర్వో స్థాయికి పదోన్నతులు పొందారు.



# జేడీసీలో కొనసాగుతున్న విద్యా వారోత్సవాలు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 13 ప్రజా కలం : ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యా వారోత్సవాలు కొనసాగుతున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. వారోత్సవాలలో మూడవ రోజు అయిన బుధవారం కళాశాల అకాడమిక్ జాబ్ డ్రైవ్ లో విశిష్ట సేవలు అందించిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ కామర్స్ జంగం శివకుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ కెమిస్ట్రీ అరుణ్ కుమార్ తో పాటు సూపరింటెండెంట్ జంగం వసంత లక్ష్మిలను శాలువాలతో ఘనంగా సన్మానించామన్నారు. మొదటి సెమిస్టర్ నుండి ఆరవ సెమిస్టర్ వరకు ఎలాంటి బ్యాక్ లాగ్ పరీక్షలు లేకుండా రెగ్యులర్గా ఉత్తీర్ణత పొందిన బి ఏ థర్డ్ ఇయర్ సీమ, బి జెడ్ సి థర్డ్ ఇయర్ భానుప్రియ, హబీబ్ ఉన్నీసా బేగం, బిఏ తృతీయ సంవత్సరం అరుణ్ లను కూడా షీల్డ్ లతో సన్మానించామన్నారు.

అనంతరం ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... ప్రతిక్షణం అధ్యాపకుల నైపుణ్యాలను ఉపయోగించుకొని కళాశాల అభివృద్ధికి తోడ్పడుతూ ఉండాలని విద్యార్థులకు సూచించారు. అధ్యాపకులు సైతం విద్యార్థులకు మంచి విద్యాబోధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం చంద్రకాంత్, టి ఎస్ కె సి సమన్వయకర్త శివకుమార్, ఎన్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎస్ చంద్రకాంత్, రాణి, అధ్యాపకులు నాగానిక, డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ సిద్ధురాజు, కృష్ణ ప్రసాద్, గోదావరి, సురేష్ రెడ్డి, దశరథ్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.





# పోతుల గడ్డ రావుజీ నాయక్ తండాలో కొనసాగుతున్న 'జగదాంబ సమేత సేవాలాల్ మహారాజ్ మందిర ప్రతిష్టాపన' ఉత్సవాలు

- నేడు పౌరా దేవి పీఠాధిపతి బాబు సింగ్ మహారాజ్ చేతుల మీదుగా విగ్రహాల ప్రతిష్టాపన



కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 13 ప్రజా కలం : ఎల్లారెడ్డి మండలంలోని (బిక్కనూర్) పోతుల గడ్డ రావుజీ నాయక్ తండాలో ఈ నెల 12 నుంచి నిర్వహిస్తున్న శ్రీ శ్రీ జగదాంబ సమేత సేవాలాల్ మహారాజ్ మందిర ప్రతిష్టాపన ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో రెండవ రోజైన బుధవారం ఉదయం 8 గంటలకు శాంతి పాఠము, ఆవాహిత దేవత పూజ, దేవత హవనము, రుద్ర స్వాహా కరని దాన్యాధివాసము, అధివస హోమములు, గర్త సంస్కారము, మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ, చండీ హోమము, పంచసూక్త హోమము, సామూహిక సుహాసిని సహిత కుంకుమార్చన వంటి కార్యక్రమాలు నిర్వహించా రు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. నిజామాబాద్ కు చెందిన ఋగ్వేద ఘనపాఠి, వేద పండితులు జోషి మధుసూదన్ శర్మ ఆధ్వర్యంలో ప్రతిష్టాపన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం జరిగే జగదాంబ మాత, సేవాలాల్ విగ్రహాల ప్రతిష్టాపన ఉత్సవాలకు ఎమ్మెల్సీ, పౌరా దేవి పీఠాధిపతి బాబు సింగ్ మహారాజ్, స్థానిక ఎమ్మెల్యే మదన్మోహన్ రావు లు హాజరవుతున్నట్లు తాండ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండ నాయక్ ధనావత్ వసంత్ నాయక్, కార్బారి మాలవత్ రతన్ నాయక్, తాండ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగ నేపథ్యంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర డిజిపి సివి ఆనంద్

## నిజామాబాద్ జిల్లా నుండి పాల్గొన్న పోలీస్ కమిషనర్



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 13:

రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించిన తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) సి. వి. ఆనంద్, ఐ.పి.ఎస్. బుధవారం జిల్లా స్థాయి పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని కమిషనరేట్లు, జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, అదనపు డీసీపీలు, ఏసీపీలు మరియు సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ బక్రీద్ పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో, పరస్పర సహకారంతో జరుపుకునేలా పోలీస్ శాఖ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రార్థనా స్థలాలు, ఈద్గాలు,మసీదులు,ప్రధాన రహదారులు,మార్కెట్ ప్రాంతాలు మరియు జనసంచారం అధికంగా ఉండే ప్రదేశాలలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పండగ రోజున ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించి, వాహన రాకపోకలను సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా ఈద్గాల వద్ద పార్కింగ్ ఏర్పాట్లు,ట్రాఫిక్ మళ్లింపులు,అత్యవసర సేవలకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఎలాంటి అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు లేదా వదంతులు వ్యాప్తి చెందకుండా సైబర్ మానిటరింగ్‌ను మరింత బలోపేతం చేయాలని డిజిపి ఆదేశించారు. ఎలాంటి అనుమానాస్పద సమాచారం వచ్చిన వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అంతేకాకుండా మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులతో ముందస్తుగా సమావేశాలు నిర్వహించి సామరస్య వాతావరణం నెలకొల్పాలని తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సున్నిత ప్రాంతాలలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, డ్రోన్ కెమెరాలు , సీసీ కెమెరాల పర్యవేక్షణతో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని పేర్కొన్నారు. అన్ని చెక్పోస్టులలో 24/7 సిబ్బంది విధులు నిర్వహించాలని, పోలీస్ సిబ్బంది మరియు మునిసిపల్ అధికారులు రెవెన్యూ అధికారులు అందరితో కో-ఆర్డినేషన్ వర్గంతో విధులు నిర్వహించాలని తెలిపారు. నిజామాబాద్ జిల్లాలోని రెంజల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల సాతాపూర్ వద్ద జరిగేటటువంటి పశువుల సంతలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పండుగ విధుల్లో పాల్గొనే పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ఎక్కడైనా చిన్న ఘటన జరిగినా వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావాలని డిజిపి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా బక్రీద్ పండుగను శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ నిజామాబాద్ జిల్లా నుండి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య, అదనపు డీసీపీ అడ్మిన్ ఎన్. శుభం ప్రకాష్,అడిషనల్ కలెక్టర్ ( రెవెన్యూ ) కిరణ్ కుమార్,జాయింట్ డైరెక్టర్ అనిమల్ హస్బెండ్ డిపార్ట్మెంట్ గంగాధర్ , ఆర్మూర్ డి.ఏ.ఓ అచ్యుత్ రెడ్డి , నిజామాబాద్ , ఆర్మూర్ , బోధన్ , ట్రాఫిక్ ఏసీపి లు ప్రకాష్ , వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, మస్తాన్ అలీ , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొనడం జరిగింది.

# చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలి.-సిఐ రేణుక

మెదక్ ప్రజా కలం ప్రతినిధి మే 13

మెదక్ చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మెదక్ అల్లాదుర్గం సీఐ రేణుక చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్ సర్కిల్ పరిధిలోని టేక్మాల్, అల్లాదుర్గం, పెద్ద శంకరంపేట్, రేగోడు మండలాలలోని ప్రజలు పాఠశాలలకు కాలేజీలకు ఎండాకాలం సెలవులు వచ్చిన సందర్భంగా తమ పిల్లలు ఇంటి వద్ద ఉ ంటున్న సందర్భంలో చెరువులకు గుంటలకు వెళ్లినప్పుడు ఈత చేసేటప్పుడు తల్లిదండ్రులు



తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటి వద్ద ఉ న్నప్పుడు మొబైల్ ఫోన్స్లు యాప్ లో కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఇన్స్టాగ్రామ్, ఫేస్బుక్ లో గుర్తుతెలియని వ్యక్తులకు పరిచయం చేసుకొని మోసపోతున్నారని అన్నారు. పిల్లలు ఎటు వెళ్తున్నారు ఏం చేస్తున్నారన్న విషయాన్ని తల్లిదండ్రులు దృష్టి పెట్టాలన్నారు. తమ పిల్లల పట్ల తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకొని పిల్లల భవిష్యత్తు దృశ్య బాధ్యతయుతంగా ముందుకు సాగాలని సిఐ తెలిపారు.



# టిజిఎల్డీఏ చైర్మన్ గా చరణ్ కౌశిక్ యాదవ్ ప్రమాణ స్వీకారం

## కౌశిక్ యాదవ్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన తుంగతుర్తి రవి,కాంగ్రెస్ పార్టీ నాయకులు

మేడిపల్లి మే 13(ప్రజాకలం న్యూస్)

తెలంగాణ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చైర్మన్గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చరణ్ కౌశిక్ యాదవ్ ను పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,ఆర్.వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి బుధవారం హైద్రాబాద్ లోని వారి కార్యాలయంలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమం లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ,చరణ్ కౌశిక్ యాదవ్ వంటి యువ ఉత్సాహవంతులైన నాయకులకు కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ముఖ్యంగా పాడి పెంపకందారులు రైతులకు సంబంధించిన కార్యక్రమాలు వారి నాయకత్వంలో ప్రతి ఒక్క అర్హుడికి చేరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

తెలంగాణ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సంస్థ మరింత అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆయన పేర్కొన్నారు.?ఈ కార్యక్రమంలో బండి రాళ్ల భాస్కర్,కవిడె కుమార్, మహ్మద్ మజర్, మహిళా అధ్యక్షురాలు ఎన్ఎన్ కె దుర్గ, కోమల,పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సిరి సీడ్స్ ఆధ్వర్యంలో 2288 స్టార్ రైతు క్షేత్ర ప్రదర్శన

గజ్వేల్:13 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ మండలం క్యాసారం గ్రామంలో సిరి సీడ్స్ ఆధ్వర్యంలో 2288 స్టార్ రైతు ప్రదర్శన క్షేత్రం కార్యక్రమం ఘనంగా నిర్వహించడబడింది.రైతు బాలకృష్ణ రెడ్డి పొలంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సుమారు 200 మంది రైతులు హాజరై పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమానికి సిరి సీడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాకేష్ రెడ్డి సౌత్ జోనల్ మేనేజర్ అశోక్



కుమార్ హాజరై రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి పంట విశేషాలను వివరించారు.అలాగే ఉమ్మడి మెదక్ జిల్లా ఏరియా మేనేజర్ ఆంజనేయులు బృందం పాల్గొన్నారు. 2288 స్టార్ హైబ్రిడ్ పంటలో అద్భుతమైన మొక్క పెరుగుదల, సమానమైన కంకి నిర్మాణం,అధిక గింజ నాణ్యత, బలమైన కాండం అధిక దిగుబడి సామర్థ్యం రైతులను ఎంతో ఆకట్టుకున్నాయి.పంటను పరిశీలించిన రైతులు 2288 స్టార్ హైబ్రిడ్ పనితీరుపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తూ రాబోయే సీజన్లో పెద్ద ఎత్తున సాగు చేస్తామని తెలిపారు.సిరి సీడ్స్ సంస్థ 2001లో స్థాపించబడి,2026 నాటికి విజయవంతంగా 25 వసంతాలు పూర్తి చేసుకొని రజతోత్సవాలను ఘనంగా జరుపుకుంటోంది.నాణ్యమైన విత్తనాలు,రైతు నమ్మకం,అధిక దిగుబడే లక్ష్యంగా ముందుకు సాగుతున్న సిరి సీడ్స్ నేడు రైతుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని తెలియజేశారు.

# చివరి గింజ వరకూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది.. రైతులెవ్వరూ అధైర్య పడొద్దు

- రైతులు ఎవరు కూడ ప్రైవేటు రైస్ మిల్లర్లకు ధాన్యం అమ్ము కోవద్దు.
- టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి ప్రతినిధి మే 13( ప్రజా కలం):

చివరి వడ్ల గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ఈ విషయంలో రైతులెవరూ అధైర్య పడవద్దని టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం కంది మండలం కలివేముల గ్రామంలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు విషయంలో నిబద్ధత తో ఉందని, రైతులు పండించిన పూర్తి ధాన్యం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. ప్రైవేట్ రైస్ మిల్లర్ల వద్ద ధాన్యం అమ్మవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్దనే అమ్మాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ బ్లాక్ ప్రెసిడెంట్ చిద్రుప్ప రఘు, కంది మండల కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ మొగులయ్య, మాజీ ప్రెసిడెంట్ మోతి లాల్, పిఏసిఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ పవిత్ర, ఉప సర్పంచ్ నాగరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింహా రెడ్డి, వార్డు మెంబర్ లు, రైతులు పాల్గొన్నారు.






# మత్తు పదార్థాల నియంత్రణలో కెమిస్ట్‌ల పాత్ర కీలకం

## - అసిస్టెంట్ డైరెక్టర్ బిందు

నాగోల్, మే 13 (ప్రజా కలం ప్రతినిధి)

మత్తు రహిత తెలంగాణ లక్ష్య సాధనలో కెమిస్ట్‌లు కీలక పాత్ర పోషించాలని డీసీఏ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ బిందు పేర్కొన్నారు.నాగోల్ కెమిస్ట్ & డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాల మేరకు నాగోల్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఔషధాల విక్రయంలో పాటించాల్సిన నిబంధనలు, మత్తు పదార్థాల నియంత్రణలో ఫార్మసీ నిర్వాహకుల బాధ్యతలు, ప్రభుత్వం అమలు చేస్తున్న కఠిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. డ్రగ్ ఇన్స్పెక్టర్ సరిత, మేడ్చల్ కెమిస్ట్ & డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు వేణుగోపాల్ శర్మ, ప్రధాన కార్యదర్శి తిరుమల్ రెడ్డి, కోశాధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ బిందు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం "మత్తు రహిత తెలంగాణ" లక్ష్యంతో డ్రగ్స్




నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటంలో మెడికల్ షాపుల నిర్వాహకుల పాత్ర అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మందుల విక్రయం జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి అయిన మందులను వైద్యుల సూచన లేకుండా విక్రయించరాదని స్పష్టం చేశారు.డ్రగ్ ఇన్స్పెక్టర్ సరిత మాట్లాడుతూ ఔషధాల నిల్వ, విక్రయ విధానాల్లో పూర్తి పారదర్శకత ఉండాలని సూచించారు. అనుమానాస్పద లావాదేవీలు గమనించిన వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. సమాజంలో మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు ఫార్మసీ నిర్వాహకులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని తెలిపారు. మేడ్చల్ కెమిస్ట్ & డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు వేణుగోపాల్ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేస్తున్న మార్గదర్శకాలపై ప్రతి కెమిస్ట్‌కు అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు మత్తు పదార్థాల నియంత్రణలో కూడా కెమిస్ట్‌లు ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాగోల్ ,మారుతి నగర్ ,నర్సిరెడ్డి, వెంకటేష్ ,శరత్, వేణుగోపాల్ ,స్వామి , సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన అమెరికా పర్యటన హైదరాబాద్‌కు చేరుకోనున్న దేప సురేఖ - భాస్కర్ రెడ్డి దంపతులు

మహేశ్వరం, మే 13,(ప్రజా కలం)

తమ నలభై రోజుల అమెరికా పర్యటనను విజయవంతంగా ముగించుకున్నారు. గత నలభై రోజులుగా అమెరికాలోని వివిధ నగరాల్లో పర్యటించిన దంపతులు, ఉదయం శంషాబాద్ విమానాశ్రయం హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. కావున మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్నేహితులు, ఘన స్వాగతం పలికి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి గారు మీడియాతో మాట్లాడుతూ అమెరికాలోని వివిధ నగరాల్లో పర్యటించిన సమయంలో అక్కడ నివసిస్తున్న తెలుగు వారు మరియు కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులతో సమావేశమైనట్లు ఆయన తెలిపారు.గడిల పాలన ముగిసింది: గత ప్రభుత్వంలో కొనసాగిన గడిల పాలన మరియు ఫామ్‌హౌస్ సంస్కృతికి స్వస్తి పలికి, తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో 'ప్రజాపాలన' సాగుతుండటం పట్ల ప్రవాస భారతీయులు అత్యంత సంతోషం వ్యక్తం చేస్తున్నారు.రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఆకర్షిస్తున్నాయి. పారదర్శకమైన పాలన పట్ల వారు పూర్తి విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో నెలకొన్న సానుకూల వాతావరణం చూసి, తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు మరియు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు అయ్యేందుకు ఎంతోమంది ఎన్ఆర్ఐలు ఆసక్తి చూపుతున్నారని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకి ఈశ్వర్ ముదిరాజ్, టిపిసిసి ప్రచార కమిటీ సభ్యులు, సామెడి గోపాల్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి రామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూన్న గణేష్ నేత గట్ల రవీంద్ర, ధనరాజు గౌడ్ ఏఎంసి డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, అల్లే కుమార్,నందిగామ నర్సింహ, చెపంగి ప్రవీణ్,బొక్క భూపాల్ రెడ్డి, యాదవ రెడ్డి, జ్ఞానేశ్వర్ యాదవ్, దంతోజు నరసింహ చారి,శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ప్రజా కలం దినపత్రిక ప్రత్యేక కథనం

ప్రజా కలం ప్రత్యేకం..

# ఇళ్లు లేని పేదోడి కళ్ళలో ఇందిరమ్మ కాంతి

- 'ఇందిరమ్మ ఇళ్ల పథకం' తో సాకరమవుతున్న నిరుపేదల సొంతింటి కల....
- నిర్మాణాలు పూర్తిచేసుకుని వెల్లువలా కొనసాగుతున్న గృహా ప్రవేశాలు
- ప్రభుత్వ సహాయంతో హర్షం వ్యక్తం చేస్తున్న నిరుపేద కుటుంబాలు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 13 ప్రజా కలం : గత కొన్ని ఏళ్లుగా తమ సొంతింటి కల నెరవేరుతుందో లేదో తెలియని పరిస్థితుల్లో ఉన్న నిరుపేదలు ఎందరో. అలాంటివారి పాలిట ఇందిరమ్మ ఇళ్ల పథకం వరంలా మారింది. ఈ పథకం కింద సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులను గుర్తించి విడుతల వారిగా 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందజేస్తుండడం విశేషం. దీంతో తమ సొంతింటి కలలు నెరవేర్చుకోవాల నుకున్న ఎందరో నిరుపేదలు ఇల్లు కట్టుకొని సంతోషంగా గృహప్రవేశాలు చేస్తున్నారు. తమ సొంత ఇంటి కల సాకారం అయిందన్న సంతోషంలో గృహప్రవేశం సమయంలో వారి కళ్ళలోని ఆనంద భాష్పాలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నాయి. దీంతో గత కొన్ని రోజులుగా ఎల్లారెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా ఆయా మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకొని గృహా ప్రవేశాలు చేస్తున్న దృశ్యాలే కనిపిస్తున్నాయి.

**పలువురు లబ్ధిదారుల అభిప్రాయం వారి మాటల్లోనే విందాం....**

**నా చిన్నప్పటి నుండి పూరి గుడిసెలోనే నివాసం ఉన్నాం... ఇందిరమ్మ ఇంటి నిర్మాణంతో మా కల నెరవేరింది....**

**- అరికెల బాలమణి కిష్టయ్య లక్ష్మాపూర్ గ్రామం.**

నాకు ఊహ తెలిసినప్పటి నుండి మేము పూరి గుడిసెలోనే నివాసం ఉన్నాం.



ఇన్నాళ్లకు మాకు స్వంత ఇల్లు కట్టుకునే భాగ్యం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మదన్మోహన్ రావులకు తమ జీవితాంతం రుణపడి ఉంటాం. మేము బతికున్నన్ని రోజుల్లో సొంత ఇల్లు కట్టుకుంటామని ఊహించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తమ కల నెరవేరడం సంతోషంగా ఉంది.

**మా సొంతింటి కల నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి జీవితాంతం రుణపడి ఉంటాము**

**- బోధ సంతోషి, కొట్టాల గ్రామం.**



ఇన్ని రోజుల పాటు తమకు సొంతిల్లు లేక ఎంతో ఇబ్బంది పడేవాళ్ళం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయింది. ప్రభుత్వం ఇచ్చిన ఐదు లక్షలతో పాటు తాము కొన్ని డబ్బులు కలిపి సొంతింటిని కట్టుకొన్నాం. ఇప్పుడు ఎంతో సంతోషంగా ఉంది. మాకు సొంతింటి కలను నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాము.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతు న్నాయి...**

**- తాహెరా బేగం ఎంపీడీవో ఎల్లారెడ్డి.**

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయి. మొత్తం మండలానికి 344 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, ఇందులో ఇప్పటి వరకు 66 ఇండ్లు నిర్మాణాలు పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలు కూడా పూర్తయ్యాయి. మిగతా వాటిలో 303 ఇళ్లకు మార్కౌట్ చేశాం. రూఫ్ లెవెల్ లో 45 గృహాలు ఉన్నాయి. స్లాబ్ లెవల్లో 105 గృహాలు ఉన్నాయి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శుల ద్వారా అనుక్షణం లబ్ధిదారులతో టచ్ లో ఉంటూ వారికి ఏర్పడుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తున్నాం. వీలైనంత త్వరలోనే 100% ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయిస్తాం.








Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com